సాహితీ సుమాలు

డా॥ జె. కనకదుర్గ

సాహితీ సుమాలు

డా॥ జె. కనకదుర్గ

ముద్రణ : 2009

ప్రతులు : 500

వెల : 50-00

రచయిత

డా॥ జె. కనకదుర్గ,

రిటైర్డ్ ప్రిన్సిపాల్

సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం

ప్రతులకు :

డా॥ జె. కనకదుర్గ,

యన్. బి. 273,

రైటర్స్ బస్తీ, కొత్తగూడెం.

ముద్రణ :

తాహెర్ గ్రాఫిక్స్, కొత్తగూడెం.

సాహిత్య పఠనాభిలాషియైన

అమ్మకు

(శ్రీమతి జంధ్యాల లక్ష్మీప్రసన్నమ్మ)

(జననం : 1931)

అంకితం

డా॥ జె. కనకదుర్గ

తొలకరి ...

సాహిత్య విద్యార్థినిగా, ఒక గురువుగా తెలుగుసాహిత్యాన్ని విమర్శనాత్మక దృష్టితో మహిళాజన దృక్కోణం నుండి చేసిన పరిశోధనలను వ్రాసిన వ్యాసాలను ప్రచురించినా పూర్తి సంతృప్తి కలుగలేదు. ద్రష్టలకు స్రష్టలకు ఉన్న అవినాభావ సంబంధంతోనూ, అవసరార్థం ఆయా సందర్భాలలో సమయానుకూల స్పందనలతో భావజ్ఞతతో అడపాదడపా వ్రాసిన సృజనాత్మక కవితలను, కథలను, నాటకాలను ఒక చోటకు చేర్చి వాటిలో కొన్నింటిని ఒక సంకలన సమాహారంగా కూర్చి సాహిత్య సరస్వతిని సాహితీ సుమాలతో సమలంకరించాలనే సంకల్పం పుస్తక ప్రచురణకు పూనుకున్నది. సజీవ మూర్తులకంటే సాహిత్యాక్షరాలే శాశ్వితం. అక్షరాల గవాక్షాలలో తొంగిచూస్తే అందలి భావుకత మరింతగా అమరత్వాన్ని పొంది తరతరాలకు ఆలోచనామృతాన్ని పంచి మానవత్వాన్ని పెంచి అభివృద్ధి పథంలో మానవజాతిని నడిపించగలదు. సాహితీ సృజనతో సాహిత్యభారతికి సుమాంజలిని అందించటంలో భాగస్వామిని కావటం నా అదృష్టంగా భావిస్తూ, ఈ పుస్తక ప్రచురణా ప్రక్రియలో సహకారాన్ని అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ..

(జంధ్యాల కనకదుర్గ)

విషయసూచిక

కవితలు

కర్పూర నీరాజనాలు	9
వందనాల చందనాలు	11
వాసంతి కాగితం	14
సమత - మమత	18
వాణిజ్య గణతంత్రంరి	21
వసంత సాహితి	24
మాతృభూమి	28
పూలబాసలు	31
కార్మికుడా	34

కథలు

కాని బొట్లు	39
ఇంటి వెలుగు	52
మట్టిపల్లకి	65

నాటకాలు

ఈవూరికి ఆవూరితో....	75
చీకటి కడుపున కాంతి	81
వసతివనే వనితా కేళి	99

కర్పూర నీరాజనాలు

సింగరేణి కార్మికుడా నీకిదే సింహరాణి కరదీపిక
బొగ్గు పొరల చీకటి గుహలు
కార్మిక శక్తుల జీవన పుటలు
కాలగర్భాన పొరలుగా పొర్లాడుతున్న
భూగర్భపు బొగ్గును వెలుగులోకి తెచ్చి
వేన వేల వెలుగులకు మూల ఇంధనాన్ని కూర్చి
చిమ్మచీకట్లలో కొండంత వెలుగు నిచ్చేవాడా
మండుతున్న రైళ్ళలో మానవుల గమనానికి
మూల శక్తి నిధులను నింపే నీలి జాడల వృత్తివాడా
ఇంటింటా వెలుగుల ఇంధనానికై
కౌటంబిక బంధనాలను బలిపెట్టే సాహసికుడా
తట్టా చెమ్మాస్ సాక్షిగా
ప్రమాదాల అంచున పనిచేస్తూ
శక్తిని పణంగా పెట్టిన వ్యక్తిగా
బొగ్గు తీసిన యంత్రాన్ని తిప్పిన
భూగర్భపు కొవ్వత్తివై
భూచక్రానికి వెలుగునిచ్చే
సింగరేణి సూర్యుడువోయీ నీవు.
కర్మాగారాలలో ముడిసరుకుకు
మూలశక్తివి నీవు, కూపముక్తివి నీవు.
నీవు లేనిదే బొగ్గు రాశులు లేవు.
నీవు లేనిదే విఫణి వీధిలేదు.
నీవులేనిదే సింగరేణికి వాసిలేదు.
నీవులేనిదే నిశికి వెలుగులేదు.
ఆంధ్రదేశపు సిరుల కల్పతరువా
నీ జీవితానికి భద్రత కరువైనా
నీ జీవనానికి నూరేళ్ళాయుస్సు.

సింగరేణి కార్మికుడా! సిరుల సాధకుడా!
కరణమే వరణమని, కర్మమే ధర్మమనీ
ఘర్మమే చర్మవర్మమనీ శ్రమయే జీవన మర్మమనీ
సింగరేణి సిరులనిచ్చే మేటి కరముల వాడా
నిద్రలేమితో నైట్‌షిఫ్టు చేసి నల్లగా వచ్చే నిన్నుచూసి
చీకటి సిగ్గుపడి తెల్లబోయి పారిపోతుంది.
మొదటి బదిలీకి బయలుదేరిన నిన్నుచూసి
వెలుగుకు మూలవిరాట్టువు నీవేనంటూ
సప్తాశ్వ రథారూఢుడైన రవి నిన్ను స్వాగతిస్తాడు.
సాయంకాలపు షిఫ్టుకు వెడుతున్న నిన్నుచూసి వెలుగుపులుగు
రాత్రిపూట విద్యుద్దీపాల వెలుగును నేనివ్వనంటూ
వెలవెలపోయి సంద్రాన ముఖాన్ని చాటేస్తాడు.
దినదినగండం నూరేళ్ళాయుస్సుగా
చీకటి గుహలలోని బండక్రింద బతుకులు నీవి.
గాలివెలుతురులేని చోట కళ్ళ వెలుగును వెదజల్లి
పళ్ళ కాంతులలో పట్టిపెట్టి నిట్టూర్పులనుపరుస్తూ
కాలికస్పృహ కల్గిన కవితా పత్రాన్ని చేపట్టి
చిరంజీవివై విల్లసిల్లే సింగరేణి కార్మికుడా
సింగరేణి కార్మికుడా ! శ్రమ శక్తుల సంపూర్ణుడా
చీకటి పొదలో వెలుగువాకిళ్ళకు వారధి వంటివాడా
నల్లబంగారపు నిగనిగలకు వన్నెచిన్నెలనిచ్చే కార్మికుడా
నీ చరితం ధన్యం, నీ జీవన గమ్యం గణనీయం.

(1998)

వందనాల చందనాలు

నిరాడంబరతా, నిండు కుండ వ్యక్తిత్వం
బండరాళ్ళలో చైతన్యం కలిగించే మూర్తిమత్వం
మానవ యంత్రాలు పలికే తారక మంత్ర దివ్యత్వం
కష్టపడే కర్మ జీవులు యిష్టపడే కర్మయోగత్వం

అగాధపు ఆర్థికమాంద్యంలో పడిన అప్పుల గనులకు
బంగారపు భవితవ్యపు రక్షణ కంకణసూత్రంగా
సంస్కరణలకు అంకురార్పణ చేసిన సంకల్పం
సింగరేణి సిరులకు విరుల బాట వేసిన ఆదర్శం

యాజమాన్యం కార్మికులనే విభేదాలను మరిపించి
సింగరేణి సిబ్బందికి నల్లబంగారపు కుదురొక్కటేనని
అవినీతికి భరతం పడుతూ అలసత్వాన్ని ఆవలకు నెడుతూ
పని సంస్కృతికి పట్టం కట్టిన పరంధాములు

కష్ట జీవుల ఘర్మజల ఫలాల విలువలకై
విఫణి వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాల పోటీనెదుర్కొని
రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలో సహ భాగస్వాములై
వడ్డీల వడ్డింపును అడ్డుకొన్న చాణక్య చాకచక్యం

ఇంటింటా వెలుగులు పూయించే నల్లబంగారపు సంపదలకై
క్రమ శిక్షణ పెట్టుబడిగా కార్మిక రక్షణ ధ్యేయంగా
ఉత్పాదకతకు పెద్ద పీట వేస్తూ ఉత్పత్తి శక్తులకు అగ్రతాంబూలమిచ్చి
సన్మానించిన సహృదయం సజ్జనస్తవమానవీయం

అలుపెరుగని ఆలోచనలకు కార్యరూపం కల్పిస్తూ
యంత్రాలకు ఏడురోజులరోజుల పని మంత్రం ఉపదేశించి
వ్యయ క్రయాలకు అర్థం సమకూర్చిన సమర్థతతో
నష్టాల కష్టాలలో చిక్కుకొన్న సింగరేణి సంస్థని
లాభాల బాటలో నడిపించిన నరసింహం
అవని లోతులలో చితికే బతుకులకు భరతవాక్యం పలుకుతూ

సాహితీ సుమాలు

గని ప్రమాదాల నివారణకై భూగర్భ రక్షణ సూత్రాల అమలుకై
శిక్షణతో కూడిన ప్రమను పెంచిన కార్మిక రక్షరేకు

సమ్మెల సమ్మెట పోటులకు చలింపక
ఎన్నికల్లో వన్నెనెక్కిన కార్మిక వీరులతో చర్చలు చేసి
ప్రభువుల సమక్షంలో పరిష్కార దిశగా
ప్రభుతను చెల్లించుకొన్న విక్రమార్కులు

శ్రమైక జీవన సౌందర్యానికి సంక్షేమమే సత్య రూపమని
విద్యా ఆరోగ్య ప్రమాణాల పెంపుదల శాశ్వత ఆదాయమని
ఇంటింటా కనుల గనులలో వెలుగులనందించే
సమాచార సంబంధాలను సమకూర్చి
మాతృభాషలో మనసులతో మాట్లాడుతూ
సేవలో తరించాలంటూ తరలిన రాకాసుధాకరులు
ఉత్పత్తి శక్తులను సృష్టించటంతోపాటు
సైరన్ మ్రోతకు ముందే నాస్తా పెట్టి అన్నం అమర్చి
సంపదల దృష్టిలో పరోక్ష భాగస్వాములైన
కార్మిక జీవిత భాగస్వాముల సంక్షేమమే
కార్మిక క్షేమమనీ అదే సంస్థ శ్రేయస్సనీ
సజావుగా సంక్షేమ పథకాల అమలుకై
నిరంతరం కాంక్షించిన సంక్షేమ నిధి

కార్మిక జీవనానికి మంచి సేవలనందించిన శర్మాజీ!
సింగరేణి గుండెలకు శక్తినిచ్చిన వర్మాజీ!
కార్మిక కుటుంబాలను రక్షించగలిగే కార్ముక హస్తాజీ!
సంస్థ ప్రగతిని కోరుకున్న విశ్వకర్మాజీ!

ఉనికికీ ఉత్పత్తికి ఉన్న సంబంధం
పండుగల సంబరాల పలకరింపుగా
సమాచార లేఖల రూపపు కార్మిక బంధువు
కాలుష్యపుబారి నుండి కార్మిక సంరక్షణ నారాయణుత్తై
వాడవాడలా వన సంరక్షణకై వనరులనందించిన అర్తావని

ధ్యానమే జీవన జ్ఞానమని
శ్రమయే సింగరేణికి సమిధయని
పొదుపుయే కుటుంబానికి పెన్నిధియని
సంపదల మదుపే సంక్షేమానికి సన్నిధియని
నల్లబంగారానికి నిగనిగలద్దిన
నిగర్వి సింగరేణి నాయకుడు
శ్రీ ఎ.పి.వి.యన్. శర్మ గార్మ అధ్యక్ష పాలన
సింగరేణి చరిత్రలో స్వర్ణయుగం

మంచితనానికి మారు రూపంగా
సంస్థతో మీ సంబంధం
కార్మిక సంక్షేమ బంధమని
ఈ అనుబంధం శాశ్వతమని
అభినందనలతో అభివందనలతో

సింగరేణి బండరాళ్ళు కూడ ఎండలోకి వచ్చి
జీవన యాన మానవత్వాన్ని
ఎలుగెత్తి చాటుతూ నినదిస్తుంటే
సింగరేణి సిబ్బంది మానస్సాక్షిగా అందిస్తున్న
అక్షరాల చందన మాలను అందిస్తూ

సింగరేణి లాభాల బాటలో
సహభాగమైన మీకృషికి
సమర్పనంగా సమర్పిస్తే,
గ్రంథస్థ విషయానికి
విలువ కలుగుతుందనే
రచయిత భావనను
స్వీకరిస్తారని ఆశిస్తూ....

(2001)

వాసంతి కౌగితం

విధాత సృష్టికే విచిత్ర చైతన్యంతెస్తూ ధరిత్రి చేరింది ధాత్రురథం
చైత్రరథుని జేగంటలు విందుకై ముందుకొచ్చిన చూతలలన
నూతన గీతానికి పచ్చని వీనులను రిక్కించి విస్తరించింది.

ఆమని రాకకు రాగమాలించిన వాసంతానికి
పరవశిస్తూ తోరణాల తలలూపింది
మధూదయంలో మదాలాపి కలకూజితాలకు
మధూలి మదిలో మెదలిన మోదంతో
మధుస్మితంగా తలిరాకుల ఆతిథ్యం యిచ్చింది.

చిగురుటాకుల వగరు విందు చేసిన కాకలీ
ఆశలను వమ్ము చేసిన యువ వత్సరానికి పలికిన
వీడుకోలు గీతంలో విషాద నిషాదాలువిన్న
చిరుమామిడి చిన్నబోయింది.

మళ్ళీ వారసుడే పుట్టాలని శాసించినా
అజుని సృష్టిని అందగించే అమ్మాయి పుట్టినా
చిందుల తందనాల చందాలు
గంధర్వగానంలో గమకాలై విన్న
మాకందమాత మమతల సొనలు కార్చింది.

వాగ్దేవి వారసురాంద్రమని అక్షరాల
గవాక్షాలవేపు తొంగిచూస్తుంటే
ఆడపిల్లలకు చదువెందుకు, అబ్బాయికిచాలనే
గృహమేధి వాదంలో వివాదాన్ని
వనప్రియ సామగానంలో విన్న
పికవల్లభం కకావికలయింది.
కన్యవాసికంటె కట్నరాశికే
పుస్తె కట్టించిన పెళ్లి మేళాలలోని అపశ్రుతిని
రక్తకంఠం నిస్వనాలల్లో విన్న

అమ్రమం 'అది పెళ్ళి కాదని' నిట్టూర్చింది.
ఒడి బియ్యంతో అడుగిడి పెళ్ళి కూతుర్ని
వండమని పొయ్యిచూపి చెయ్యి కాల్చుకోమంటే
వంటయింటికే పరిమితమైన మట్టెలమ్రోతను
కింకర కాకువులో విన్న
గున్న మామిడి విన్నబాటుతో అకులతలలు వాల్చింది.

భర్తపెత్తనం భరతనాట్యమాడిస్తుంటే
సంసారంలో గతులు తప్పిన సరాగాలను
పంచమస్వరంతో పలకలేక పోతుంటే
రసాలం నిలువెల్ల సలసలమన్నది.

మంచినీళ్ళు తేవటానికి బిందె తీసికెళ్ళి
తానెందుకు వచ్చిందో మరిచిపోయి
కడివెడు కన్నీరు కార్చినందుకు విలవిల మన్నగోదారి గలగలలు
వసంత ఘోషి వేదనలో విన్న
మామిడి మనస్సు చివుక్కుమని చిన్న జీడిని కావులించుకొంది.

తల్లి వారసత్వం అందిపుచ్చుకొని
అందమైన ఆడపిల్లను అందించినా
వంశోద్ధారకుడ్ని ఇవ్వలేని వంశజాత అనే నెపంతో
మారు మనువు చేసుకోవాలన్న మొగుడి అలోచన
హరికంఠం ఆలాపనలో విన్న
వసంతద్రుమం తల్లడిల్లి ఎవరికోసమో తరచిచూసింది.

చైత్రరథం ఎక్కి వచ్చిన ధాతకు
పలుకుల కలికి 'అహంబ్రహ్మోస్మి' ని శ్రుతి చేస్తే
బంగారు బొమ్మలకే నవచైతన్యం తెస్తూ
ధరిత్రి తలరాతను మార్చే విధాతగావచ్చిన
ధాత నామ సంవత్సరానికి
కలకంఠి కూజిత స్వాగతాంజలివిన్న
సహకారం పచ్చని నవజీవనాన్ని సంతరించుకొంది.

పాప పుట్టుకకు పరవశిస్తూ హర్షమొందిన రోజే అసలైన ఉగాది.
చదువుల తల్లి వల్లమాలిన ప్రేమకు ఆడపిల్లలు
నోచుకున్నవాడే అక్షరాలా ఉగాది
శుల్కశూన్యమైన ప్రేమబంధాన్ని
జీవితసూత్రం పెనవేసుకొన్నరోజే
అర్థనారీశ్వరత్వానికి హారతిపట్టే
పండగనాడే పూజ్యమైన ఉగాది
భార్యమెదడు, భర్త ఆలోచన సంసారంలో
సమతూకమై జీవన మాధుర్యం తొణికిస లాడుతుంటే
సమాజ కల్యాణానికి పచ్చతోరణంగా ప్రతిరోజు పల్లవించే
ఉగాదికి నాంది ఈనాటి ఉగాది.

సమత మమత

ప్రకృతిలో శక్తికి ప్రతీక అమె
ఉత్పత్తికీ పునరుత్పత్తికి ఆధారం ఆమె
ఆమె ఎక్కువనీ తాను తక్కువవుతాడనే భయంతో
ఆమెకు నిరాధారం చేయాలనీ
తానే ఆరాధ్యనీయం కావాలనీ
ప్రత్యక్షదైవంగా మారాడు అతడు
ఆ "దేవత" వరాలిస్తే
ఈ "దేవుడు" శాసించాలనుకునాకున్నాడు.
ఆదిక్యత అతని సొంతంగా
సమాజాన్ని అందిపుచ్చుకున్నాడు.
వెలసిన మతాలన్నీ వక్రబుద్ధితో
ఆమెకై పాతాళంలోకి జారుడుబల్లపరచి
అతనికేమో స్వర్గానికి నిచ్చెనలు వేశాయి.
సంస్కృతి ఆమెకు వడ్డాణంకాగా
సాహితి అతనికి తొడుగయింది.
అతడు తన వళ్ళ మంటలు తగ్గించుకోవటానికి
కళ్ళలో అగ్గిని కక్కుతూ ఆమె కాళ్ళక్రింద నిప్పులు పోయటానికై
అతడు బ్రతికుండగా పరదానూ
చనిపోయాక ముసుగును అందించి
అదే అదే పాతివ్రత్యం అంటూ
నైతిక వైరుధ్యంతో ఆమె బ్రతికినా, చచ్చినా నేటికీ ఆరనితీరని 'సతిచితి' మంటలు
పేర్చాడు.
సృష్టిలోని తీయనబంధం.
'అతడు-అమె' సమానమనే సంబంధం
అధిక్యత అణిచివేస్తుంటే
జాతిప్రేమ కరువై తల్లి ప్రేమ కూడా తరుగైంది.
కొడుకు ఐనవాడని ఆకులువేయటం
కూతురు కానిదనేగా కంచాలు పెట్టటం
ఎంగిలి కంచాలు అమ్మాయికీ

చదువు సంధ్యలు అబ్బాయికీ
అచ్చంగాయలు ఆడుకుంటూ
పాటలు పాడుకుంటూ ఆమె
అతడి భోగానికి అనువుగా పెరిగింది
కాలచక్రం కదిలిస్తే
కొడుకుల్నే కనాలనే దీవెనలతో
వరకట్నపు పల్లకీ ఎక్కుతుంది.
తాతలనాటి వరకట్నాలు (అతడికి)
జీవనకటకటాలుగా మారితే
ఆమెకు వధ్య శిలలయ్యాయి.
తన కష్టాలే ఇక తన కూతురుకీ అని
ఆమె కన్నీటితో అప్పగింతలు పెట్టింది.
తల్లిదండ్రులు అబ్బాయికి సొంతంకాగా
అప్పగించిన నడమంత్రపు తల్లీతండ్రీ అమ్మాయికీ
'నంది అంటే నంది' 'పంది అంటే పందీ' అంటూ
తండ్రిమాటకు ఎదురుచెప్పకూడదనే
తల్లి ఆనవాయితీయే
ఆమెకు అనుశ్రుతంగా వచ్చిన ఆస్తికాగా
పురుషాధిక్యతయే ఒడి బియ్యంగా తెచ్చుకొని
వండుకు తిని జీర్ణం చేసుకోవటానికి
అత్తింట్లో అడుగు పెట్టింది.
కన్నవారు కన్నెత్తిఐనా చూడకూడని
నిస్సహాయస్థితిలో నీరవనిశీథితో చెలిమిచేసింది.
అత్త మామలల ఆరళ్ళు, ఆడబడుచుల ఆగడాలు
మూగ మొగుడి నటనలో
కవితకందని కష్టాలెన్నో పడింది ఆమె
బిందెడు నీళ్ళకై క్రోసెడు దూరం వెళ్ళి
ప్రకృతి మాత ఒడిలో కడివెడు కన్నీళ్ళు
కార్చినందుకేనేమో భూగోళంమీద
మూడొంతులకుపైగా నీళ్ళు నిండాయి.
అతనికి వడ్డించిన విస్తరివంటి
అందమైన అందుబాటైన జీవితం

ఆమెది వంటావార్పుల
చితుకులగతుకుల జీవనం
దశమగ్రహాల దాడులతో కన్నవారు నన్ను వారు కాగా
నమ్ముకున్న మొగుడు నట్టేట్లో ముంచుతుంటే
కట్టుకున్న నట్టింట్లోనే గుడ్లనీరు గుడ్ల కక్కుకుంటూ
దుఃఖాన్ని దిగమింగుకుంటూ
అత్తింట్లో ఉండలేక పుట్టింటికి వెళ్ళలేక
నూతుల చెరువుల వెదుక్కునే ఆమె
ఆడదానిగా పుట్టటం కంటే
అడవిలో మ్రానుగా పుట్టటం నయం అనుకుంది
కానీ.... అక్కడా
కార్చిచ్చు కౌగిలించుకుంటుందనీ
అలా కూడా బ్రతకనీయదీ సమాజం
కడదశలో కన్నకొడుకు తిండిపెట్టటానికి
కసురుకుంటే కడుపుతీపి కరువై
కాటికి కాళ్ళు చాచుకునే వేదాంతిగా
ముగిసే జీవితాలకు
అసమానత గొడ్డలిపెట్టై
వ్యవస్థ వెన్నుపోటు పొడిచింది.
కాని మారుతున్న కాలం !
వెన్ను చరచి ముందడుగు వేయిస్తోంది
పంట ఎక్కువై మంది తక్కువైన రోజులు అవి
వంట ఎక్కువై మంటలెక్కువైన రోజులు ఇవి
వేన్నీలకు చన్నీళ్ళు అవసరం వచ్చి
ముంగిటివాకిలి దాటనిచ్చిదీ సమాజం ఆమెను
అవకాశాన్ని దొరికి పుచ్చుకోవాలి
అంటే....
చలంలా భూమ్మీద నిలబడకుండా
పారిపొమ్మనికాదు
అచలంలానూ కాకుండా
ఆమె కాళ్ళమీద ఆమె నిలబడాలి
కంప్యూటర్ల యుగంలో

ఆడపిల్లలకు మానవ కంప్యూటర్
అబ్బాయికంటే అమ్మాయే మిన్న అన్నది నిజమౌతుంది.
కడుపునిండా తిండిపెట్టి కొడుకును బడికి పంపిస్తున్నా
పొట్టకోస్తే అక్షరంముక్కలేదు
అదే అక్షర జ్ఞానాన్ని ఆడపిల్ల కందిస్తే
లక్షలు వేలు విలువ చేస్తుంది.
అన్నిట్లో అందెలేసిన చేతితో
పందాలలో ముందడుగు వేస్తూ
పరుగెత్తుకుంటూ సైన్యంలోకి చేరుతోంది.
ఆలనతో ఉయ్యాలలూపే అలలనయే
పాలనలోనూ నిగ్గు తేలుతుంది.
అక్షరమనే ఆయుధంతో
అసమ వ్యవస్థ నెదుర్కొంటోంది.
అక్షరజ్ఞాన ఆమెకు అక్షయ జీవితాన్నిస్తుంది.
కష్టానికి తగిన ఫలాలనిస్తుంది.
వరకట్నాల కోరలను పెకిలిస్తుంది.
అత్యాచారాలనెదుర్కొంటోంది
ధైర్యంగా చట్టాలకు పట్టియిస్తుంది
దేశానికి ఇదివరకే స్వాతంత్ర్యం వచ్చినా
ఇప్పుడే ఆమె జీవితానికి నిజమైన స్వేచ్ఛ
కంటి నీటి తుడుపుగా కమీషన్ల నెన్ని వేసినా
నైతిక వైరుధ్యపు కాలుష్యం కడిగిపోనంతవరకూ
సమాజంలో సమత్వం రాదు. సమైక్యత లేనేలేదు
జీవితానికి అర్థం సమదృష్టితో మనగలగటం
సమాజానికి అదే పరమార్థం అవ్వాలి
అస్తవ్యస్తంగా అసమ వ్యవస్థ నెట్టిన
దురవస్థలలో అవస్థపడిన ఆమె
ఆమె జీవిత సమస్యలకు నిన్నటితో అస్తమయం
సమతా మమతల సమ్మేళనంతో
సమాజ మానవతకు నేడే ఉషోదయం.

(1991)

వాణిజ్య గణతంత్రం

ప్రపంచ పద్మవ్యూహంలోకి
ప్రతిధ్వనుల హోరులో
పొదవిపట్టుకొన్న మంచిచెడుల మధుపాత్రతో
అపూర్వమైన మెరికలాంటి మానవీకరణ
సమ్మోహన స్వేచ్ఛావిఫణి విసరిన
బహుతంత్రాల కుతంత్రపు
మరీచకల ఎరబాణాల తాకిడికీ
తట్టుకోలేని భారతావని చివరకు
ఒంటికాలినడకన చేరుకోక తప్పలేదు.
అప్పులు చేసేదేశాలతో వర్తకం కన్న
వర్ధిల్లిన దేశాలతో వాణిజ్యం మిన్న
ఖాతాల గొయ్యికన్న ముసాయిదా నుయ్యి మిన్న
పంచుతుంది దేశాల సయోధ్యతాభాండం
పంచుతుంది సంపదల సమతామృతమని ఆశపడితే
వర్ధమాన దేశాలపై అక్షరాల మరకలతో
మడతపేచీల పేజీలతో ఉన్న
డంకెల్ సంకెలల ముసాయిదాపై
సంతకాలు నిశానీలను తలదన్నినా
నలుగురితో పాటు నారాయణ అని అనకతప్పలేదు.
రంగురంగుల వలలు అల్లుతూ
పత్తి కోటాలకు కత్తివేటు వేస్తూ
రాజకీయాల స్వేచ్ఛావిపణి
నాణ్యతలేదనే సాకుతో
ఆశతో ఎదురుచూస్తున్న రైతుకు
కళ్ళల్లో వత్తులేసుకోవటానికి
పత్తిని మిగుల్చుకోమనకముందే
ఎగుమతుల గొంతు నులుపకమునుపే
పత్తిరైతులు ప్రావీణ్యతతో పాటు
నాణ్యతను పెంచాలి

చెరుకుపై సబ్సిడీల కోతవ్రేత
తీసి జీవితాలను చేదుచేరుకోక మునుపే
ఉత్పత్తుల పరిశోధనలు మరింతగా ఫలవంతం చేయాలి

ఔషధమూలాలను మరతుపాకిలో
మందుగుండ్లుగా మార్చి
గుండెకు గురిపెట్టి చిచ్చు పెడితే
స్వదేశీయ శోధనకై సమిధలను చేర్చాలి.
ఆకాశానంటే ధరలతో మందులు గగనకుసుమాలైతే
అందుబాటులోని మందునుబట్టే
రోగికి సంధి లక్షణాలుండాలని
వైద్యునికి సందిగ్ధ లక్షణాలువస్తే
చట్టాలవురులు వైద్యులపాలిటి ఉచ్చులై
మరింతగా బిగుసుకు పోవచ్చు
ముక్కెక్కడంటే ముఖంచుట్టి చూపించినట్లు
పంటలమ్మిన రూపాయి ఖర్చుకాగా
మళ్ళీనాట్లకు డాలర్లు ఖర్చుపెట్టాలి
పేటెంటు హక్కుల ఉత్పత్తులు
అన్ని దేశాల నిష్పత్తులైతే
కాలుష్యపు భూత్కారాల వర్ధమానదేశాలలో
ప్రకృతి వినాశానాన్ని కల్గిస్తాయి.
రాబడి తక్కువైన దేశాలలో
దిగుమతి సుంకాల తగ్గింపు
ఎగుమతులతో సరితూగలేక
అరుపైసల అణా విలువలా
రూపాయి సున్నాగా మారుతుంది.
విలువలు తగ్గించటానికి వీలులేనంతగా
బొరుసువైపు బొమ్మ చేరుకుంటుంది.
శిశిరంలో చలిమంటలు రేపినా
దిగుమతి సుంకాల తగ్గింపు హేమంతంలోని
పెదవి విరువుల ఆకులురాల్చినా

పట్టించుకోని వసంతం
విషాదపు నిషా మధుపాత్రను అందుకుంది

ప్రచండమేధావుల వంగడాలనందించటానికి
గ్రీష్మాంతం తొలకరి జల్లులనిస్తే
మొలకలెత్తిన నారుల
అత్తారింటికి పంపించే ఆడపిల్లనుకన్న తల్లిలా
వర్ష ఋతువులో కన్నీరు మున్నీరవుతున్నాయి
శరదృతువులోని ఔషధీచంద్రుడు
అగ్రరాజ్యాలవైపే తొంగిచూస్తున్నాడు.
పన్నులను తగ్గించినా అపన్నులనే
పెంచుతుందని తెలిసినా
వాణిజ్యాల మెసులుబాటుకై
తప్పని సరిచుట్టమైంది ఒప్పందాలపత్రిక
వనరుల వినియోగపు హక్కులను కాలరాచే
వాణిజ్యాల ముసాయిదా
విఫణ వ్యవస్థలో విలువలను నేలరాస్తుంది
మానవులను స్వార్థపరులగా మారుస్తూ
మనిషి మనిషికీ మనసులు కలకకుండా చేస్తుంది.

బహుకుతంత్రాల వాణిజ్యతంత్రానికి
గణతంత్ర దినోత్సవమంత్రాలతో
వర్ధమాన దేశాల జంత్రగాత్రంతో
వర్ధిల్లుతున్న దేశాలకు
విలువల అడ్డుకట్టవేయాలి.
పెరిగిన సంపదలే పెంచుతాయి విపణి స్వేచ్ఛనని
స్వదేశీయోత్పత్తులతో పురోగమిస్తు
అధోగమన దేశీయ ద్రవ్యవిలువలను
అధిగమించటంవిన మరి దారిలేదు

(1994)

వసంత సాహితి

అంగిరస ఆరంభం ఆహ్వానమిస్తోంది వసంతానికి
సింగరేణి గనులు స్వాగతం పలికాయి వసంత కళాసాహతికి
ఆహూతుల దరహాసాలే మల్లెలసుమాలు
కవులగానాలే కోకిల కూజితాలు
సారసకవితలే సహకారాలు
గేయ సౌరభాలే మలయ మారుతాలుగా
వసంతానికి పసందైన మరందపు విందు చేయాలని
ఉగాది ఉషస్సులతో ఊపిరి పోసుకొంది
వసంతకళా సాహితి పుట్టి పుణ్యావచనం చేసుకొంది

ప్రకృతి వసంతపుటంగీని ధరించిన వేళ
నవ్య కవుల సమావేశంలో భవ్య సందేశాల
షడ్రుచీ సమున్మీలన పీయూషపుపాత్రతో
సమ్మోహినిలా సరసవాహినిలా
ఆమని తోడు రాగా
సరస భారతి తరలివచ్చింది.

ప్రకృతి పారవశ్యానికి పులకించిన కోకిల
పరిమిత సంతానపు గీతిని
పంచమస్వరంతో ఆలాపిస్తూ
పలికింది ప్రజోత్పత్తికి వీడుకోలు
గుమ్మాలతో చెలిమి చేసే గున్నమామిడి
విన్నానంటూ తోరణాల తలూపింది.

పర్యావరణంలోని కాలుష్యానికి కినుక వహించిన కోయిల
కఠోర షడ్జమాన్ని అందుకుంటే
చిరుమామిడి చిన్న బోయింది

మాట వరసకున్న చట్టాలపై
కట్నాల మంటల మింటికెగిసి
కర్బనపు కాలుష్యంతో కలిసిపోతుంటే
ఎంతని ఆస్వాదించగలమని
రసాలం కన్నీటి సోనలుకార్చింది
ప్రాణ వాయువుల్ని వదిలింది.

పరిశ్రమల పూత్కారపు కాలుష్యం
పెరుగుతున్న జనంతో పోటీ పడుతూంటే
పుర నిర్మాణాలలో అంతరిస్తున్న అడవులు
వర్ష శూన్యానికి అద్దం పడుతూ
మూలవనరులు మలిన మవుతుంటే
వన ప్రియగానంలో కల ధ్వనులనినదాలను
కవికోకిల కూజితాలలో
ప్రకృతి సమతుల్యపు శ్రుతి చేస్తే
పంచమ స్వర ఆలాపనవై
వచ్చిన సాహితీ వసంతమా

విశ్వనాశనానికి వినాశకర
రసాయనాల విషయ వాయువులతో
కంతలు పడిన 'ఓజోను'.
వింత రోగాలనిస్తుంటే
అణ్వాయుధాల మారణ హోమం
వికలాంగుల మనో శకలాలనిస్తుంటే
విమానాల వాహన రణ గొణ ధ్వనులు
ఆకాశాన్ని చిల్లులు పడేస్తుంటే
అణవణువున అల్లుకొన్న అవినీతి కాలుష్యం
అవనిని కంపింప చేస్తుంటే

మధూదయంలో మానవుల మనుగడకే
ముప్పు వస్తూంటే
బరువుగా గళం విప్పిన పికానికి
బాధోపశమనంలా వచ్చావా
సాహితీ వసంతమా
అకలి మంటలకు అజ్యంపోస్తూ
అధిక ధరలు ఆకాశాన్నంటినా
సబ్సిడీల కోతలు పేదల మూతివాతలైనా
వసంతాగనమంలో మన్మోహనంగా
వచ్చిన బడ్జెట్టుకు లోబడక
సంపన్నులతో సమానంగా
ఆపన్నులకు అందుబాటులోనున్నదీ
పండుగ పచ్చడి ఒక్కటై
బంగారపు బాండులు పెట్టినా
గోల్డెన్ షేక్ హాండులిచ్చి పంపినా
తీరని నిరుద్యోగపు నిస్పృహ
యువతను నిర్వీర్యం చేస్తుంటే
ప్రైవేటీకరణ విఫణితంత్రుపు
ప్రకటనలో పడుచుపిల్ల
పదహారాణాల సంస్కృతిని
అణుపైసలకు జిగజార్చుతుంటే
మందిర్-మసీద్‌ల మత వైషమ్యాలు
చక్రాలుగా రాజకీయ సారథ్యంతో
చైత్ర రథం సాగుతుంటే
పండక్కి పదిరోజుల ముందుగా రావాలనుకున్న చుట్టాలు
నిర్లక్ష్యపు పట్టాలపై పట్టు తప్పిన
రైళ్ళ ప్రమాదాలలో చిక్కుకుంటే
బడా చోరులు బాలనేరస్థులకు తర్ఫీదునిస్తుంటే
మేధావులు నరమేధంలో సమిధలై పిచ్చివాళ్ళవుతుంటే

ప్రకృతి సత్యాలకు ప్రతీకలుగా
పత్రికలు నిలువ లేకపోతుంటే
ఖలిస్థాన్ –కాశ్మీరీ మిలిటెంట్ల
హింసోన్మాదపు నరబలులెక్కువవుంటే

మూగబోయిన వాసంతికాగానంలో
మాధుర్యం నింపాలీ ఉషోదయం
అక్షరజ్ఞానం లేక అలటిస్తున్నా ప్రజానీకానికి
అక్షరజ్యోతి ఆకార పథకం
'అ' కారంతోనే ఆగనీయవద్దనీ
జన శిక్షణాలయాలే కర్షకులపాలిటి
కల్పవృక్షాలై
బాలికల చేతా బలపం పట్టించాలంటూ
వసంత సాహితి
అంగీరస వత్సరానికి
అక్షర నీరాజనాలు అందిస్తోంది.
అత్యాచారాలు విషాదపు
నిషాదాన్ని పలికిస్తున్నా
ఉగాది కవుల వసంతగానం
గంధర్వగళ పంచమాన్నే పలికిస్తుంది.
శ్రీముఖానికి పునాదిగా
వసంత సాహితీ సందేశం
కావాలి అపర గీతోపదేశం

మాతృభూమి

అయ్యో ! పాపం ! పాదాలు లేని పిల్లడా!
మళ్ళీ పుట్టాడు అనూరుడు అన్నారెవరో
ఎవరా వనిత? వినతకు చెల్లెలా?
కాదు, నేటి భారతావనిలోని మాతృమూర్తి

బిడ్డను కళ్ళారా చూసుకున్న కన్నతల్లికి
కాళ్ళపాదాలు కనపడక
కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతుంటే
స్మృతుల వలయాలు సుడిగుండాల నిలయాలైనాయి

ముద్దు ముద్దు నడకల ముద్దులగుమ్మ
నట్టింట మహాలక్ష్మి నడయాడబోతున్నదంటే
చాల్లే, వంశోద్ధారకుడే పుట్టాలన్న శాసనానికి
శ్వాసబరువై మనసు వికలమై కడుపున కోత పెట్టింది

వట్టి మనిషినిగాదని అత్తగారి చెవిన వెద్దామనివెడితే
వంట తొందరగా చేసితగలడు అనే గదమాయింపులు ఎదురై
ఏం చెప్పగలవంటూ నోరుమూయించినా
భళ్ళున వాంతి చేసుకోక తప్పలేదు

పెరట్లో అంట్ల గిన్నెలతో చెలిమిచేసి
నడుంపట్టినట్లున్నా నడుము వంచి బట్టలుతుకుతుంటే
బావి దగ్గర వైరతణి వాసనలు బాధపెడుతుంటే
మరో పదిరోజుల్లో మలేరియా వస్తుందంటూ
దోమలు మూగి రక్త పరీక్షలు చేసాయి

చెత్తా చెదారమెత్తి చెత్త కుప్పల్లో వేస్తుంటే
'రుబెల్లా' వ్యాధి క్రిములు రివ్వున దరిచేరాయి
వారసత్వానికి పోటీ పడ్డాయి

పేదరికం పొయ్యి వెలిగిస్తే కట్టెల పొగలు చుట్టుముడుతుంటే
ఉపిరాడక ఉబికివస్తున్న కళ్ళనీళ్ళు

కడుపులో బాధగా మెలిపెట్టాయి.

నీరసమనిపించి ఎంగిలి పడదామనుకుంటే
"వాడు రాకుండా అన్నం తింటావా, కూరవాడి కుంచు"
అన్న అత్తగారి అధికారస్వరానికి
కడుపులో బిడ్డ తలక్రిందులయ్యాడు.

చేత సిగారుతో నిత్యాగ్నిహోత్రుడిలా
దమ్ములాగుతూ విచ్చేసిన మొగుడికి
కాళ్ళకు నీళ్ళందించి కంచంలో వడ్డించి
తానేమో మింగుడు పడని పచ్చడి మెతుకులు తింటుంటే
కూర వేసుకోలేదమని పట్టించుకునే
నాథుడు కరవయ్యాడని రోదిస్తుంటే
కన్నీళ్ళను కూడా కరవు కానీయకమ్మా అని
గర్భస్థ శిశువు హెచ్చరించినట్లుగా
కడుపులో పోట్లు పెచ్చరిల్లాయి

నీరసంగా ఉన్నావు పళ్ళరసాలు తాగమని
డాక్టరమ్మ చెప్పిందంటే పళ్ళికిలించి
'రసం' వేసుకొని అన్నంతిను చాల్లే అన్న
భర్త మాటలకు అదిరిపడి
రసహీనమైన బతుకును తిట్టుకుంటుంటే
కడుపులో బిడ్డ చెమ్మగిలి ఉమ్మనీరు తాగినట్లనిపించింది.

మాతృమూర్తి పుష్టికై మంచిపుట్టుకకై
జన్మభూమికి డబ్బిస్తారంటే గ్రామసభకు
కాళ్ళీడ్చుకుంటూ వెడితే కాళ్ళపీక్కుపోయి
కళ్ళు తిరగటమే ఫలితమైంది.

దినదిన గండం నూరేళ్ళాయుష్షుగా
పుట్టిన తొమ్మిది నెలల పంట
బుజ్జి పాదాలతో బుడిబుడి నడకలు నడవలేదన్న
చేదునిజాన్ని దిగమింగలేక

తన కాళ్ళ మీద తాను నిలబడలేని కొడుకును కన్నందుకు
తనని తాను తిట్టుకుంది ఆ మాతృమూర్తి

పేదరికం, కాలుష్యం నిండిన ప్రకృతి
మాతృమూర్తిని నిర్లక్ష్యం చేసే అసమ సంస్కృతి
కలసి మరణ మృదంగం వినిపిస్తోంది వెరసి మానవాకార వికృతికి మూలమని
తల్లి పౌష్ఠికాహారంలోపం తనయుని కా అర్యోగ రథం యాంగ శాపం
తల్లి పుష్టికి తనూజుల తుష్టికి కదిలి
ఇంటింటా తల్లులకు వంటింట్లో వైద్యంగా

పౌష్ఠికాహారపు పాలుపండ్లు నిత్య నైవేద్యం చేయాలి.
శాపగ్రస్థ శిశువులు మూడు చక్రాల బండిపై
ముల్లోకాలు తిరగాలని వెన్నుతట్టి
ఉతకాళ్ళకు చేయూతనిచ్చి
చెంగట నిలిచి సేవలందించగల మానవత్వం
వికలాంగ సమాజానికి భరోసానివ్వాలి

కష్టాల వేసవిలో వికలాంగుల సేవలో
వెన్నెల చల్లదనాన్ని వావినందించగల గాలి మానవహారం
వాస్తవం వాసవీస్తవం కూడా.

సంపూర్ణ మానవ వికాసానికి
మానవజాతి మహోజ్జ్వలవృద్ధికి
ప్రకృతి ప్రాసాదిత పరదేవత మాతృమూర్తి
మాతృమూర్తి పుష్టికై మాతృభూమి తుష్టికై
మహిళా సాధికారతకు పాటుపడతూ
మానవులంతా మమతలను పంచాలి.

(1999)

పూలబాసలు

నాడు పూలబాసలు తెలుసు యెంకికి అన్నాష నండూరి
నేడు పూలబాసలు తెలుసంటోంది కవికోకిల

కారవ ఘోషల మారణ మాధూదయంలో
కలధ్వని కూజిత నిస్వన శూన్య వసంతానికి నిండుగా
మధుదయ వేళల్లో మల్లెల సౌరభంతో
జన్మదిన వేడుకలికై వచ్చిన వసంత కళాభారతి
జనావళికి నూతన కళను తేవాలని
అంగీరస అంపకాలకై పవమానపు హారతి పట్టి
విరోధాభాసంగా విచ్చేసిన వసంతానికి
తప్పనిసరి ఆహ్వానం పల్కుతున్నారు

పూలబాసల పాఠాలు నేర్చిన కవికోకిలలు
శ్రీముఖానికి అముఖంగా ఆశాముఖులై
ఆమని వేళల్లో సుమాంజలిగా అలరులు
సుగంధునితో సౌరభ స్నేహం చేసాయి
కళకళలాడే పండగవేళ ప్రజావళిని
కలవర పెట్టటం ఇష్టంలేక విరులు తలిపంకిచాయి.

చేయి చేయి పట్టి చేదోడు వాదోడుగా నడిచే అంతర్యం లేదని
చేమంతులు చింతతో కృశించాయి.

మానవత్వానికి అలంకారమవ్వాలనుకున్న మల్లియలు
బొంబాయిలోని బాంబులకు బెంబేలెత్తాయి
కణ కణమండే అగ్నికీలల తాపమెక్కువై
కనకాంబరాలు సంబంరాలు మానుకున్నాయి

గుడిసెల్లోకి దూకి గుంపులు గుంపులుగా చేసిన అత్యాచారాల్లో
సాక్షులుగా నవ మల్లికలు వాడిపోయాయి.
నిరుద్యోగ నిరాశ అంటించిన బస్సులో నుండి
రాకాసి బొగ్గులా బోర్లపడ్డ శరీరాలు చూసి

నీలాంబరాలు నల్లబంగారాలయ్యాయి
విమానాలపై వెళ్ళిన విద్రోహులను చూడలేనని
సూర్యకాంతం తలవాల్చేసింది.

అమ్మాయిల నేడిపించే రోమియెల చేష్టలకు
కన్నె గేదంగాలు కన్నీరు కార్చాయి.

కల్ల నెరుంగని పిల్లల నేరాలను మానమంటూ
లిల్లీలు ఆకుల రెక్కల నూపాయి.

సారా ఉద్యమం మానభంగాలకు ఊపు నివ్వగా
సరోజాల ముఖాలు ముకుళించుకున్నాయి.

మల్లెల సౌరభంలా మత్తెక్కించిన రాయితీలు
పిల్లలి ఏడుపు మాన్పించే తాయిలాలనీ
విరుల మకరంద స్రవంతులు
దరిద్రుల కన్నీటి ఝురులలో కలిసాయి
సుంకాల రాయితీలు చుక్కలా మినుకు మినుకు మంటుంటే
సరళీకృత పారిశ్రామిక పరిమళాలలో
సరకుల ధరలు తగ్గుతాయిని ఆశించి
అది పొరపాటని పొన్నపూవు నేలరాలింది.
ఆకలితో అలమటించే అనాధ బాలలకు
పూలపాలిచ్చి చిచ్చుకొడదామనుకుంటే
బడి నుండి వదిపోమనే లక్ష్మీపుత్రులను చూచి
పద్మం నిట్టూర్పును వదిలింది.

శ్రమజీవుల దోపిడీకి ఉపశాంతిగా
ముందుకొచ్చిన ముద్ద గులాబీ
పైరవీ దళారుల మధ్య నలిగిపోయింది
మార్కులు కోసమై తననుకోస్తున్న మందారాలు
మెడిసిన్ చదివి మానవత్వాన్ని నింపమన్నాయి

వేసంగి వేళల తాపాన్ని పెంచుతూ
చార్జీల పెంపుదల సంకేతంగా హోరెత్తే

కూతతో రైలు పరుగెత్తుతుంటే
కలువలు కన్నీటిమడుగులో
కలవర పడ్డాయి
స్వర్ణములు స్కేములు పూసే చెట్లపై
బంగారు తీగలై మేస్తూ ఉంటే
పారిజాతాలు నేలరాలుతూ రోదించాయి.

టెర్రరిష్టుల రక్తపుటేరుల్లో
కాశ్మీరం ముద్ద కట్టుకుపోయింది.

వరుడొచ్చి వలపులు నింపుతాడనుకొన్న వధువుల
వరకట్నాల చావులకు
వాసంతికాలు వలవల ఏడ్చాయి.

స్వార్థపరులచేతిలో సన్నగిల్లిన సామాన్యుని జీవితాలకు
సన్న జాజులు మరింత చిన్నబోయాయి

కూర్చున్న చెట్టును నరుక్కుంటే నాశనం తప్పదని
కాలుష్యం పెంచరాదనీ చెప్పే
అడవి మొల్లల ఆక్రందనలు
అరణ్య రోదనాలయ్యాయి.

మతాలెన్ని ఉన్నా మానవులందరూ
దేవుని పూజాసుమాలేనని
లతాంతాల గుత్తులు నెత్తావులతో
నాట్యమాడాయి

ఓఅక్షర జ్యోతిని దర్శించని నిరక్షరాస్యుల్లా
ఖమ్మంలో మృగ్యమైన నాగమల్లి
మూగబాసతో ఒంటరిగా రోదించింది

(2002)

కార్మికుడా

సింగరేణి కార్మికుడా నీకిదే సింహరాణి కరదీపిక
బొగ్గు పొరల చీకటి గుహలు
కార్మిక శక్తుల జీవన పుటలు
కాలగర్భాన పొరలుగా పొర్లాడుతున్న
భూగర్భపు బొగ్గును వెలుగులోకి తెచ్చి
వేన వేల వెలుగులకు మూల ఇంధనాన్ని కూర్చి
చిమ్మచీకట్లలో కొండంత వెలుగు నిచ్చేవాడా
మండుతున్న రైళ్ళలో మానవుల గమనానికి
మూల శక్తి నిధులను నింపే నీలి జాడల వృత్తివాడా
ఇంటింటా వెలుగుల ఇంధనానికై
కౌటంబిక బంధనాలను బలిపెట్టే సాహసికుడా
తట్టా చెమ్మాస్ సాక్షిగా
ప్రమాదాల అంచున పనిచేస్తూ
శక్తిని పణంగా పెట్టిన వ్యక్తిగా
బొగ్గు తీసిన యంత్రాన్ని తిప్పిన
భూగర్భపు కొవ్వత్తివై
భూచక్రానికి వెలుగునిచ్చే
సింగరేణి సూర్యుడువోయీ నీవు.
కర్మాగారాలలో ముడిసరుకుకు
మూలశక్తివి నీవు, కూపముక్తివి నీవు.
నీవు లేనిదే బొగ్గు రాశులు లేవు.
నీవు లేనిదే విఫణి వీధిలేదు.
నీవులేనిదే సింగరేణికి వాసిలేదు.
నీవులేనిదే నిశికి వెలుగులేదు.
ఆంధ్రదేశపు సిరుల కల్పతరువా
నీ జీవితానికి భద్రత కరువైనా
నీ జీవనానికి నూరేళ్ళాయుస్సు.
సింగరేణి కార్మికుడా! సిరుల సాధకుడా!
కరణమే వరణమని, కర్మమే ధర్మమనీ

ఘర్మమే చర్మవర్మమనీ శ్రమయే జీవన మర్మమనీ
సింగరేణి సిరులనిచ్చే మేటి కరముల వాడా
నిద్రలేమితో నైట్‌షిఫ్టు చేసి నల్లగా వచ్చే నిన్నుచూసి
చీకటి సిగ్గుపడి తెల్లబోయి పారిపోతుంది.
మొదటి బదిలీకి బయలుదేరిన నిన్నుచూసి
వెలుగుకు మూలవిరాట్టువు నీవేనంటూ
సప్తాశ్వ రథారూఢుడైన రవి నిన్ను స్వాగతిస్తాడు.
సాయంకాలపు షిఫ్టుకు వెడుతున్న నిన్నుచూసి వెలుగుపులుగు
రాత్రిపూట విద్యుద్దీపాల వెలుగును నేనివ్వనంటూ
వెలవెలపోయి సంద్రాన ముఖాన్ని చాటేస్తాడు.
దినదినగండం నూరేళ్ళాయుస్సుగా
చీకటి గుహలలోని బండక్రింద బతుకులు నీవి.
గాలివెలుతురులేని చోట కళ్ళ వెలుగును వెదజల్లి
పళ్ళ కాంతులలో పట్టిపెట్టి నిట్టూర్పులనుపరుస్తూ
కాలికస్పృహ కల్గిన కవితా పత్రాన్ని చేపట్టి
చిరంజీవివై విల్లసిల్లే సింగరేణి కార్మికుడా
సింగరేణి కార్మికుడా ! శ్రమ శక్తుల సంపూర్ణుడా
చీకటి పొదలో వెలుగువాకిళ్ళకు వారధి వంటివాడా
నల్లబంగారపు నిగనిగలకు వన్నెచిన్నెలనిచ్చే కార్మికుడా
నీ చరితం ధన్యం, నీ జీవన గమ్యం గణనీయం.

(1998)

కథలు

కార్తీ బొట్లు

అదిగో అల్లదిగో శ్రీహరివాసం అంటూ దూరంగా వైకుంఠములో పాట వినబడుతోంది. భూలోక కాంతల అనుభవాలను తిలకిస్తూ పండువారిన ఫలిత కేశాలను పరచుకొన్న కార్తీక చంద్రుడు సంధ్య చీకట్లను చెదరగొట్టా నిమిత్తమాత్రుడిగా, నిదానంగా ఆకాశపుటెడారిలో ప్రయాణిస్తున్నాడు. సూర్యకిరణాలను భరించగలిగి అమృతధారలొలికించగలచంద్రుడు భూమి మీద స్త్రీలు పడే కష్టాలను మాత్రం తాను భరించలేననుకొని దిగిరాను దిగిరాను దివినుండి భువికి అని భీష్మించుకూర్చున్నాడు.

ఏటిఒడ్డున పళ్ళాలలో దీపాలను పెట్టుకొని చీకట్లో నిల్చున్న పడుతుల మోములు మరింతగా వెలుగుతుంటే అందుకోవాలని ఆత్రుతతో కృష్ణమ్మ పరుగులు పెడుతూ వస్తోంది. ఇంటింటా దీపాలన్నీ కలిసిమెలిసి జీవితాల్లోని కష్టసుఖాలను వేరుచేసే సరోహంసాలుగా మారి కడలిని చేరాలని తహతహలాడుతున్నాయి. అలల ఒరవడిలో విడిపోయిన దీపాలు వియోగంతో కన్నీళ్లను మరిపిస్తూ ఝరులతో పోటిపడుతుంటే చూస్తున్న అలివేణి మస్తిష్కములోని ఆలోచనాతంగాలను మబ్బుల ముంగురులు కప్పేస్తుంటే సవరించుకుంటూ తలెత్తింది. ఆకాశం వైపు బాగా పరీక్షగా చూస్తున్న అలివేణి పైన చంద్రుడు ఏ నక్షత్రముతో ముచ్చటిస్తున్నాడో అనుకుంటూ ఎందుకో కాసేపు ఆ ఒడ్డునే కూర్చోవాలనిపించింది.

చిన్ననాటి స్నేహితురాలు కమల గుర్తొచ్చి తను కమల ఈ ఒడ్డునే చెప్పుకొన్న ముచ్చట్లు గుర్తుకు తెచ్చుకుంది. అన్నా ఒదినలు తనను చదువు మాన్పించినా తన స్నేహితురాలు కమల మాత్రం సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు తన అనుభవాలను, చదువుకున్న కథలను చెప్తుతుంటే జీవితం అంటే ఏమిటో తెలుసుకుంటూ తాను ఎన్నో సందేహాలు వెలిబుచ్చేది. కమల కొన్నింటికి మాత్రమే సమాధానాలు చెప్పేది. ఇప్పటికీ కొన్నింటికి సమాధానాలు దొరకక్క దీర్ఘాలోచనలతో శూన్యపు దిక్కులను వెదుకుతుండే తనకు మోహన్రావుతో పెళ్ళయింది. అన్నా ఒదినలు ఈ ఊరు వదిలి వెళ్లిపోతూ తమను వారి ఇంట్లో ఉండమంటే తాము ఇక్కడే ఉంటున్నారు. మైకులో గోదావరి పయ్యెద కృష్ణమ్మ వాల్జెడ అంటూ పాట వినపడుతంది. కృష్ణవేణమ్మ అలల జడలు అల్లుకుంటుంటే కలికిదనంతో పెట్టిన కార్తీక దీపాలు చుక్కల జడబిళ్లల్లా మెరుస్తూంటే అలివేణికి

మాత్రం అప్పుడు వెన్నల కాంతుల ముసుగులో తరంగాల అలజడులను మాత్రం మూడో కంటికి కనబడకుండా ఉండాలనే ప్రయత్నంతో ప్రకృతి గమనం జీవన నాట్యం చేస్తుందనిపించింది. జీవనయానం గుర్తొచ్చి ఇంటివైపుకి నడక సాగించిన అలివేణికి తన జీవితంలోని పొగమంచే ప్రకృతి అంతటా పరుకున్నటనిపించింది.

ఇంతలో చలికి కొంగు కప్పుకొని నడుస్తున్న అలివేణిని గుర్తించని ఆ ఊరిలోని ఒక మహిళ మరొకామెతో "చూసావా విమలా! ఊళ్లో ఆ చచ్చినాడు పని పాట లేకుండా పైసా సంపాదన లేకున్నా ఉంగరాల్ల వేళ్లతో జులపాల జుట్టుతో మరీ బలాదూరుగా తిరుగుతుంటే ఊరందరికి అప్పుడే అనుమానం వేసింది. ఏదో వయసులోవున్నాడు పోకిరిగాడని ఊళ్లోవాళ్ళు ఒదిలేశారు. కాని చూడు వాడు ఇప్పుడు ఏంచేశాడో తెలిసిందా? ఛీ!..." అంటూ మసక వెన్నల్లో స్పష్టంగా కనబడేటట్లు అసహ్యించుకుంది. "ఎవరూ లక్ష్మమ్మ" అంటూ విమల అడుగుతుంటే అలివేణికి అడుగు ముందుకు సాగడంలేదు. లక్ష్మమ్మ విమలకు కాస్తా దగ్గరై "పద పద వింటే ఇంకా వణికి పోతావు. అదే అలివేణి మొగుడు లేడూ వాడే మోహనరావు" అంటూ లక్ష్మమ్మ మెల్లగా చెపుతున్నా తనతోనే అన్నట్లుగా భావించింది అలివేణి. "ఆ మోహనరావు అప్పుడప్పుడు పట్నం వెళ్లి చేసే రాచకార్యం ఏమిటనుకున్నావూ! గుంటూరు వెళ్లినపుడు ఒక పెళ్లి, గుడివాడ వెళ్లినపుడు మరొక మనువట. గూడెం వెళ్లినపుడు ఒక పుస్తె వేసొచ్చినాడట. వీడికి పెళ్లి ఒక వ్యాపారమట. వీడికి ఏమి పోయేకాలమో!" అని లక్ష్మమ్మ అంటే విమల మాత్రం "వీడికి కాదులే పోయేది వీడిని కట్టుకున్న వాళ్లకి వచ్చాయి కష్టాలు. వాళ్ల ఖర్మ" అంటూ సాటి స్త్రీ కదా అని అనిపించిందేమో కాస్తంత సానుభూతిని ప్రకటిస్తూ "ఛీ. ఛీ... వింటానికే అసహ్యం పుడుతోంది. అయినా ఊరి పెద్దలు అందరూ కలసి ఈ పాటికి బుద్ధి చెప్పాల్సింది? ఆ ఊరి వాళ్ళు మొగవాళ్ళేగా .... అయినా మన ఆడవాళ్ళే? మగాడన్న తర్వాత తిరుగుళు ౦ండవా అని సర్దిచెప్పుకునే కాలములో మొగవాళ్ళేమి పట్టించుకుంటారులే. ఆడవాళ్ళం మనమే వాడ్ని ఊరి చింతచెట్టుకు కట్టేసి చితకబాది మరో పెళ్లి చింతలేకుండా చేయాలి." అంటూ విమల తన ఆవేశాన్ని వెళ్లబరుస్తూ ఆ కోపంతో తొందర తొందరగా అడుగులేస్తుంటే లక్ష్మి గూడా "ఆమెతో చెకచెకా నడచి వెళ్లిపోయింది. కాని ఆ బజారులో అందరికంటే చివరి ఇల్లు అవడంతోనూ అలవాటయిన దారి అవడంతో ఆమె అన్యమనస్కంగా ఉన్నా మాత్రం కాళ్ళు

నీరసంతో ఇల్లు చేర్చాయి.

తలుపు తీసుకొని ఇంట్లోకి వచ్చిపడింది అలివేణి. ఎదురుగా వున్న నులకమంచంపై కాసేపు పడుకొంది. లేచి అన్నం వండుకుతినాలనిపించలేదు. ఎవరికోసం వండాలి. తినాలి అని ఉసూరుమంటూ అలాగే పడుకొంది కడుపులో బిడ్డ అడ్డంగా తిరిగినట్టనిపించింది. పడుకున్నదన్నమాటే గాని ఆ మాటలే చెవుల్లో గింగురుమంటుంటే వద్దని నెట్టేస్తున్నా ముప్పిరిగొంటున్న ఆలోచనలతో మనసు కకావికలమయింది. చిన్నప్పుడు చూసిన సిమిమా రీళ్లలా ఈన జీవితం సుళు ్ల తిరుగుతోంది. చిన్నప్పుడు సంపూర్ణ రామాయణంలో దశకంఠుడు సీత దగ్గరకు వచ్చి "ఒప్పుకో" అంటూ భయంకరంగా చూస్తుంటే చిన్నతనంలో ఏమర్థమయిందోగాని ఆ దశకంఠుడి గొంతులను పట్టుకొని వరసబెట్టి మరీ నులిమి చంపేయాలనిపించింది. ఆ మనసేనా ఇలా మోడైపోయింది. ఏమి చేయలేక పోతున్నందుకు తన మీద తనకే అసహ్యం వేసింది. కాని ఓదో చెప్పాలని తపన తనకి ఆ రోజునుండి వుంది.

ఆరోజు తానెప్పటికీ మరచిపోలేదు దీపావళి పండుగ రోజు అందరు కృష్ణుడు నరకాసురుడిని చంపాడంటూ నరకుడి దిష్టి బొమ్మను కాలుస్తుంటే తనకు మాత్రం కొంగుదోపుకొని నరకుడిపై భాణంవేస్తూ సత్యభామ కళ్లముందు కనబడుతుంటే ఏవో ఆలోచనలొస్తున్నాయి. పండుగ పూట భర్త లేనందుకు మనసు బాధపడుతోంది. తనలో సగం శక్తి ఎక్కడికో వెళ్లిపోయిందా అనిపించినా నీరసంగా వరండాలో అరుగుమీద కూర్చుని కన్నీళ్లు కూడా కరువై శరీరం బండవారిపోయిందా అనుకుంటూ బియ్యం ఏరుతోంది.

దూరంగా మృత్యువు నీడ వెంటాడుతుంటే తొందర తొందరగా నడుస్తున్నట్టుగా ఎండలో వస్తన్న ఒక స్త్రీ మూర్తి కనబడింది. అవిడెవరో కొత్త మనిషిగా కనబడింది. ఆమె తన యింటివైపు వస్తుంది. దగ్గరైన కొద్దీ మరింత స్పష్టంగా కనబడుతోంది. చూడగానే చాలా పొందికగా వుంది. నల్లగా వున్నా సింగరేణి సుందరిగా మెరిసిపోతుంది చేతిలో మాత్రం చిన్న సూట్ కేసు వుంది. ఈ చివరింటికి వంటరిగా వస్తుందేమిటబ్బా అనుకుంటూ బియ్యంలో బెడ్డ ఏరడానికి తలవంచింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన అమె "ఏవండీ ఇక్కడ అలివేణి గారిల్లెక్కడండి" అని అడిగింది. "ఏ అలివేణి అండీ" అని తను

అనగానే ఆమె "మోహన్రావు భార్య అలివేణి అండీ" అంది. వచ్చినావిడ తన పేరు పెట్టి అడిగినందుకు అంతనీరసంలోనూ ఓపికొచ్చినట్లనిపించి ఆశ్చర్యమనిపించింది. అంతలోనే ఏదో స్ఫురించి "రండమ్మ నేనే! ఆ అలివేణిని" అంటూ ప్రేమగా మర్యాదగా ఇంట్లోకి ఆహ్వానించింది.

చాప పరిచి కూర్చోమనగానే ఆ పాతబడ్డ కొంపకు కాపలా కాస్తున్నట్లున్న ఆమెను పరీక్షగా చూస్తూ ఆమెతో " అక్కా! నా పేరు కృష్ణశ్రీ అంటరండీ అంది" అక్కా అని తనని సంబోధిస్తూ "నేను గూడెంలో ఉద్యోగం చేస్తున్నాను. ఒకసారి... ఒకసారి... మిమ్మల్ని కలిసిపోదామని ...." అంటూ ఇక మాట్లాడలేక పోయింది పాపం కృష్ణశ్రీ ముందుగా తనే తేరుకుని అలాగా మంచిదమ్మా! ఎండన పడి వచ్చినట్లున్నావు ముందు దాహం తీర్చుకుందువుగాని" అంటూ తాను గ్లాసులో కాసిన్ని మజ్జిగ ఇచ్చింది. మజ్జిగ త్రాగుతూ ఇల్లంతా కలియ జూస్తున్న కృష్ణశ్రీ తనకు మధ్య కొంతసేపు నిశ్శబ్దం తాండవించింది ఇక పరిచయం అనవసరం అన్నంతగా ఒకరి మనసు ఒకరికి అర్ధమై ఆర్ద్రమైపోయింది.

కృష్ణశ్రీ తలవంచుకొనే "వారు ఉళ్లోనే ఉన్నారా? అని అడిగింది. ఎవర్ని ఉద్దేశించి అడుగుతుందో అప్పటికే అర్ధం చేసుకొన్న తాను "ఊ లేరు ఊరెళ్ళారు" అంటూ ఎప్పుడొస్తాడో ఎక్కడికి వెడుతున్నాడో ఎప్పుడు చెప్పడం అలవాటులేని మొగుడ్ని ఒక్కసారి తలచుకునేసరకి తనకు దు:ఖమొచ్చినా తమాయించుకుంది తాను. ఆ మాటలకు ఒక్కసారిగా కృష్ణశ్రీ కళ్ల నుండి బొట్లుధారలుగా పారుతూ ఏడుస్తుంటే నేను కృష్ణ ముఖాన్ని ఎత్తిపట్టి "కృష్ణా నా కంటే చిన్నదానివి నా చెల్లెలులాంటి దానివని చెబుతున్నా.. . కన్నీళ్లెంతో విలువైనవమ్మా ఒక స్వార్ధపరుడి కోసం వ్యర్ధం చేయకమ్మా? ఆప్తుల కోసం భాష్పాలుకాని, అధముల కోసం కాదమ్మా" అని తను అంటుంటే కృష్ణ కళ్లల్లోని ఆశ్చర్యాన్ని తాను స్పష్టంగా చూడగలిగింది. ఆనాడు "నా మనుసులోని బాధను పంచుకోవాలంటే నువ్వే తగినదానివక్కా" అంటూ భుజం పట్టుకొని ఊపుతుంటే అలివేణికి రోలు వచ్చి మద్దెలతో మొరపెట్టుకున్నట్టనిపించింది.

అంతలోనే తను తెలివి తెచ్చుకొని "కృష్ణా! నువ్వు ఏదో ఒక రోజు ఇలా వస్తావని ఎదురు చుస్తున్నానమ్మా" అలివేణి అంటుంటే అదిరిపడ్డ కృష్ణ, "దీపావళి పండుగనాడు భర్త రాలేదేమని మా యింటి చుట్టువాళ్ళు అడిగితే చెప్పటానికి

నా దగ్గర సమాధానం లేక నన్ను నేను సంభాళించుకొని వాళ్లందరికీ అత్తగారింటికి వెళ్తున్నానని చెప్పి వచ్చినక్కా! కొత్త భార్యతో పండగ జరుపుకుంటాను నువ్వు రావద్దని కబురుచేస్తే దిక్కుతోచక ఇలా వచ్చానక్కా అంటూ గొంతు బొంగురుపోతుంటే మధ్య మధ్య కూడబలుక్కొని ఒక్కొక్కమాట ఆగుతూ చెప్పింది.

తానప్పుడు కృష్ణా! నువ్వొచ్చిన ఈ పండగపూట నాకు చాలా అందగా అనిపిస్తోందమ్మా ఇదిగో వారు ఊరికి వెడుతూ పోస్టుమేన్ ఇచ్చిన మనియార్డరు తీసుకొని జాగ్రత్తగా దాచిపెట్టు అని ఇచ్చారని చూపించింది తను చెప్పినప్పుడు కృష్ణశ్రీ "పట్నంలో ఉద్యోగం ఏమైనా దొరికిందా" అని ఆతృతగా అడిగేసరికి "ఆ మోహన్రావు కష్టపడడు తెలుసుగా, ఈ మధ్య ఉద్యోగం చేస్తున్న ఆమెకు పుస్తె కట్టాడు. దాని లాభం అంటూ అదేదో వ్యాపారంలో భాగంగా నాకు చెప్పుకుపోయాడు. నేనుండగా మళ్ళీ పెళ్లి ఎలా చేసుకున్నారని అడిగితే వెంటనే "ఆ నా యిష్టం మొగడ్ని నేను, గుంటూరు దానివని నిన్నెమో ఇల్లాల్ని..... చేసుకున్నా, గూడెం అమ్మాయికి తాడు కట్టి సొమ్ము చేసుకున్నాలే. ఆ మరిచి పోయాను. అందుబాటులో ఉండటానికి ఆ అందాల బొమ్మ అదే గుడివాడ సందరిని మూడో పెళ్లి చేసుకున్నానులే అంటూ తన అంతులేని కోరికల్ని ఉన్మాదిలావిలిబుచ్చాడమ్మా" అంది.

అదేంటండీ నన్ను అన్యాయం చేయటమేగాక ఆడపిల్లల్ని అందరినీ కూడా నాశనం చేస్తున్నారా అని కృష్ణశ్రీ దు:ఖిస్తుంటే "ఇదిగో ఇంకా ఏమన్నా వాగావంటే దేహశుద్ధి చేస్తానంటూ మీదకు వచ్చి ఏమనుకున్నాడో ఏమో మళ్ళీ ఇప్పటికే ఆలస్యమైంది అనుకుంటూవెళ్లిపోయాడమ్మా. ఆ మాటలకు మనసులో భూకంపం కల్గితే పుస్తెల్ని తడివిచూసుకోవడం తప్ప ఏమి చేయలేకపోయానమ్మా. కాలేజి చదువులు ఉద్యోగాలు చేయడానికి ఉపయోగపడుతాయి గాని జీవితపుబళ్లో మొగుడు నేర్పిన ఓనమాలు మాత్రం పెళ్లాం తన కష్టాలనన్నింటినీ బయటకు చెప్పుకోకుండా బ్రతకాలనటమే నమ్మా. "ఏడవకు కృష్ణా!" సాలెపురుగు అల్లుకున్న గూడులోనే ఉండేటట్లు స్త్రీలు కూడా తమంతట తామే బంధాలలో చిక్కుకునేటట్లు చేస్తారు ఈ మొగవాళ్ళు. అంటూ తన అనుభవసార వేదాన్ని అలివేణి చెప్పింది.

కృష్ణశ్రీకి ఏదో మొండి ధైర్యం వచ్చినట్లనిపించింది. "నిజం అక్కా" చెరువులో చేపపిల్ల అయినా అయితే కన్నాలోంచి అయినా జారుకొని

బ్రతుకుదామనుకోవచ్చు. కాని పెరిగిన మానవ నాగరికత మాత్రం ఆ ఏకకణ జీవి దశనే కోరుకుంటుందని చదువు విజ్ఞానం కూడా ఆడవాళ్ల జీవితానికి విలువ నివ్వటంలేదని అర్థం అవుతోంది అక్కా! అంది కృష్ణశ్రీ.

ఆనాడు ఊరంతా సంబరంగా ఎన్నో ఆశలతో పెళ్లి చేసుకున్నాను కాని ఆ మార్నాడే "ఈ అడ్రసుకు డబ్బులు పంపించుఅంటూ తనకు అంతకు ముందే పెళ్లైయిందని చెప్పాడు మోహన్రావు అదే ఆయన్ని మన వారు అనాలా? మూన్నాళ్లకే మూడుముళ్ల బంధం అంటే ఏమిటో నాకు అర్థం అయిందక్కా! వేసిన ముళ్లనే మళ్లీమళ్లీ వేయటం అంటే ఇదేనేమో .... ఈ విషయాలు ఎవరితో చెప్పుకోవాలో అర్థంకాక నాలోనేనే కుమిలిపోయేదాన్ని అక్కా! తోటి టీచర్లకు తెలియకుండా గుంభనంగా బ్రతకాలనుకున్నా అయిందేదో అయిపోయింది. ఇదివరికటిలా లోకంకోసం మొగాడిలా వస్తుపోతూ ఉంటే సమాజంలో పరువు నిలుస్తుందని బ్రతిమిలాడాను. "అదే నేను చేసిన తప్పు. ఎవరితో చెప్పుకోలేమనే మన నిస్సహాయ స్థితిని ఆసరగా తీసికొని నా పెండ్లయిన 6 నెలలకే మళ్లి ముచ్చటగా మోడోసారి మరో పెళ్లి చేసుకున్నానని చెప్పినపుడు మాత్రం గుండెబద్దలయింది అక్కా" అంటూ పెద్ద పెట్టున ఏడ్చింది పాపం కృష్ణ.

తనకది అప్పటికే అలవాటవటంతో కృష్ణ దు:ఖానికి అడ్డుకట్ట వేస్తూ ఇంట్లోకిరా. "కాసేపు పడుకో కృష్ణా అన్నం పెడతాను పండగపూట భర్తతో పంచుకొని తినేయోగం లేకపోయినా భర్తను పంచుకొన్న భార్యలుగా కలిసి తిందాము, ఈ పండగ గుర్తుగా" అంది తాను. ఎప్పటి నుండో వుపవాసం చేసిన దానిలా వున్న కృష్ణ దు:ఖంతోనే కడుపు నింపుకుంది అన్నట్లుగా ఏడుపు కట్టలు తెంచుకొని వచ్చింది. "అక్కా! నీకు ద్రోహం చేసానని అనుకుంటున్నావా. నిజంగా నాకు తెలిసి చేసిన తెలియక చేసినా జరిగింది తప్పుకాబట్టి ఆ పాపానికి ఫలితం నేను అనుభవించాల్సిందే" అక్కా అంటూ మరో స్త్రీకి ద్రోహం జరిగిన దాంట్లో తనదీ సగం తప్పు అన్నంతగా "క్షమించమని అడగటానికి వచ్చానక్కా అంటూ బాధను కొద్ది కొద్దిగా తగ్గించుకోవాడానికి ప్రయత్నించింది". కొంత సేపటికి తిరిగి మళ్లీ "అక్కా! అన్నీ భరించాను కాని నాతో పెళ్లయిన తరువాత కూడా మళ్లీ తాను మరో మనువు చేసుకున్నానని చెప్పినపుడు మాత్రం మహారాష్ట్రలో కాదు భూకంపము మనముందు వస్తే బాగుండును ఇద్దరం

చచ్చేవాళ్ళం గదా అని అనిపించింది. ప్రేమికులుగా కాదు మరే అమ్మాయి మోసపోకుండా .... ఆహుతి అవ్వాలనిపించి నేను సహితం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిస్తాననిపించి సమిధలు కాబోతున్న స్త్రీల జీవితాన్ని కాపాడిన దాన్నవుతాననుకొన్నాను. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిన ఆ రాత్రి మర్చిపోలేను అక్కా అంటూ మళ్లీ బోరున ఏడ్చింది.

ఈ సారి అలివేణికి ఎండిన కళ్లనుంచీ ఊట ఉబకినట్లు ఒక్కసారిగా దు:ఖం ముంచుకొచ్చి జలపాతం ముందుకురికినట్టనిపించింది. కృష్ణ...వేణి.. తమ ఇద్దరి దు:ఖం కలసిఉప్పెనగా ఉరందరినీ ముంచేస్తుందేమోనని భయపడుతుంటే తలుపుతోసినట్లుంది విలాసంగా ఇంతలోనే మెల్లోని గొలుసు సరిచేసుకుంటూ పాన్ నములుతూ సిగిరెట్టు పొగలు పొగలుగా వదలుతూ నల్ల కళ్ళద్దాల చీకటి కళ్లలోంచి చూస్తూ ఇంట్లోకి వచ్చిన భర్తను చూసేసరికి దు:ఖానికి కూడా భయంవేసిందేమా అన్నట్టుగా అది హఠాత్తుగా అణిగిపోయింది. లేని ఆప్యాయతనుకొని తెచ్చుకొని "వాళ్లిద్దరి మధ్య తనుండటం అంతగా బాగాలేదనిపించి వెంటనే వంటచేసేనెపంతో వంటింట్లోకి వెళ్లింది. కాని వాళ్లిదరూ మాట్లాడుకుంటున్న మాటలు మాత్రం స్పంష్టంగా విన్పించాయి. కృష్ణశ్రీ "సారీ మోహన్రావ్ నిన్ను డిస్ట్రబ్ చేసినందుకు. అక్కని కలవటానికి వచ్చాను. పెళ్లయినవాడ్ని పెళ్లిచేసుకున్నానని" అక్కతో అదే నీ మొదటి భార్యను క్షమించమని అడగటానికి వచ్చాను. మనది పెళ్లి కాదనీ నీతో చెప్పటానికి వచ్చాను. నీకు కావల్సింది డబ్బేగా ఇదిగో తీసుకో ఈ డబ్బుల కట్టలను. నీ ధనదాహం తీరుతుందా. కాని నీకు డబ్బిచ్చేముందు ఒక్కమాట! డబ్బుకోసం మళ్ళీ ఏ స్త్రీ జీవితంతో చెలగాటం ఆడవద్దని చివరిసారిగా చెప్పటానికి వచ్చాను". కృష్ణ అంటుంటే సిగ్గులేని మోహన్రావు "ఏదీ డబ్బు ఇటియ్యి నాకు నీతో మాట్లడే తీరుబడిలేదు చాలాపనుంది వెళ్లాలి" అంటూ వెడుతుంటే కృష్ణ మోహన్రావును ఉద్రేకంతో ఆపి ఉద్వేగంతో "మోహన్రావ్ పేరుకు తగ్గటే ఉన్నావు పెళ్లయిన మొదటి రోజే నీవు ముభావంగా వుంటే నాకు చదువు నేర్పిన వినయ విధేయతలలో నువ్వేదో భగ్నప్రేమికుడివేమో ప్రేమ కోసం తపిస్తున్నావేమో, ప్రేమ దాహం తీరుద్దాం అనుకున్నా. పెళ్లయిన మర్నాడే నాపెళ్లికి ముందునువే చెప్పిన చదువులు నీకు లేవని తెలిసి నువ్వు అబద్ధం చెప్పినందుకు బాధపడ్డా, నిన్ను చదివించాలనుకున్నా నిన్ను ఉద్ధరించి తరించాలనుకున్నా. నిన్ను మానవతా

బాటలో నడిపించాలనుకున్నా కాని తర్వాత నువ్వు నన్ను ముళ్ల బాటలోకి ఈడ్చి మరో పూల తోటను అప్పటికే పాడుచేశావని తెలిసినప్పుడు జీవితంలో ఓటమిని ఒప్పుకొని పరాజితగా మిగిలిపోయాను. ఇక్కడికి వచ్చిన తరువాత నీవు ముచ్చటగా మూడో పెళ్ళి చేసుకున్నానని చెప్పినప్పుడు మన బంధం మూడు ముళ్ల బంధమే కాదు. అరిషడ్వార్గాలతో అనుబంధం అని అర్థమైంది. నీ విషపుకోరలకు నేనే కాదు మరే స్త్రీ కూడా బలికాకూడదు నిన్ను చంపి నేను చచ్చిపోవాలన్నంత ఆవేశమొస్తోంది. కాని నన్ను ఆ ధర్మకార్యం చేయనియ్యకుండా ఎక్కడో మానవతా అడ్డుపడుతోంది. అంటూ ఆక్రోశించింది కృష్ణశ్రీ.

ఆ మాటలకు రెచ్చిపోయిన విలన్లా వికతాట్టాహసంతో మోహన్రావు ఏంటే! ఇందాకట్నుంచీ నా ఇంట్లో కూర్చొని నా పెళ్లాం ముందు ఏంటేమిటోకూస్తున్నావు.' నువ్వెవతివే? నిన్నేమి చేస్తానో చూడు నిన్ను చిత్రవధ చెయ్యాలనుకున్నా. అంటూ క్షణంసేపు ఆగి మళ్లీ నిన్ను చంపుతాననుకుంటున్నావా, నిన్ను చంపేటంతటి తెలివితక్కువ వాడ్నికాను నువ్వు బంగారు బాతువు. నేనింకా జీవితం అనుభవించాలి నీ సొమ్ము నాకు చాలా అవసరం. అయినా నిన్ను చంపి నేను జైల్లో వుండేటంత తెలివితక్కువవాడ్నా. నిన్ను మాటలతోనే చిత్రవధ చేయగలను అంటూ తెలివిగా ఫోజుపెట్టి మాట్లాగుతున్న మోహన్రావు తలుపుసందు నుండి తనకు స్పష్టంగా కనపడ్డాడు. ఏమి చెయ్యాలో తోచక ఆనాడే సగం చచ్చిపోయింది తను.

"ఏది నువ్వు తెచ్చిన డబ్బు, డబ్బెంత తెచ్చావేంటీ! అంటూ బ్యాగు లాక్కొని డబ్బులన్ని బోర్లించి నోట్ల కట్టలను తీసుకొని పోబోయేటంతలో కృష్ణ తోక తొక్కిన త్రాచులా లేచి మోహన్రావు నిన్ను వెళ్లనీయను, నిన్నిలా బతకనీయను. అక్కా! దా ఇరువురము కలిసి ఈయన్ను చంపెయ్యాలి రా!" అంటూ పిచ్చిదానిలా అరుస్తుంటే మోహన్రావులో మృగం లేచి కృష్ణ జుట్టుపట్టుకొని గోడకేసి తలకాయను టపా టపా కొడుతుంటే తలపగిలి రక్తం విరజిమ్మింది. కృష్ణ కుప్పకూలిపోయింది. తను అడ్డం పోతే తనని విసురుగా పక్కకి త్రోసి కుప్పకూలిన కృష్ణ శరీరం మీద పడి తొక్కుతున్నాడు. ఉబికి వస్తున్న రక్తం ఏరులైపారింది. ఆ దృశ్యాన్ని చూస్తున్న తనకే మూర్ఛ వచ్చి ఒక పక్కకు పడిపోయింది. కాసేపటికి రక్తపుతడికి తేరుకున్న ఒక్కసారిగా లేచింది. మోహన్రావు బయటకు వెడుతూ! ఏదో అంతలోనే గుర్తుకువచ్చినట్లు ఒసేవ్ నేను గుడివాడ పోతున్నాను. మనియార్డరు వస్తే

గుడివాడలో ఈ అడ్రసుకు పంపించు. అర్థమయిందా మొద్దు" అంటూ ఛీత్కారాలు చేస్తూ బయటకు వెళ్లిపోయాడు.

ఏదో కర్తవ్యం గుర్తుకు వచ్చినట్లుగా తాను లేచి పోలీసు స్టేషనుకు బయలుదేరాలనుకొంది కాని అంతలోనే మళ్లీ ఇంట్లో ఒక రాకాశి శబ్దం వినిపించింది. త్రాగుతూ సీసాతో వచ్చాడు". "ఏంటి ఎటూ వెళుతున్నావు అన్నాడు. నీకు చెప్పాల్సిన పనిలేదు. పోలీసులొచ్చి చెబుతారు నీకు అంది తాను. ఏంటి బాంచత్ పోలీసులకు చెబుతావా, ఆ కృష్ణశ్రీ వచ్చేసరికి నీకు తెలివి పెరిగిందా? ఇలా చేస్తావని ఊహించే నిన్ను హెచ్చరించాను. ఆ అనుమానంతోనే వెంటనే ఇంటికి తిరిగి వచ్చాను. జాగ్రత్త? నోరు మూసుకొని కూర్చో ఎవరికన్నా ఈ విషయాన్ని చెప్పావా, నీ ప్రాణాలు కూడా తీస్తాను, చంపుతాను. దాని గతే నీకు పడుతుంది జాగ్రత్త" అన్నాడు మోహన్రావు. ఓరి దుర్మార్గుడా నీ పని ఇలా కాదురా, నీవు చచ్చేరోజు దగ్గరలోనే వుందని లోపల అనుకుంటున్నాననుకుందికాన తాను పైకి అనేసింది. "ఏంటే కూస్తున్నావు అంటూ మీదకు వచ్చి తలమీద గట్టిగా కొట్టేసరికి దిమ్మదిరిగి క్రుప్పకూలింది అలివేణి. మోహన్రావు మైకములో చాలా ధైర్యంగా రాత్రిపూట శవాన్ని కిరసనాయిలు పోసి దొడ్లోనే తగలబెట్టాడు. పెరడంతా బూడిద బూడిద అయ్యింది.

అలివేణికి స్పృహవచ్చి లేచేసరికి కృష్ణశ్రీ శవం ఏమైందో తెలియలేదు. దొడ్లో కాలిన వాసన బూడిద కనపడింది. భర్త కనబడలేదు. పిచ్చిపట్టినట్లు ఏడ్చింది. తెల్లవార్లు ఆలోచించి ఎలాగైనా ఈ విషయం పోలీసులకు తెలియజేయాలనుకుంది. అక్కడ పోలీసుస్టేషను లేదు. ప్రక్క ఊరుకు వెళ్లి చెప్పాలి. ఆ పోలీసులు పట్టించుకుంటారా? ఒక్కతే తాను ఈ పని చెయ్యగలనా అంటూ ఆలోచించింది, తెల్లవారింది కృష్ణశ్రీ మొగుడికి నోట్లకట్టలను మెహాన విసిరేస్తోంటే కుర్చీ కాళ్ళ కిందపడిన ఒక వందరూపాయల నోటు రెపరెపలాడింది. దానిలో కృష్ణశ్రీ మొహం కనబడింది. "అక్కా వీన్ని ఏదైనా చెయ్యి" అంటున్నటనిపించింది. నిన్న భర్త ఇచ్చిన అడ్రస్ కాగితం ఒకసారి తడిమి చూసుకొంది పొలాల గట్లెమ్మటి నడుస్తుంటే ఊరేమో ఇంకా కునుకు తీస్తున్నట్టే ఉంది గబాగబా అడుగులు వేసి తారు రోడ్డుకు మీదికి వచ్చింది. అంత కష్టంలోనూ అదృష్టం అనుకునేటట్లుగా ఎర్ర బస్సు వచ్చి ఆగింది. అమ్మయ్య ఇది గుడివాడే బస్సే అనుకొని ఎక్కింది. టికెట్టు కొనుక్కొని కూర్చుందే కాని కండక్టర్ గుడివాడ వచ్చింది దిగు దిగమ్మా

అనేంతవరకు తనను తాను మరచిపోయి ఏదో లోకంలోకి వెళ్లిపో నిన్నటి గతాన్ని తలుచుకుంటుంటే గుడివాడరానే వచ్చింది.

బస్సుదిగి రిక్షా మాట్లాడుకొని సరాసరి ఆ అడ్రస్ వున్న నెంబరు గల ఇంటికి వెళ్లి "అమ్మా! కావేరి ఇల్లు ఇదేనా? అని అడిగింది. ఇంతలోనే మోహన్రావు వచ్చి తీస్తాడేమోనని భయమేసింది. ఇంతలో 20 ఏళ్ల కుందనపు బొమ్మ వచ్చి "ఎవరండీ" అంది. ఏమాత్రం ఆలస్యం ఐనా చెపాలనుకున్న విషయం చెప్పలేక పోవచ్చునేమో అని మృత్యువు తరుముతున్నట్లుగా భయంలో బాధతో మోహన్రావు విషయమంతా అలివేణి గబగబ చెప్పింది. కృష్ణ తలను పగులగొట్టి మోహన్రావు చంపిన విషయం కూడా చెప్పింది. అది విన్న కావేరి అవాక్కయిపోయింది. ఇంతలో తేరుకొన్న కావేరి కళ్లు, ఒళ్లు కూడా ఎర్రబడగా "ఇంత దుర్మార్గుడా ఓరీ మోహన్రావు నిన్నేమి చేస్తానో చూడు అంటూ అరిచింది. అలివేణికి ఇంకా అక్కడ ఆలస్యం చెయ్యడం ఇష్టంలేక ఎవరో తరుముకొస్తున్నట్లుగా వెనుదిరిగిన అలివేణి తిరుగుబస్సు ఎక్కి వచ్చేసింది. అక్కడ కావేరికి అలివేణి మీద ముందుగా కోపం, ఈర్ష్య వచ్చింది, నిజం కాదేమో అనిపించింది కాని నమ్మాలనిపించింది. మొగడిలో ఇంత రాక్షసత్వం ఉందా, దాన్ని అంతం చెయ్యాలి అనుకొంది.

కావేరికి వాళ్ల మేడమ్ చెప్పిన పాఠం గుర్తుకొచ్చింది. దాన్లో సవతుల మధ్య కయ్యాలు - సత్యభామకు గర్వభంగం, ఆమె పెత్తనాన్ని అణచివేయటానికి కృష్ణుడు విభజించి పాలించెడి భాగంగా సవతుల మధ్య కయ్యం సృష్టించాడని చెప్పటం గుర్తుకువచ్చింది. ఆధునిక కాలంలో సవతులందరు ఏకమై ఆడపిల్లల జీవితాలతో మొగళ్ళమంటూ చెలగాటలాడుతున్న మొగవారిని బంధించాలనుకుంది.

గుడివాడ నుండి ఇల్లుచేరుకున్న అలివేణి దాహార్తికై మంచినీళ్లు ముంచుకు తాగుతుంటే ఎక్కడి నుండియో వచ్చి ఊడిపడ్డాడు మోహన్రావు. "ఏమే ఎంత బలుపే! నువ్వు గుడివాడ వెళ్లి నా సుందరిని నాకు దూరం చేస్తావా? నిన్నేమి చేస్తానో చూడు! కృష్ణశ్రీ గతి నీకు పడుతుంది అంటూ మీదకు వచ్చాడు. తప్పించుకోవాలని ప్రయత్నించినా విఫలమై సింహానికి లేడిపిల్ల దొరికినట్లు దొరికిపోయింది .సీసాను బయటకు తీసి కొంత నోట్లో పోసుకొన్న తరువాత దాన్ని పగులగొట్టి అలివేణి పొట్టలో, ఛాతిలో విపరీతంగా పొడిచాడు. అలివేణి

రక్తం నిన్నటి కృష్ణ రక్తంతో కలవాటినికి వడివడిగా పరుగులు పెట్టి కాలువగా మారి కృష్ణా నదిలో చేరుకోవాలనుకుంది.

ఒకసారి హత్యచేసిన వాడికి రెండవసారికి మరింత తేలికయింది. మోహన్రావు ఏమాత్రం భయం లేకుండానే ప్రక్కన వున్న పొలాల్లో ఒక మంచె క్రింద అలివేణి శవాన్ని పడుకోబెట్టి కిరసనాయిలు పోసి తగులపెట్టాడు. దూరన్నుంచి చూస్తున్న పొలంకాపరి అయ్యో? తనిందాక పెట్టిన చుట్ట గడ్డికి అంటుకొని మంచె కాలిపోయిందని అనుకుంటూ రోడ్డుకు అటు దగ్గరగా ఉండే చోట మంచె కట్టుకోవటంలో నిమగ్నమయ్యాడు.

అక్కడ కావేరి మోహన్రావు ఆగడాలను బంధించాలని బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ఒక పథకం ప్రకారం మోహన్రావు మోసాన్ని అంతచెయాలనుకుంది. తానొక్కటేచేయగలుగుతుందా అనుకుంది. జీవితం తనకిపుడిపుడే అనుభవంలోకి వస్తోంది. తన మేడమ్‌తో సంప్రదించాలనుకొంది. మోహన్రావు పండక్కి వస్తానని చెప్పి వెళ్ళాడు కాబట్టి ఈ రోజు వస్తాడు. వాడు వచ్చే లోపల తనిక్కడినుండి పారిపోవాలి. వాడి కళ్ళ బడకూడదనుకొని స్నేహితులు దగ్గరికి వెళ్లింది. స్నేహితులందరు ఆమెకు భరోసా యిచ్చారు ఈసారి మోహన్‌రావు వస్తే మాకు కబురు చెయ్యి మేము వెంటనే వస్తాము నీకు అండగా వుంటామని వారిచ్చిన ధైర్యంతో కావేరి ఇంటిముఖం పట్టింది.

అలివేణిని హత్య చేసిన తరువాత మోహన్రావు తన ముద్దుల భార్య అయిన కావేరి దగ్గరకు దగ్గరికి వెళ్లాడు, కాని అక్కడ ఆమె లేదు. పిట్ట ఎగిరిపోయిందీ అంటూ చుట్టు ప్రక్కల వాళ్లని వాకబు చేసాడు. తను ఆ ఊళ్లో వాళ్లకి పరిచయం లేకపోవటం ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అస్తవ్యస్తమైన మనస్సుతో చికాకుపడ్డాడు. వెనుదిరిగి ఇంటికి రాబుద్ధి పుట్టలేదు. లాడ్జీ ఒకరాత్రి తీసుకొని అక్కడే ఉంటూ దగ్గరలో ఉన్న బారుషాపు నుండి సీసాలు తెప్పించుకు తాగుతూ గడిపాడు. ఆ లాడ్జిలో ఉండే ఒకడు వీడి దగ్గర డబ్బుందని పసిగట్టి ఒకరోజు ఒక అమ్మాయిని ఏర్పాటుచేసాడు. మరురోజు మళ్ళీ కావేరి ఇంటికి వచ్చాడు. ఇంట్లోనే వున్న కావేరి అతడ్ని చూచి చూడగానే కావేరి అపరకాళిలా మీదపడింది. "ఏరా మోహన్రావ్ కాలేజీలో చదువుకుంటున్న నాకు బీటువేసి పెళ్ళాడావు. వెధవా. నీకు చంపుకోవటానికి ముగ్గురు పెళ్ళాలు కావాల్సివచ్చిందా?

నిన్నెం చేస్తానో చూడు నీ కోసమే చూస్తున్నానురా". అంది.

ఈ సారి మెహన్రావ్ చాల శాంతంగా "ఏమిటి కావేరీ? అలా ఎగిరి పడుతున్నావు. నువ్వుకోపంలో కూడా ఎంత అందంగా ఉన్నావో తెలుసా. ఓహో నీకెవరో నా గురించి తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ఉంటారు. ఆ అలివేణిని నేను చంపానని ఎవరో చెప్పి వుంటారు. అవునా? చూడు ఎవరో ఏదో చెబితె నమేతంటటి తెలివి తక్కువది కాదు నా కావేరి" అంటూ కావేరి దగ్గరకు రాబోయాడు.

"ఛీ.... ఛీ... నన్ను ముట్టుకోకు" అంటూ బయటకు పరుగుతీసింది. కావేరీకి పరిస్థితి అంతా అర్ధమయింది. అంటే తెల్లవారే సరికి అలివేణిని కూడా పొట్టన పెట్టుకున్నాడన్న మాట. ఇంకా వీడి సంగతి ఇలా వదిలేస్తే మరెంత మంది అమ్మాయిల్ని చంపుతాడో ! వీడి మీద పోలీస్ కంప్లైంట్ ఇవ్వాలనుకుని ఫ్రైండ్స్‌తో కలిసి పోలీసు స్టేషన్‌కు వెళ్ళింది. ఆధారాలు ఉంటే చూపించండి మేముకేసును రాస్తామని అన్నారు. అన్నారు. సరేనని తన దగ్గర ఉన్న ఆధారాలు ఇచ్చింది. పోలీసులు అతడ్ని అరెస్టు చేయలేదు. రెండవ రోజు భయం వేసింది. వాడే సమయంలోనైనా తమ మీదకు దాడి చేయవచ్చని భావించి పోలీసులకు ఫోన్ చేసింది. వాళ్ళు విజయవాడలో ఉన్న మోహన్రావ్‌ను అరెస్టు చేసారు. కావేరి "అమ్మయ్య వాడిపీడ విరగడయిందని అనుకుంటుండంగానే వాడు డబ్బు పరపతిని స్థానబలాన్ని నిరూపించుకుని బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ విషయం తెలిసి కావేరీ పోలీసులతో మాట్లాడితే సరైన సాక్షాలులేవని కోర్టులో తేల్చువచ్చని వాడిని వదిలిపెట్టామని చెప్పారు. కావేరీకి వళ్ళు మండిపోయింది. ఎంతో అభద్రతకు కూడా లోనయింది. అంతేగాక వాడు మళ్ళీ అమ్మాయిల్ని వేటాడకుండా ఏదో ఒకటి చెయ్యాలని ధైర్యంగా ఆలోచించింది. ఒక మెరుపులాంటి ఆలోచనవచ్చి తన స్నేహితులను రమ్మని కబురుచేసింది. స్నేహితులతో కలిసి కావేరీ విజయవాడలో మోహన్రావు ఇంటికి వెళ్ళింది. స్నేహితురాళ్ళంతా కలిసి వాడ్ని బయటకు లాక్కొచ్చి ఒక చెట్టుకు చేతులుకాళు ళ కట్టేసి చావబాదారు. వాడంత సులభంగా చావడుకదా. ఇంతలో గుంపులో నుండి ఒకడు వచ్చి కట్టి ఉన్న వాడి చేతులపై "ముగ్గురమ్మాయిల ముద్దుల మొగుడు" అని పచ్చబొట్లు పెడుతుంటే మెహన్రావు ఆహాకారాలు చేసాడు. ఆ కోపంలో కావేరీ వైపు క్రూరంగా చూస్తూ "కావేరీ నిన్నెం చేస్తానో చూడు నాకు

ఎదురు తిరిగి నువ్వింక బ్రతకగలవా ? నిన్ను బతకనిస్తానా? సాక్షాలు లేకుండా నిన్ను చంపగలను పచ్చబొట్లు పొడిపిస్తే ఫుల్ చేతుల చొక్కాలు తొడుకొన్ని తిరగగలను అంటూ పిచ్చిగా అరిచాడు. కావేరీకి కోపం మరింత ఎక్కువై ముఖమంతా ఎఱ్రబడింది.

"ఓహ్ అలాగా మోహన్రావ్ నీ తెలివి నా దగ్గర ప్రదర్శించకు ఇక నిన్ను ముఖం ఎత్తుకు తిరగనీయకుండా చేస్తాను అంటూ కావేరీ మోహన్రావ్ పెళ్ళిళు ళ్ళ చేసుకొని ఇద్దరు భార్యలను చంపిన విషయాన్ని గుమిగూడిన జనానికి అర్థం అయ్యేటట్లు చెప్పింది. ఛీత్కారాలు చేస్తున్న జనం మధ్యలోనుండి ఒక వ్యక్తి వచ్చి చెట్టుకు కట్టేసిన మెహన్రావ్ చేతుల దగ్గరకు వెళ్ళాడు. ఆ చేతులపై ముగ్గురమ్మాయిల ముద్దుల మొగుడు అని పచ్చబొట్లను పొడిచాడు మోహన్రావు ఆహాకారాలు చేస్తూ " కావేరి నన్ను క్షమించు వారిద్దరినీ చంపినట్లు నిన్ను చంపనులే నన్ను వదిలిపెట్టు" అంటూ ప్రాదేయపడ్డాడు. కావేరీ ఏ మాత్రం కనికరించలేదు. మోహన్రావ్ సాక్షాలు లేకుండా నీ చేతులు అమ్మాయిల్ని చంపగలవని నాకు బాగా తెలుసు. ఇక ఎవరూ సాక్షం ఇవ్వాల్సిన అవసరం లేకుండా నిన్నేమి చేస్తానో చూడు" అంటూ మోహన్రావ్ చేతుల మీద పచ్చబొట్లు పొడిచిన వ్యక్తిని పిలిచి మోహన్రావ్ ముఖం మీద " అమ్మాయిల్ని పెళ్ళి పేరుతో మోసం చేసే మొగుడు" అని అతని తెల్లటి నుదుటి మీద అడ్డంగా పచ్చబొట్లు పొడిపించింది. పచ్చిపచ్చిగా ఎఱ్ఱెఱ్రగా ఉన్న ఆ బొట్లను చూసిన జనం అవి పచ్చబొట్లేకావు. కావి బొట్లు కూడా వాడికి తగిన శిక్ష పడింది. అంటే ఆ గుంపులో నుండి పోలీసులు వచ్చి "మోహన్రావు నీ తప్పు నువ్వే ఒప్పుకున్నావుగా ఇక నువ్వు చేసిన హత్యలకు నువ్వే నిలువెత్తు సాక్షం అంటూ బేడీలువేసి తీసుకొనివెళ్ళారు.

సాయంసంధ్యాసమయంలో సత్యము కృష్ణమ్మ అలలవేణిపై మిణుకు మిణుకు మంటూ మెరుస్తుంటే కావేరి వచ్చి అత్యదీపాన్నీ వెలిగించిందన్నట్లుగా భావించిన కృష్ణవేణి నదీమతల్లి తన ఆనందపు చైతన్యాన్ని అలలగలగలలో నినదించింది.

(1997)

ఇంటి వెలుగు

రాత్రి ఎనిమది గంటలవుతోంది. కృష్ణపక్షపు చీకటి మందంగా పరచుకుంటోంది. శాంత పిల్లలకు అన్నం వడ్డిస్తున్నా మధ్య మధ్య వాకిలివైపు పదే పదే చూస్తోంది. డ్యూటీకి వెళ్ళిన భర్త యింకా ఇంటికి రాలేదని ఆందోళన పడుతోంది. డ్యూటీ నుండి భర్త ఇంటికి వచ్చేంతవరకు ఏ రోజు కారోజు ఆందోళన చెందటం, ఏ క్షణంలో ఏ కబురు వస్తుందోనని భయం భయంగా ఎదురు చూడటం, రోజూ ఉండేదే. యిదేమీ అర్ధంగాని చిన్న పిల్లలు మాత్రం స్నేహితుల ముచ్చట్లు చెప్పుకుంటూ మజ్జిగ అన్నం తినటం పూర్తి చేసారు. పెద్దవాడు మాత్రం మౌనంగా తింటున్నాడు.

పెద్ద వాడు శంకర్ అన్నం తినటం పూర్తి చేసి వరండాలో నాన్న కోసం ఎదురుచూస్తు కూర్చున్న అమ్మ దగ్గరకు వచ్చి " అమ్మా కాలేజీ ఫీజు ఫైన్‌తో కట్టే డేటు కూడా దాటి పోయింది. రోజూ ఫీజు సంగతి అడుగుతుంటే రేపు .... ఎల్లుండి.... అంటూ ఏ రోజుకారోజు చెబుతున్నావు. ఈ రోజు మా ప్రిన్సిపాల్ పిలిచి ఫీజు కట్టలేదు కాబట్టి కాలేజీలో నా పేరు తీసేద్దామనుకుంటున్నట్టు చెప్పారు. ఇంక నన్ను కాలేజీకి రానక్కరలేదనీ, మార్చి నెలలో జరిగే పరీక్షలు కూడా వ్రాయటానికి వీల్లేదని చెప్పారు. ఈ ఒక్కసారికి ఫీజు డబ్బు యివ్వమని నాన్నకి చెప్పు అమ్మా " అంటూ బ్రతిమిలాడాడు.

ఆ మాటలకు శాంతకు దుఃఖం ఉబికి వస్తున్నా పైకి మాత్రం గంభీరంగా “సరేలే ! మీ నాన్న యివ్వాళ డబ్బు తెచ్చి యిస్తాననన్నాడు. రేపు కట్టుదువు గానిలే” అంటు బుజ్జగించి “లోపలికి పోయి చదువుకో” అంటూ అక్కడి నుండి పంపించింది.

ప్రొద్దున డ్యూటీకి వెడుతుంటే భర్తతో పిల్లవాడి ఫీజు కట్టడానికి 500 రూ॥లు అప్పు అడిగి తెమ్మని చెప్పింది. జీతం రాగానే యివ్వవచ్చులే అనుకుంది. ఎలాగో అలాగా వాడికి యింటరు రెండవ సంవత్సరం చదువు పూర్తి చేయిస్తే చాలు అనుకుంది. తరువాత వారి చదువు సంగతి తరువాత చూసుకోవచ్చు. వెనకాల యింకా యిద్దరున్నారు. అందులోనూ ఒక బిడ్డ ఆడపిల్ల కూడా దాని చదువుకే కాకుండా. పెళ్ళికి కూడా కాస్తో కూస్తో వెనకెయ్యాలి. ఇక నుండి ఎలాగైనా భర్తను జీతం అంతా అడిగి తీసుకుని కాస్త కాస్త మిగుల్చుకోవాలి. లేకపోతే యిక సంసారాన్ని నెట్టుకురావటం కష్టమవుతుంది అనుకుంటూ పెద్ద నిట్టూర్పు వదిలింది.

ఇంతలో తడక చప్పుడయింది. ఆ వచ్చేది భర్తే అనుకొని చాలా ఆసక్తితో చూసింది. కొమరయ్య రానే వచ్చాడు. వస్తూనే చాలా చిరాకుగా వస్తూ ఏం చా.. ఆహా శాంతా ! అ... ఏ చేస్తూ ఉ...న్నావ్.. అ ... అ ... నా కోషం ఎదురు చూస్తున్నావా ... అ...ప్ ... ఛో... ఛో... పాపం .... సరేలే ఏమ్... ఇదిగో వేనా ... నిలబడ్డ లేకున్నా ఆ.... అ ... మంచం ఎయ్యి ... ఈడ... ఇ ఇక్కడ... ఇక్కడే పడుకుంటా అ.... "అంటుంటే గుప్పున సారావాసన ఎగజిమ్మింది.

వారంలో రెండు సార్లైనా యీ సారా భాగోతం ఉండేదే అయినా ఈ రోజు మాత్రం శాంతకు ఎందుకో కళ్లలో నీళ్లు తిరిగాయి. చప్పున ముఖం తిప్పుకొని అతడ్ని పట్టుకొని లోపలికి తెచ్చి మంచం మీద పడుకోబెట్టింది. అదేగదిలో చిన్నపిల్లలిద్దరూ బిక్కు బిక్కు మంటూ చూసి దుప్పటిని తలమీదవరకు లాక్కుని పడుకున్నారు. పెద్దవాడికి మాత్రం యీ గొడవ అలవాటయి పోయింది. వాడి భయమల్లా మర్రోజు అన్నా ఫీజు కట్టగలిగే స్థితి లేదని గ్రహించి ఇక తాను చదువుకొనసాగించలేడనే అపనమ్మకం వచ్చింది. తండ్రివైపు ఒక సారి నిరసన భావంతో చూసి చదువుకుంటున్న పుస్తకాన్ని మూసేసి చాపమీద అటుతిరిగి పడుకున్నాడు. శాంత భర్తకు మజ్జిగ పట్టి పడుకోబెట్టింది. ఆమెకు అన్నం తినబుద్ధి పుట్టలేదు. వంట ఇల్లు సర్దివచ్చి చాపపరచుకొని పిల్లమీద చేయివేసి ప్రక్కన పడుకుంది. పడుకుందే గాని శాంతకి నిద్రపట్టలేదు. ఇలా ఎన్నేళ్లు ? పిల్లల ఫీజుకు స్నేహితుడి దగ్గర అప్పు అడిగి డబ్బు తీసుకొని రమ్మంటే ఆ డబ్బు పెట్టి త్రాగి యింటికి వచ్చాడు. ఈ 'సారా' మహమ్మారి ఇళు ్ళ వళ్లు గుల్ల చేస్తోంది. పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో ఏమిటో ? అనుకుంటూ ఇంటి కప్పు వేపు చూస్తూ పడుకుంది. గదిలో చిన్నలైటు వెలుగుతున్నా చిమ్మచీకటి అవరించిందనిపించింది. ఈ చీకటి పోగొట్టేదెవరూ ! ఎవరూ ఊ .... ఎవరు మాత్రం ఏం చేయగలరు. .... తనే ఏదో ఒక మార్గం చూసుకోవాలి అనుకుంటూ ఆలోచనలతో నీరసించిన ఆమె మనసును నిద్రాదేవి తన ఒడిలోనికి తీసుకుంది.

ఎప్పటిలాగానే సైరన్ మ్రోగగానే లేచి 'నాస్తా' తయారుచేసి భర్తకు పెట్టింది. భర్తతో ఏమీ మాట్లాడాలనిపించలేదు. మౌనంగా టిఫిన్ క్యారియర్ కట్టి యిచ్చింది. కొమరయ్య మాత్రం రాత్రి సారా త్రాగి వచ్చిన ఫలితంలే ఈ మౌనం అనుకుంటూ ఎప్పుడూ ఉండే విరసమేలే అని మాట్లాడకుండా క్యారేజి తీసుకొని వెళ్ళిపోతుంటే శాంత గొంతు సవరించుకొని "నిన్న ఫీజు కట్టలేదని శంకర్‌ని కాలేజీకి ఇక

నుంచి రావద్దన్నారట ఇవాళ జీతాల రోజు కదా. జీతం తీసుకొని అటునుండి అటే కాలేజీకి వెళ్ళి ఫీజు కట్టి రండి' అంది శాంత.

"సరేలే ! చూస్తా ... " అంటూ కొమరయ్య డ్యూటీకి వెళ్లిపోయాడు. శాంత పంపు దగ్గరకు వెళ్ళి నీళ్ళు పట్టుకొచ్చింది. అన్యమనస్కరంగానే పిల్లలిద్దరికీ స్నానం చేయించి అన్నం పెట్టి బడికి పంపించింది. పెద్దవాడు కాలేజీకి వెళ్దామా ! వద్దా ! అని తటపటాయిస్తుంటే వాడు అడగటానికి ముందుగానే "శంకర్! ఈ రోజు జీతాల రోజు కదా ! మీ నాన్న మధ్యాహ్నం జీతం తీసుకొని డ్యూటీ నుండి నేరుగా మీ కాలేజీకి వచ్చి ఫీజు కడతానన్నారు నీవు మనసులో దిగులు పెట్టుకోకుండా బాగా చదువుకో టైముకు క్లాసుకి వెళ్దువుగాని అన్నంతిని కాలేజీకి బయలుదేరివెళ్ళు" అంటూ అన్నంపెట్టి కాలేజీకి పంపించింది.

ఇంట్లోకి వచ్చిందే గాని గుండె బావురుమంది. కంపెనీ ఉద్యోగం అనీ, డబ్బుకు లోటు వుండదనీ, తనెంతో సుఖపడుతుందనీ భావించి తనవాళ్లు కొమరయ్యకు ఇచ్చి కట్టబెడితే ఇలాల తన బతుకు చితికిపోయిందనీ బాధపడింది. బాధలు విధులను తప్పించవుగా - అంట్లు తోముతుందేకాని భర్త త్రాగుడు ఎలామానేస్తాడా అని ఆలోచిస్తూనే మళ్ళీ తనే బొగ్గుబాయి డ్యూటీ కష్టమనీ ఆ ఒళ్లు నొప్పులు తెలియకుండా నిద్ర పట్టటానికి అప్పుడప్పుడు కాస్త త్రాగుతున్నాడులే అనుకుంది మానేయమని చెప్పాలని ఎన్నిసార్లో అనుకుంది. కానీ అలా చెప్తే భర్తకు కోపం వస్తుందని తటపటాయించింది. కాని పిల్లలు ఎదుగుతున్నారు. ఇక త్రాగటానికి వీల్లేదని గట్టిగా చెప్పాలని నిర్ణయించకుంది. 'భార్య చెబితే వినే గుణం తన భర్తకు వుంటే ఎంత బాగుండేది' అని కూడా అనుకుంది.

బట్టలుతికి దణ్ణెం మీద ఆరేయటానికి సందులోకి వెళ్లింది. పక్కింటి గోడ ప్రక్క నుండి రాధ "అక్కా ఏంటి అలా ఉన్నావ్ ! జ్వరం వచ్చిందా? ముఖమంతా పీక్కుపోయింది.' అంటూ పలకరించింది.

శాంతకి తన భర్త యొక్క త్రాగుబోతు తనాన్ని గురించి చెప్పాలని పించలేదు. బాధను బయటకు తెలియనీయకుండా ప్రయత్నిస్తూ "ఏమిటో కొద్దిగా నీరసంగా ఉంది" అంటూ తప్పించకోవాలని ప్రయత్నించింది. కానీ రాధ వదిలిపెట్టకుండా రెట్టించేసరికి ఎలాగైనా శాంతకి రాత్రి జరిగిన సంగతి చెప్పక తప్పలేదు. అంతావిన్న రాధ బాధపడింది. రాధకు ఆమె భర్త వెంకట్ సారాత్రాగడనే విషయం స్ఫురణకు వచ్చింది. ఎందుకో అతనికి ఆ వాసన గిట్టదట. తోటి

కార్మికులు త్రాగుతున్నా అతనికి త్రాగాలనిపించదు. గని పనిలో పడ్డ కష్టమంతా పోగొట్టుకోవచ్చునీ, ఇంటి బాధలు కూడా మర్చిపోయి హాయిగా నిద్రపడుతుందనీ తోటి కార్మికులు కొందరు ప్రోత్సహించినా కూడా త్రాగడు చెడ్డ అలవాటని అది కుటుంబాన్ని సర్వ నాశనం చేస్తుందని బాగా నమ్మినవాడు వెంకట్. అందుకని ఎవరెంత రెచ్చగొట్టినా తన ధృడ నిశ్చయాన్ని కొద్దిగా కూడా సడలించుకోలేదు. త్రాగుడు పలాయనవాదానికి బాగా పనికొస్తుందని అనుకునే వాడు. తనకి మాత్రం ఇంటికి వచ్చి మజ్జిగ త్రాగితే గనిపనిలో పడ్డ కష్టం అంతాపోయి హాయిగా అనిపించేది. చేసిన శ్రమ తాలూకు కష్టం గోటితో తీసేసినట్లు అనిపించి అతనికి హాయిగా నిద్రపట్టేది. తెల్లవారి డ్యూటీకి మళ్ళీ ఉత్సాహంగా వెళ్ళటం రాధ గమనివంచి తన మొగుడికి త్రాగుడు అలవాటులేని కారణంగా తోటి కార్మిక కుటుంబ స్త్రీల కంటె తనెంతో అదృష్టవంతురాలని అప్పుడప్పుడు అనుకుంటు ఉంటుంది. ఐతే రాధకు సారా మహమ్మారి ఎలా జీవితాలను పీల్చి పిప్పి చేస్తుందనే విషయాన్ని మాత్రం వాళ్ల నాన్న తాగొచ్చి ఇంట్లో గొడవచేసినపుడు అర్ధమయ్యేది సారా కొట్లో ఖాతాలకే జీతం అంతా కట్టేసి ఉ ట్టి చేతుల్తో తండ్రి ఇంటికి వస్తే కుటుంబాన్ని ఈడ్చలేక తల్లి 'చస్తానంటూ' బాధ పడ్డ పరిస్థితులు ఆక్షణంలో గుర్తుకు వచ్చి శాంతను చూసే సరికి చాలా జాలివేసింది.

"శాంతా! అలా బాధపడకు. అన్ని రోజులూ ఇలాగే ఉండవు. మీ యింటాయన త్రాగుడు మానే వుపాయం ఆలోచిద్దాం. పాడు అలవాటు ... ఒకళ్లను చూసి ఒకళ్లు నేర్చుకుంటారు వెనకటికి ఒకడు జీతాల రోజు బాగా తాగి, ఆ మత్తులో మిగిలిన జీతం డబ్బు నోట్లను ఒక గాడిదనోట్లో కుక్కుతుంటే, అది ఈసడిస్తూ గాండ్రిస్తుంటే జనం అంతా చుట్టుముట్టి చివాట్లు పెట్టారట. మా వారికి చెప్పి మీ ఆయన త్రాగుడు మానేసేటట్లు చేద్దాంలే ... బాధపడకు .. రాత్రి అన్నం తిన్నట్లు లేవు. అన్నంతిని కాసేపు మా ఇంట్లో వచ్చి కూర్చో ... ఒంటరిగా ఉంటే ఆలోచన్లు ఎక్కువై మనసు పాడవుతుంది." అంటున్న రాధను వాళ్ళ అత్తగారు పిలుస్తుంటే లోపలికి వెళ్లిపోయింది రాధ.

తన స్థితిని అర్థం చేసుకునే రాధ తన ప్రక్కింట్లోనే ఉంటున్నందుకు శాంతకు కొండంత ధైర్యం వచ్చి బ్రతుకుమీద ఆశ చిగురించింది.

ఆ రోజు జీతాల రోజు భర్త తప్పకుండా జీతం తీసుకొని, ప్రొద్దున తాను చెప్పినట్లుగా కాలేజీకి వెళ్లి శంకర్ ఫీజు కట్టిఉంటాడని అనుకుంది. కాని

సాయంకాలం కాలేజీ నుండి వస్తూనే శంకర్ ఏడ్చినంత పనిచేశాడు. "కాలేజీలో ఫీజు కట్టనందుకు ప్రిన్సిపాల్ పిలిచి తిట్టారమ్మా ... అందరిముందు అవమాన మనిపించింది.. ఇవాళ జీతాల రోజనీ, మా నాన్న మధ్యాహ్నం వచ్చి తప్పక ఫీజు కడతారనీ చెప్పానమ్మా. సాయం కాలం వరకు నాన్నరాలేదు. ఫీజు కట్టలేదు. ఇక నుంచి కాలేజీకి పోవటానికి వీలులేదు. చదువుకోనక్కర లేదులే అయినా త్రాగుబోతు తండ్రులుంటే కొడుకులకి చదువులెలా అబ్బుతాయి. ఇక నా యిష్టం వచ్చినట్లు తిరుగుతాను నా గురించి ఎవరూ పట్టించుకోనక్కరలేదు. అని గొణుక్కుంటూ ఇంట్లో నుంచి విసురుగా వీధిలోకి వెళ్ళాడు.

శాంతకి యింకా ఓర్పు మిగిలే ఉంది. చిన్న పిల్లలిద్దరికి హోంవర్కు చేసుకోమని చెప్పి వసారా గుమ్మం దగ్గర భర్త రాకకోసం పడిగాపులు పడుతోంది. ఎంతకూ రాలేదు. చిన్న పిల్లలకు అన్నం తినిపించే సరికి వాళ్ళిద్దరూ నిద్రపోయారు. పెద్దవాడు ఎక్కడికి పోయాడో ఏమిటో అదేపోక .. ఇంకా రాలేదు.

భర్త వస్తాడూ వస్తాడని ఎదురుచూస్తున్న శాంతకు వాకిట్లో ఆటో ఆగిన చప్పుడు వినిపించింది. గేటు తీద్దామని వాకిలివరకు వస్తుంటే హడావుడిగా వస్తున్న మొగిలన్న "శాంతమ్మా ! పిల్లలు ఏం చేస్తున్నారు. పడుకున్నారా! కొమరయ్య హాస్పిటల్లో ఉన్నాడు కంగారు పడక్కరలేదులే. నిన్ను తీసుకొని వెళ్ళటానికి వచ్చాను" అన్నాడు.

"అన్నా! ఏమయింది ? ... ఆయనకు ఏమయింది ? హాస్పిటల్లో ఏందుకు చేర్పించారు? డ్యూటీలో ఏమన్నా అయిందా? బాగే గదా ప్రాణం.... ఎట్లా ఉ న్నాడు నా భర్త " అంటూ ఆందోళన పడ్తూ కంగారుగా నొక్కి నొక్కి అడిగింది. మొగిలిన్న "కొమరయ్యకు ఏం కాలేదు. ... అన్ని విషయాలు తరువాత చెబుతానుగాని తొందరగా పిల్లల్ని పక్కింటి ఆమెకు అప్పజెప్పి వస్తే హాస్పిటల్‌కి తీసుకుని పోతా" అంటూ తొందర జేసాడు. క్షణం ఆలస్య చెయ్యకుండా శాంత ప్రక్కింటి రాధకు తనకొచ్చిన ఆపదను చెప్పుకొని తన హాస్పిటల్‌కి వెళ్తున్నానని చెప్పి పరుగుపరుగున ఒక్క అంగలో ఆటోలో కూర్చుంది.

ఆటోలో మొగిలన్న కొమరయ్యను హాస్పిటల్లో చేర్పించిన విషయం చెబుతూ కొమరయ్య తను కలిసే డ్యూటీ నుండి దిగి యింటికి వచ్చే ముందు జీతం అందుకున్నామని, జీతం డబ్బు లెక్కపెట్టుకుంటూ యూనియన్ వాళ్ళకి చందా యిచ్చి బయటకు వస్తుంటే కల్లుకొట్టు ఖాతా వసూలు చేసుకోవటానికి కొట్టుయజమాని వస్తాదులాంటి వాళ్లని పంపించాడనీ, కొమరయ్య తాను కొట్లో

ఖాతా జమచేసి వస్తానని చెబితే నేను ఇంటికి వెళ్ళిపోయాను. కాని కొమరయ్య కల్లు కొట్టుకెళ్ళి ఖాతా తీర్చి వస్తుంటే కొట్టు యజమాని 'జీతాల రోజు కాస్త పోసుకో' అన్నాడట. డబ్బిచ్చి కాస్త త్రాగాడట. అలా గ్లాసు మీద గ్లాసు పోసేసరికి నడవలేని స్థితిలో ఉంటే కొట్టువాడు అక్కడే కూర్చో మన్నాడట. ఆ ప్రక్కనే ఉండి ఇదంతా చూస్తున్న లింగయ్య కొమరయ్యను పట్టుకొని నడిపించుకుంటూ వచ్చి ఇంటి దారి మలుపు దగ్గర వదిలి లింగయ్య పక్కకు తిరిగాడో లేదో ఇటు దారి కాచిన దొంగలు కొమరయ్య చేతిలో ఉన్న పర్సును ఎగరకొట్టుకుని పోయారట. కొమరయ్య త్రాగిన మైకంలోనే వాళ్ళని వెంబడించే సరికి పట్టుదప్పి అటూగా వస్తున్న వాహనాన్ని ఢీకొన్నాడట. దాంతో కాళ్ళకు దెబ్బతగిలింది. పరుగెత్తుకుంటూ అక్కడ దగ్గరలో ఉన్న లింగయ్య వెళ్లి స్పృహ కోల్పోయిపడిఉన్న కొమరయ్యను హాస్పిటల్లో చేర్పించి నాకు కబురు చేసాడు. నేను వెళ్ళి చూసి నిన్ను తీసుకెళ్ళటానికి వచ్చాను" అంటూ ప్రమాదం ఎలా జరిగిందో వివరంగా చెప్పాడు.

కొమరయ్య ప్రాణానికి భయంలేదని ఎంత చెప్పినా శాంతకు అధైర్యం ఆవరించి ఆటోలో వెడుతున్నా తానేదో పరలోకానికి ప్రయాణిస్తున్న భ్రమ కలిగి తన శరీరంలో ప్రాణం ఎక్కడికో పోతోందనిపించింది. భర్త, పిల్లలు, కళ్ళముందు గుర్తుకొచ్చి ఒక్కసారి కళ్ళుమూసి తెరిచేసరికి ఆసుపత్రి రానే వచ్చింది. శక్తినంతా కూడ దీసుకొని కాళ్ళీడ్చుకుంటూ కళ్ళొత్తుకుంటూ ముక్కుకు కొంగు అడ్డం పెట్టుకొని మధ్య మధ్యలో తుడుచుకుంటూ కాజువాలిటీలో ఉన్న కొమరయ్య మంచం దగ్గరకు వెళ్లింది. అతడ్ని చూసి ఒక్కసారిగా బావురుమంది. కొమరయ్య మీద ప్రేమవల్ల ఏడుపు దిగమింగుకోలేక పోయింది. ఆ సారా సీసాలోని దెయ్యం అతడి నరనరాల్లో తిరుగుతూ వికటాట్టహాసం చేస్తునట్టనిపించింది. డాక్టరు, నర్సులు వచ్చి చూస్తున్నారు. ఇంజక్షన్లు ఇచ్చి బాండేజి కట్టారు. శాంత "నర్సమ్మా ! ఆయనకు పరవాలేదు కదా ! లేచి నడుస్తాడు కదా... అంటు గొల్లుమంది. నర్సమ్మ కాస్తంత విసుగ్గా "ఇలా ఏడవకపోతే తాగోద్దని నీ మొగుడికి ముందే బుద్ధి చెప్పివుంటే ఈ గొడవ అయ్యేది కాదుకదా..." అంటూ విసుగ్గా వెళ్లింది. నర్సమ్మకి యింకా పెళ్ళి కాలేదు కదా అందుకే అలా అనగలిగింది. అనుకుంటూ అక్కడే కుర్చీలో కూర్చున్న డాక్టరు దగ్గరికి వెళ్ళి కొమరయ్య ఆరోగ్యం గురించి అడిగింది. డాక్టరు ఒకరోజు గడిస్తేగాని చెప్పలేమని చెప్పాడు. మొగిలన్న శాంతతో 'ఇంటికెళ్ళి తనభార్యకు చెప్పి మళ్లీ వస్తానని వెళ్లాడు.

శాంత తన భర్తకు ఏమీ కాకూడదని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంది. శాంత మొర విన్నట్లుగా మర్నాడు కొమరయ్య కాస్త కళ్లు తెరిచాడు. "అమ్మా" అంటూ మూలిగాడు. డాక్టరు వచ్చి చూసివెడుతూ శాంతతో కాళ్లలో ఎముక చిట్లిందనీ, నరాలు దెబ్బతిన్నాయని చెప్పి కొన్నాళ్ళు బెడ్ మీద ఉంటే గానీ, తగ్గదనీ, తరువాతనే నడవగలడనీ చెప్పాడు. శాంతకు గుండెలో రైళ్ళు పరుగెత్తాయి. భర్త లేచి వెంటనే తిరగకపోతే డ్యూటీకి ఎలా వెళ్తాడు పులి మీద పుట్రలాగ కష్టం మీద కష్టం వచ్చిపడ్డట్టనిపించింది. తనేం చేయగలదు. ఇంట్లో పిల్లలెలా ఉన్నారు ? పెద్దవాడు ఇంటికి వచ్చాడో లేడో అనుకుంటూ లోపలి నుండి పొంగుకొస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అణచుకుంటూ భర్త మంచం దగ్గరగా ఉన్న స్టూలు మీద కూర్చుని కళ్లు తుడుచుకుంటూ లోపల ఏడుపు లోపలనే దిగమింగుకుంటోంది.

ఇంతలో ప్రక్కింటి రాధ వచ్చింది. రాధను చూడగానే శాంత బావురుమంది. కడుపు చించుకొని వచ్చినట్టు కష్టాన్ని వెలిగ్రక్కింది. రాధ శాంతకు ధైర్యం చెప్పింది. కొమరయ్యకు తగ్గుతుందనీ, తొందరగా కోలుకుంటాడని చెప్పింది. వెడుతూ పిల్లవాడి ఫీజు విషయం తాను చూసుకుంటానని ఇంటి దగ్గర పిల్లల గురించి బెంగపెట్టుకోవద్దనీ, వాళ్ళ సంగతి తానుచూసుకుంటానని చెప్పివెళ్ళింది. అంత కష్టంలోనూ రాధవంటి ఉత్తమరాలిని దేవుడు చూపించినందుకు ఆ దైవానికి మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టుకుంది.

ఆ మర్నాడు కొమరయ్య కళ్లు తెరచి చూసాడు. మాట్లాడగలుగుతున్నాడు. కాళ్లు మాత్రం కదలటానికి వీలులేకుండా ఉంది. భార్య మొహంలోకి చూడలేక పోయాడు. భార్యకు తాను అన్యాయం చేస్తున్నట్లు భావించాడు. శాంతకు రెండు రోజుల నుండి నిద్రలేకపోయే సరికి వళ్లు తూలటం మొదలుపెట్టింది. బలవంతంగా నిలదొక్కుకుంటూ భర్తకు కావలసినవన్నీ దగ్గరుండి చూసుకొంది. నర్సమ్మను చూసుకోమని చెప్పి ఇంటి కెళ్ళి పిల్లల సంగతి ఒకసారి చూసుకొస్తానని భర్తతో చెప్పి ఇంటి ముఖం పట్టింది.

ఇంటికి వచ్చి స్నానం చేసి బట్టలుతుక్కుని ఆరేయటానికి వచ్చేసరికి రాధ కనబడి "శాంతక్కా ! నీ కోసమే చూస్తున్నా ! అన్నకు ఎలా ఉంది? " అంటూ ఆత్రంగా అడిగి "రాత్రి మా ఇంటాయనకు నీ పిల్లాడి ఫీజు సంగతి చెప్పాను బ్యాంకుకు వెళ్లి డబ్బు తెచ్చి నన్ను కట్టమని చెప్పారు. హాస్పిటల్ దారిలోనే బ్యాంకు ఉంది నువ్వు వెళ్ళేటప్పుడు ఇద్దరం కలిసే వెడదాం నాకు

పెద్ద పనేం లేదు. నేను కూడా హాస్పిటల్‌కొచ్చి కాసేపు కూర్చొంటాను. అన్నంతిని బయలుదేరుదాం" అంది.

శాంత కాస్త ఎంగిలిపడింది. అన్నం తింటూ రాధ గురించి ఆలోచించింది. రాధ పదవ తరగతి వరకు చదివింది. తెలివి గలది. అన్ని విషయాలు భర్త నడిగి తెలుసుకుంటుదేమో - రాధకు అన్నీ తెలుసు. అదృష్టం కొద్దీ వెంకట్ లాంటి మంచి భర్త ఆమెకు దొరికాడు. రాధతో అన్ని విషయాలు చెప్పి చర్చిస్తూ వుంటాడట. మళ్లీ హాస్పిటల్‌కి వెళ్లటానికి గబగబా అన్నం తింది.

బాంకు నుండి డబ్బు తీసుకొని వస్తున్న రాధతో శాంత "రాధా! బ్యాంకులో నీ పేరున డబ్బు ఉంటుందా? " అని అడిగింది. రాధ "అవును జీతం తీసుకుంటానే ఇంట్లో ఖర్చులు అవీ పోనూ మిగిలిన డబ్బు జాయింటు ఎకౌంట్‌లో వేస్తాము. పిల్లల విషయమై అత్యవసరంగా ఏదైనా డబ్బు కావాలంటే నేనొక్క దాన్నైనా వెళ్లి తీసుకునే వీలుగా అకౌంట్ ఉంటుంది. " అంది శాంతకి ఇదంతా క్రొత్తగానూ ఆశ్చర్యంగానూ అనిపించింది. పైగా రాధ లాంటి వారి కోసమే బ్యాంకులున్నాయనిపించింది.

శాంత ఆశ్చర్యంతో "అవునూ మీ వారు మా ఇంటాయనా ఇద్దరూ ఒకే రకమైన ఉద్యోగమే కధా ! మీరు డబ్బులు ఇలా దాచుకో గలుగుతున్నారంటే మీ వారు తాగుడు తాగకపోవటమే కారణం అనుకుంటా' అంటూ తన మొగుడు గుర్తుకు వచ్చి తాను పతివ్రతగా భర్తనే గొప్పగా భావించుకుంటూ ఉన్నాననీ, ఎప్పుడూ అలానే ఉండాలనుకుంటూ ఉండే శాంతకు ఆక్షణంలో భర్త అంటే కాస్త తక్కువదనం, రాధ మొగుడు 'మంచివాడు' అన్న భావం మదిలో మెదిలింది.

హాస్పిటల్ దారి వైపు నడుస్తున్న రాధ శాంతతో "నిన్న జీతాల రోజున్న మాటే గానీ మా ఆయన చాలా బాధపడుతూ ఇంటికి వచ్చాడు. డ్యూటీ నుండి వచ్చిన ఆయన ఎందుకలా ఉన్నాడో అర్థం కాలేదు. టీ పెట్టి ఇచ్చి "ఏమిటండీ అలా ఉన్నారని అడిగితే కాస్తంత చిరాకుగా పరాకుగా "ఏమిటో రాధా ! ఇంకా ఎన్నాళ్ళో ఏమిటో అన్నాడు. నేను కాస్త అర్థం అయ్యేటట్లు చెప్పమనే సరికి దోపిడీ రకరకాల ఉందనీ ఎంత చెట్టుకు అంతగాలి' మనసుంటే మార్గాలు ఎన్నో అంటూ ఏమిటో వేదాంతం మాట్లాడుతూంటే 'సరిగ్గా చెప్పండీ' అన్నా తప్పులెన్ను వారు తమ తప్పు లెరుగరు' అంటూ ఒకళ్లనొకళ్లు దోచుకుంటూనే ఉన్నారనీ, చెప్పేటందుకే శ్రీరంగనీతులు' అన్నారు. ఏమిటండీ విచిత్రంగా

మాట్లాడుతున్నారని నేనంటే అసలు విషయం చెబుతూ " అు ఏం లేదు. ఈ సారి జీతంతో పాటు ఉత్పత్తి బోనస్ ఇచ్చారు. దాన్ని భవిష్యత్తులో పిల్లల చదువుకు ఉంటుందని జాతీయ బాండ్లు కొందామనకున్నా జీతాల కౌంటరు నుండి జీతం తీసుకుని ఇలా రెండడుగులు వేసానో లేదో ' ఏం వెంకట్ ! తప్పించుకొని పోతున్నావా ? డబ్బు కళ్లబడేసరికి మేం కనబడటం లేదులే' అంటూ ఒక యూనియన్ నాయకుడు ఎదురయ్యాడట పైగా ఈ సారి డబ్బు లెక్కువ వచ్చాయిగా చందా ఎక్కువ ఇయ్యాలన్నాడట. సరేలే అని ఏభై రూపాయలు ఇచ్చి ఇవతలకి రాంగానే మరో యూనియన్ నాయకుడు ఏమిటి ఆ యూనిమన్ వాడికి చందా ఇచ్చావా? అసలు లాభాల బోనస్ ఇప్పించటానికి మేమంత కష్టపడ్డామో తెలుసా ? అసలు స్ట్రైకు కూడా చేస్తామని ముందుకొచ్చింది. మేము కాబట్టి వాడికంటే మాకెక్కువ చందా కట్టాలి బ్రదర్ "అంటూ మరో యూనియన్ నాయకుడు వాడికి డెభైఅయిదు రూపాయలు కట్టి వాళ్ళను వదిలించుకొని వస్తుంటే జె.ఎ.సి. సభ్యులు నీకు డబ్బులు రావటానికి మా పోరాట ఫలితమే' అంటూ మరొకరు వెంటబడ్డారట చేసేది లేక 'ఓరి భగవంతుడా ! శ్రమకి ఫలితం దక్కిందనుకోవాలా ? తగ్గిందనుకోవాలా ? అంటూ ఒంట్లో నిస్సత్తువ ఆవహిస్తుంటే వాళ్ళకి వంద రూపాయలు సమర్పించుకుని కాళ్లీడ్చుకుంటూ వచ్చారట. అసలే సమ్మెలు చేయిస్తున్నది చాలక పోగా యీ దండుకోవటాలు. జీతంలో సమ్మెకాలానికి కోత పోను ఆ మిగితాది వీళ్లకివ్వటంతోనే సరిపోతోంది. 'తలా పాపాలకు తిలాకుంచడు' లా సామెత మార్చి చెప్పాలనిపిస్తోంది. అసలు చందాల కోసమే సమ్మెలు చేయిస్తున్నారా ఈ యూనియన్లు అని అనిపించేంతగా విసుగొస్తోంది. ఆ బోనస్ తాలూకు డబ్బును అందరికీ పంచి యింటికి వచ్చే సరికి బోనస్ వచ్చిన ఆనందం ఆవిరయిపోయిందని ఆయన చెప్పేసరికి అందుకే అలా చిరాకు పడ్డాడని అర్థం చేసుకున్నా" అంది రాధ.

ఇలా మాట్లాడుకుంటూ ఇద్దరు హాస్పిటల్ దారివైపు మలుపు తిరిగి తుంటే అటుగా వస్తున్న హెడ్ ఓవర్‌మన్ రంగయ్య కనబడి "ఏమ్మా ! బాగున్నారా "అని అడిగాడు. "అు ఏంబాగులే అన్నా ! చాలీ చాలని జీతాలతో ఎప్పుడూ కష్టాలే కదా !" అంది రాధ.

"అదేంటే రాధమ్మా ! మీ ఆయన సారాకని ఖిల్లీలకనీ డబ్బు తగలెయ్యడు గదా ! నువ్వు కూడా అలా కష్టాలంటే ఎలాగా !" అన్నాడు ఏంటి అన్నా ! ఒక బాధ లేకపోతే మరొక బాధ. ఏరాయి అయితేనేమి? నా సంగతి ఒక్కటే కాదు.

ఎక్కువ మంది కార్మిక కుటుంబాల స్త్రీల యొక్క సమస్యలు అవి కర్ణుడి చావుకు ఆరు కారణాలుగా ఉంటాయి అవి. ఇంట్లో యిబ్బందులను ఎలాగో ఒకలాగ లాక్కు రాగలం గానీ బయటి ఇబ్బందులను మీలాంటి పెద్దలు పూనుకొని తీర్చాలి" అంటూ ఇంట్లో ఇచ్చే జీతాలు సరిపోక ప్రతి యింట్లో కార్మిక కుటుంబాల స్త్రీలు పడుతున్న కష్టాలను ఏకరువు పెట్టింది..

అంతా విని విషయం అర్థం చేసుకున్న రంగయ్య "రాధమ్మా ! మన కష్టాలు తీరే రోజు వచ్చిందిలే మేనేజిమెంటు వచ్చే నెల నుండి జీతాలను సరాసరి బ్యాంకుకు జమ చేస్తుందట. ఇక యూనియన్లనీ, ఖాతాలనీ కౌంటర్ దగ్గరే జీతాన్ని పిక్కుతినే వారుండరులే." అన్నాడు. రంగయ్య ప్రక్కనే ఉన్న పోషం "అదేంటి సార్ ! బ్యాంకుకు అందరు ఒకే రోజు వెడితే గట్ల కిటకిట లాడుతూ డబ్బు తీసుకోవడం ఆలస్యం అవుతుంది. పైగా బ్యాంకు టైము, డ్యూటీ టైమింగ్స్ ఒకటే డ్యూటీ నుండి దిగి వెళ్లే సరికి బ్యాంకులో డబ్బు డ్రా చేసే కౌంటరు మూసేస్తారుగా బ్యాంకు నుండి డబ్బు తీసుకోవటానికి ఇక నాగా పెట్టాల్సిందేగా సార్ ! అని అనేసరికి రంగయ్య "బ్యాంకు నుండి జీతం తీసుకోవటానికి నాగా పెట్టాల్సిన పనిలేదు పోశమ్! ఎందుకంటే కార్మికులు డబ్బు బ్యాంక్ నుండి తీసుకోవటానికి వీలుగా ఉండే టైమింగ్స్‌నీ, దానితో పాటు బ్యాంకు వాళ్ళు ఎ.టి.యం. (ఆల్‌టైమ్ మనీ)ను పాటిస్తారు". అన్నాడు దానికి పోశమ్ "సార్ ! ఇప్పుడు మైన్ దగ్గరే జీతాలు యివ్వటానికి, బ్యాంకులో జీతం తీసుకోవటానికి తేడా ఏమిటి?" అని అడిగాడు. రంగయ్య అసలు బ్యాంకు ద్వారా డబ్బులు అందించాలంటే యాజమాన్యం నిర్ణయాన్ని తీసుకోవటానికి కారణం ఏమిటంటే జీతం అంతా ఒకే రోజు చేతిలో పెడితే ఖర్చు ఎక్కువ అవుతుంది. కొద్దిగా కూడా పొదుపు అనేది ఉండదు. భద్రత తక్కువ. పై పెచ్చు యూనియన్లు ఒక ప్రక్కా సారా కొట్టు ఖాతాల వాళ్లు మరొక ప్రక్క పీక్కుతింటుంటే అదే రోజు జీతం అంతా అయిపోతే కార్మికుడు ఇంటికి తీసుకొని వెళ్ళి పెళ్ళానికి ఇంటి ఖర్చుల కోసం ఇచ్చేది చాలా తక్కువ. భార్య మాత్రం ఎలా గడుపుకొస్తుంది. దానితో ఇంట్లో గొడవలూ అవీ .... ఇంట్లో పిల్లలకి చదువులు చెప్పించాలన్నా, పెళ్ళిచేయాలన్నా నాలుగు రాళ్ళు వెనకేస్తేనే కందా పిల్లల భవిష్యత్తు బాగుండేది. నా పేరున బ్యాంకులో అకౌంటు తెరిచే పనుంది వెడుతున్నా. ఇంటికి వెళ్ళేటప్పుడు కొమరయ్యను వచ్చి చూస్తాలే శాంతమ్మా!" అంటూ వెళ్లిపోయాడు.

అంతా విన్న రాధ తాను కార్మికవాడలన్నీ తిరిగి ఆడవాళ్లకి మెల్లమెల్లగా

అక్షరాల నేర్పాలనీ, అందర్నీ చదువుకునేటట్లు చేయాలని ప్రతి ఇంట్లో వెలుగులు ప్రసరించాలనీ ఆ క్షణంలోనే మనసులో గట్టిగా అనుకుంటూ శాంతతో కలిసి హాస్పిటల్‌కి చేరుకుంది.

పది రోజుల తర్వాత కొమరయ్య హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయినా డ్యూటీకి వెళ్ళటానికి మూడు నెలలు పట్టింది. మరో ఆరు నెలల గడిచే సరికి డబ్బు జీతం డబ్బు అవసరమైనంత వరకే బ్యాంకు నుండి తెచ్చుకొని వాడుకోవటం మొదలైంది, జీతం అంతా 8వ తారీఖునే ఖర్చు కాకుండా కాస్త 25వ తారీఖు వరకూ చేతిలో ఆడుతోంది కొన్నాళ్ళకు కాస్త కాస్త మిగుల్చుకోవటం నేర్చుకున్నారు. దానికి తోడు ప్రమాదం జరిగినప్పటి నుండి కొమరయ్య తాగుడు జోలికి పోవటం లేదు. నాలుగు నెలలలో ప్రక్కింటి రాధ దగ్గర తీసుకున్న అప్పు తీర్చేసింది శాంత.

ఒక రోజు కొమరయ్య డ్యూటీ నుండి ఇంటికి వచ్చి శాంతతో సినిమాకి వెడదాం రమ్మని అన్నాడు. ఈ మధ్య కొద్దిగా ఉషారుగా ఉంటున్నాడు. రాగానే మజ్జిగా తెచ్చి యిచ్చింది. తాగుతూనే "శాంతా ! డ్యూటీలో పడ్డ కష్టమంతా నీ చల్లని చేతి మజ్జిగ ఇవ్వగానే వళ్ళు నొప్పులన్నీ తగ్గిపోతున్నాయి. అంటూ శాంతవేపు చూసాడు. శాంత అతని మోహంలోకి చూసింది. అనురాగపు దీపపు కాంతులు పోటీ పడ్డాయి. "ఇవాళ 5వ తారీఖు ఇంకా రెండు రోజుల్లో జీతం వస్తుంది. అపుడు వెడదాం" అంది శాంత "అదేం కుదరదు శాంతా ! ఇప్పుడు డబ్బులు ఉన్నాయి కదా. వెడదాం" అన్నాడు. సరే ! ఈసారికి మీ మాట కాదనను, కానీ డబ్బులున్నాయని సినిమాకి వెడదాం అని మాటి మాటికీ అంటే కుదరద"ని నిఖ్ఖచ్చిగా చెప్పింది. "పిల్లల అవసరాలు చూడాలి. వాళ్లని పెద్ద చదువులు చదివించాలి. దానికి డబ్బును పొదుపు చేయటం చాల అవసరం. ప్రక్కింటి రాధ పిల్లల చదువులకనీ, పెళ్ళిళ్లకనీ రికరింగ డిపాజిట్ చేస్తోందట. ఈ మధ్య బోనస్ వస్తే దాన్నంతా పిల్లల పేర ఫిక్సడ్ వేసిందట. పెరిగిన జీతం వల్ల వచ్చిన డబ్బును ప్రతినెలా బ్యాంకులో వేస్తే పిల్లవాడి చదువుకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నా" అంది "సరేలే శాంతా! నీ ఆలోచన్లు చాలా బావున్నాయి. ఆ రోజు రాధ మన పిల్లవాడి ఫీజు కట్టటానికి డబ్బు యిచ్చింది కాబట్టి వాడు మళ్లీ ఇంటికి తిరిగి వచ్చి బాగా చదువుకుంటున్నాడు. పరీక్షలు బాగా వ్రాస్తున్నాడు. వాడి కోసం బ్యాంకులో ఎడ్యుకేషన్‌లోన్ తీసుకుని ఇంజనీరింగ్ చదివిద్దాంలే ఈ మధ్యనే ఒక్క స్కీము వచ్చిందట.

కొంత డబ్బును నికరంగా బ్యాంకులో ఉంచితే కార్మికులకు ఏదైనా ప్రమాదం వచ్చినా ఇన్సూరెన్స్ రూపంలో లక్షరూపాయలు బ్యాంకు చెల్లిస్తుంది. గని పని కదా ఏ రోజు ఎలా ఉంటుందో చెప్పలేం. ఇప్పుడు తెలుస్తోంది నాకు ఇన్నాళ్ల నుండి త్రాగుడుకు ఎలా డబ్బుతగలేశానా అని తలుచుకుంటే నాకే అవమానంగా ఉంది. నాకు లాగా ఎవరూ తాగుడుకు ఖర్చు చేయకుండా ఉండాలంటే జీతాల రోజులకు ముందు వెనకలుగా రోజూ డ్యూటీ నుండి దిగే వాళ్ళకు మజ్జిగ త్రాగిపించటం అలవాలు చేస్తే కొన్నాళ్లకు వాళ్ళు గనిపని కష్టం నుంచి సేదదీర్చే మజ్జిగను అలవాటు చేసుకొని వెధవ తాగుడుకు స్వస్తి పలికి మానేస్తారని పిస్తోంది" అన్నాడు.

శాంత తన భర్తలోని మార్పుకు విస్తుపోవటమే గాక తనలాగా తోటి కార్మిక కుటుంబ స్త్రీలు ఆనందంగా ఉండగులుగుతారనే ఆశ కలిగి మనసులోనే తృప్తి పడింది.

శాంత భర్తతో" ఆ రోజుల్లో ఎంత బాధ పడేదాన్నో ఇప్పటికి మీకు అర్థమయిందనుకుంటా. తాగి రావటం, జీతం డబ్బు సారా కొట్టు ఖాతాలన్నిటికీ పోను ఖాళీ జేబుల్తో ఇంటికి వస్తుంటే నాకు సంసారం అంటే విరక్తి కలిగి పిల్లలకింత విషం ఇచ్చి నేనింత త్రాగి చద్దామనిపించేది. మొత్తం మీద బ్యాంకు జీతాలు, పొదుపు వల్ల ఇవాళ నేనింత ఆనందంగా ఉంటానని కల్లో కూడా ఊహించలేదు. చాల మంది కార్మికులు భార్యల పేరిట జాయింటు అకౌంట్ వేస్తున్నారట. భార్యలు వెళ్లి అవసరం వచ్చినప్పుడు తెచ్చుకుని వాడుకో గలుగుతున్నారు. భార్యలు కూడా బ్యాంకు కోసం అలా వీధిలోకి వెళ్ల గలగటం, బయట అన్ని విషయాలను ఆకళింపు చేసుకోగలగటం నేర్చుకున్నారు. బ్యాంకులు ఇచ్చే 'లోన్లు' అవి తెలుసుకొని చిన్న చిన్న కుటీర పరిశ్రమలు పెట్టుకోవాలనుకుంటున్నారు. 'స్వయం శక్తి' గ్రూపులుగా ఏర్పడుతున్నారట. అయినా బ్యాంకు నుండి జీతాలు తెచ్చుకునే అర్హత మాకు కూడా ఉండాలి ఎందుకంటే రోజూ భర్త డ్యూటీకి వెళ్ళాలంటే భర్త యొక్క కుటుంబ అవసరాలన్నిటిలో మా సహకారం ఉంది కనకనే కదా డ్యూటీకి టైముకి వెళ్లగలుగుతున్నారు. కార్మికులు టైముకి క్యారియర్ కట్టిస్తేనే కదా ఇంత తిండి తినగలుగుతోంది. డ్యూటీ చేయగలుగుతోంది. టైముకి మస్టరు పడగలిగేదీనూ. అప్పుడే గదా మీరు బొగ్గు బయటకు తీయగలిగేదీ, కంపెనీకి లాభాలు వచ్చేదీను. అంటే మొత్తం మీద బొగ్గు ఉత్పత్తిలో పరోక్షంగా మా సహకార భాగస్వామ్యం

ఉందన్న మాటను మీరు ఒప్పుకోవాల్సిందే. ఇంట్లో అన్ని పనులు చేసి ఇంటి బాధ్యత పట్టించుకొని, వండి పెడితే మీరు ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారు. కార్మికుని ఆరోగ్యమే కంపెనీ ఆరోగ్యం కదా !" అంటూ శాంత కిల కిలా నవ్వింది. కొమరయ్యకు ఏమిటో అర్థం అయి " నెరజాణ వయ్యావు" అన్నాడు.

శాంత "అవునండీ ! భర్త సరిగ్గా ఉంటే భార్య సజావుగా సంసారాన్ని నెట్టుకొస్తుంది. భార్య మాటకు విలువ ఉంటే భర్తకు వ్యసానాలు అబ్బవు. భర్త వ్యసనాల జోలికి పోకపోతేనే అతనిని భార్య యొక్క విలువ తెలుస్తుంది. మొత్తం మీద కార్మికులకు బ్యాంకు జీతాలతో కుటుంబాలు బాగుపడ్డాయి. భార్యలు బ్యాంకుకు వెళ్ళి జీతం డ్రా చేస్తుంటే కార్మికులు త్రాగటానికి కావల్సిన డబ్బులను భార్యను అడగలేక పోతున్నారట. క్రమ క్రమంగా త్రాగుడు తగ్గించారట. మొత్తం మీద చాలవరకు త్రాగుడు తగ్గించేసరికి కార్మికుల ఇళ్ళు, వళ్ళు కూడా బాగుపడ్డాయి." అంది శాంత, కొమరయ్య "అంతేకాదు మొత్తం బొగ్గు గనులే బాగయినాయి. ఇదివరకు తాగినాగాలు పెట్టే వాళ్ళం ఇప్పుడు నాగాలు పెట్టక పోయేసరికి ఉత్పత్తి బాగా పెరిగిందట. యాజమాన్యం కార్మికులను మెచ్చుకుంటోంది అని అంటుంటే "మొత్తం ప్రపంచమే బాగుపడింది నాన్నా !" అని పిల్లలు ఇల్లంతా నవ్వులు విరబూయిస్తుంటే, వారి కళ్ళలోని కాంతులు ఇంటినంతా ఇల్లంతా వెలుగులతో నింపాయి.

(2006)

మట్టిపల్లకి

తొలిఉషస్సు మెలమెల్లగా తన కిరణాలతో ఆకాశమంతా పరుచుకుంటుంటే చీకట్లు తమంతటతామే తప్పుకుంటున్నాయి. విమానంలో నుంచి విహంగవీక్షణం చేస్తున్న కిరణ్‌కి భూమ్యాకాశాలు కలిసిపోయి చీకటివెలుగుల మాయాజాలంలో పల్లెలు నిద్రలేస్తున్నట్లనిపించింది. మరు నిముషంలోనే మా అంతటి వాళ్ళు లేరంటూ పెద్ద పెద్ద మేడలు నిక్క పొడుచుకొని జిగేల్‌మనే లైట్లతో తొలికిరణాల వెలుగులకు గుర్తింపు లేకుండా చేయాలనుకుంటు పోటిపడుతున్నట్టనిపించింది. నగర జీవనం లేవటానికి బద్ధకిస్తూ జలతారు ముసుగు కప్పుకొని మళ్ళీ నిద్ర లోకి జారుకుంటోంది. "యువర్ అటెన్షన్ ప్లీజ్" వియార్ లాండింగ్ టు హైదరాబాద్" అని మైకులో వినబడ్డ ఎయిర్ హోస్టస్ మాటలకు ఒక్కసారిగా తుళ్ళిపడి లేచిన భానుమతమ్మ విప్పారిన కళ్ళతో చుట్టూరాచూస్తూ "అబ్బ ప్రాణం లేచివచ్చినట్లుందిరా కిరణ్; ఆంధ్రలో అడుగుపెట్టగానే" అంది నిద్రమత్తును వదిలించుకుంటూ. "ఆ(...... ఆ(...... ముందు దిగమ్మా" అంటూ తల్లిని తొందరపెట్టాడు కిరణ్. "తాతయ్య కారు పంపిస్తానని ఫోన్ చేశాడు. ఈ పాటికి వచ్చేసుంటూందిలే" అంటూ సీటులో నుండి లేచింది భానుమతమ్మ.

"సామాను తీసుకొని బయటకు వెళ్ళినతర్వాత ఆ విషయం ఆలోచించుకోవచ్చులే ముందు దిగు వెడదాం" అంటూ కిరణ్ తన తల్లి చేయిపట్టుకొని మెట్ల మీదనుండి దిగివచ్చి బెల్టు దగ్గర నిలబడి సామానును తీసుకొని చెకింగ్ తతంగాన్ని పూర్తిచేసుకొని బయటపడ్డాడు. టాక్సీలవాళ్ళతో హడావుడిగా ఉంది హైద్రాబాద్ విమానాశ్రయ ప్రాంగణం. ఇంతలో "భానుమతమ్మ గారూ! బావున్నారా!' ఓ..మనబ్బాయిగారేనా? బాబును చూసి చాలారోజులైందమ్మా" అంటూ సంతోషంగా పలకరిస్తున్న ఒక వ్యక్తిని చూసి మాఅబ్బాయే సుబ్బన్నా! అవును నీ ఆరోగ్యం ఎలా ఉంటోంది' అంటూ కుశల ప్రశ్నలు వేసి అతని ప్రక్కన నిలబడ్డ ఆ కుర్రాడివైపు చూసి "ఎవరూ"? అంటూ అడిగింది భారతమ్మ.

"అమ్మా! వీడు మా అబ్బాయి రవి. డ్రైవింగ్ నేర్చుకొని ఇక్కడ టాక్సీ నడుపుకుంటూ బతుకుతున్నాడు. మా బాబును గుర్తుపడతారో లేదోనని నేను కూడా వచ్చాను' అంటూ "రవీ॥ భానుమతమ్మ గారి సామాను అందుకోరా'

అంటూ వాళ్ళబ్బాయిని తొందరపెట్టాడు.

"సుబ్బన్నా! పెద్దవాడివయ్యావు. ఈ తుంపరలో తడుస్తూ మా కోసం వచ్చావా! మన ఊరివాళ్ళంతా బాగున్నారా? అంది ఆప్యాయంగా. ఈ లోపల రవి సామాన్లు దూరంగా ఉన్న కారులో పెట్టి వీళ్ళున్న చోటికి కారును తెచ్చాడు. వెనక సీట్లో తల్లీ కొడుకులు కూర్చున్నారు.

ముందుసీట్లో కూర్చున్న సుబ్బన్న "అమ్మా మన ఊరికి మీరొచ్చి ఏ పదేండ్లో దాటి నట్టుంది. ఇప్పుడు ఊరంతా మారిపోయింది చూస్తారుగా" అంటూ కిరణ్ వైపు తిరిగి "ఏంటమ్మా మన అబ్బాయిగారు అలా ముభావంగా ఉన్నారు. చిన్నప్పుడు తాతగారింటికి వచ్చినప్పుడు మా రవితో కలిసి చెట్లమ్మటా పుట్టలమ్మటా తిరుగుతుండేవాడు. చేలగట్లకు వెళ్ళి చెరుకుగడలు తెచ్చి ఊళ్ళో పిల్లలకు ఇస్తుండేవాడు. ఎప్పుడూ పది మందిని వెంటేసుకుతిరిగేవాడు. అవునులేమ్మా! ఇప్పుడు పెద్దవాడయిపోయి అమెరికాలో ఉండేసరికి బాబుగారిలో మార్పురావడం సహజం లేమ్మా" అంటూ తనకు తెలియకుండానే ఒక నిట్టూర్పు వదిలాడు. వెంటనే కిరణ్ గంభీరంగా చూసి 'లేదు సుబ్బన్నా! చుట్టూరా విచ్చుకున్న వెలుగుల మధ్య జుట్టు రేగినట్లుగా ఉన్న గుడిసెలు, అక్కడక్కడా మట్టి పెళ్ళలను నెత్తిమీద పెట్టుకున్నట్టున్న పెంకుటిళ్ళను చూస్తుంటే నా బాల్యం గుర్తుకు వస్తోంది." అంటూ తదేకంగా డ్రైవ్ చేస్తున్న రవివైపు తిరిగి 'రవీ! చిన్నప్పుడు మనం పోటీపడి చెరువుగట్టున ఉన్న బంక మట్టితో రకరకాల బొమ్మలు చేసేవాళ్ళం. చిన్నప్పటి తీపి గుర్తులు అప్పుడప్పుడు లీలగా మెదడును కెలికేస్తుంటాయి. నా చిన్నప్పుడే ఆ ఊరును వదిలిపెట్టి హైద్రాబాదు వచ్చేసాము కదా! అవును రవీ! మీరెంతవరకు చదివారు" అన్నాడు కిరణ్.

"మన ఊళ్ళో పంచాయితీ స్కూల్లో పదివరకు చదివాను. మానాన్న చదివింది చాలు పొలం చూసుకోమని పోరు పెడితే చదువు మానేశాను. ఆపని మీద శ్రద్ధలేక హైద్రాబాద్ వచ్చి యిదిగో..... ఇలా టాక్సీ నడుపుకుంటున్నాను" అన్నాడు కొంత అసంతృప్తితో.

వీళ్ల మాటలు విన్న భానుమతమ్మకి ఆమె మనస్సు ఆమె కంటే ముందే ఆ ఊరు చేరుకోవటంతో సంబరపడుతూ 'సుబ్బన్నా! అన్నాలుతినే వేళకి ఊరు చేరుకుంటామా? ఇంట్లో అందరూ భోజనాలు చేయకుండా వస్తున్నాంకదా

అని అందరూ మన కోసం ఎదురుచూస్తుంటారేమో" అంది ఏదో గుర్తుకు వచ్చిన దానిలా! 'ఆ(। వెళ్ళి పోతామమ్మా యిదిగో ఈ వాన తుంపరలు ఎక్కువైతే మరో గంట పట్టవచ్చు".

"పోనిలే సుబ్బయ్యా; మరో గంట పట్టినా ఫరవాలేదులే. పంటలు పండాలంటే వానలు బాగా కురవాలి కదా! అవునూ! మీ పొలాలెలా ఉన్నాయి? పంట దిగుబడి బాగా ఉంటోందా?

"ఏ వానలో ఏమిటోనమ్మా అతివృష్టి, అనావృష్టి! సకాలంలో వానలు కురవటం లేదు. అదేమంటే అంతా కాలుష్య ప్రభావం అంటున్నారు. ఒక్కొక్కప్పుడు తాగటానికి నీటి ఎద్దడి కూడా ఏర్పడుతోందమ్మా. ప్రభుత్వం అదేదో మేఘ మథనం చేస్తాం అంటోంది. మరి చూడాలి" అన్నాడు నిరాశగా సుబ్బన్న. "అదేమిటి సుబ్బన్నా! మన ఊరి చెరువు నిండా నీళ్ళు ఉండేవిగా, వేసవి కాలంలోకూడా నీళ్ళుండేవికదా. ఇబ్బందే ఉండేది కాదు, అయ్యో ఇప్పుడేమయింది. అవును సుబ్బన్నా రేపు వినాయక చవితి కదా మనఊళ్ళో చవితి పందిళ్ళు వేశారా? నా చిన్నతనంలో నవరాత్రిళ్ళు ఎంతబాగా జరిగేవి. పండగ నాటికి చేరుకుంటానో లేదోనని హడావుడి పడ్డా. కిరణ్ కి మన ఊళ్ళో వినాయక చవితి చూపిస్తే మన సంస్కృతి అంటే ఏమిటో అర్ధమవుతుంది". అంది భానుమతమ్మ కొడుకు వైపు చూస్తూ.

"ఏమిటమ్మా ఎప్పుడూ మన సంస్కృతి, మన సంస్కృతి, అంటూ గోల పెడతావు. వినాయకుడికి పూజ చేయటం మన భారతీయ సంస్కృతి, సరే అలాగే అన్ని దేశాల్లో వాళ్ళవాళ్ళ మతాల ప్రకారం ప్రార్థనలు చేసుకుంటారు కదా..." అన్నాడు. కిరణ్ ఎటో ఆలోచిస్తున్నాట్టుగా. అతని మాటలు పూర్తి చేయకమునుపే భానుమతి అందుకుని "మన సంస్కృతి, వేరురా... మనదెంతో గొప్ప సంస్కృతిరా... మనది వ్యవసాయ సంస్కృతి. మన సంస్కృతికి పట్టుగొమ్మలు పల్లెటూళ్ళురా. అక్కడికి వెడితే గానీ నీకు అర్ధం కాదు" అంది.

తల్లికి ఆంధ్ర దేశమన్నా తాను పుట్టిన గ్రామమన్నా ఎంత మక్కువో" అని మనసులో అనుకుంటూ కిరణ్ కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని కారు డోరు గ్లాసుల్లో నుంచి చూస్తు రోడ్డుకు ప్రక్కనున్న ప్రదేశాలను కూడా చూడటానికి ప్రయత్నిస్తున్నాడు. వర్షపు నీళ్ళను కారు వైపర్ తుడుస్తుంటే రోడ్డును చూసుకుంటూ కారు నడపడంలో నిమగ్నమయ్యాడు రవి. భానుమతమ్మ

మాటలు మనసులో పన్నీరు జల్లినట్లనిపించి సుబ్బన్న "అమెరికా వెళ్ళినా ఇంకా మన సంస్కృతిని గురించి మరచిపోలేదంటే మీదెంత మంచి సంస్కారమమ్మా" అన్నాడు.

"అదేమిటి సుబ్బన్నా! మన సంస్కృతిని అన్ని దేశాలు మెచ్చుకోవాల్సిందే. మనది చాలా పురాతనమైనది. మనకంటూ వారసత్వంగా వచ్చిన ఆస్తి మన సంస్కృతి, మనది గ్రామీణ సంస్కృతి కదా' అంది.

"అమ్మా అదేదో కాస్త వివరంగా చెప్పమ్మా నాకేమి అర్థం కావటం లేదు" అన్నాడు కిరణ్. "అవున్రా విదేశాలకెళ్ళటానికి వీలయిన చదువులు చదువుకున్నావు గానీ, మన ఉనికికి ముఖ్యమైన ఈ భూసంస్కృతిని వంటపట్టించుకోలేక పోయావురా' మన దేశం వ్యవసాయాత్మక దేశం. దాన్ని ఆధారం చేసుకొని మనం పండగలు జరుపుకుంటాము. అదిగో దూరంగా కనపడుతున్న ఆ పల్లెటూళ్ళను పంట పొలాలను చూడు. పచ్చ చీర కట్టుకున్న భూదేవి వర్షపు చినుకులకోసం వరినాట్లముక్కుపుటాలతో నీళ్ళు పీల్చు కోవాలని తపన పడుతోంది".

భానుమతమ్మ మాటలను వింటున్న సుబ్బన్న తలంపులు ఒక్కసారిగా అతని పొలం గట్ల తలుపులను తెరిచేసరికి ఆలోచనలలోకి వెళ్ళిపోయాడు.

"అమ్మా ప్రకృతిని చూస్తే నీకు కవిత్వం వస్తోందే!".

"అలా నవ్వకురా అబ్బాయి! ఈ వినాయక చవితికి మా ఊళ్ళో నవరాత్రి పూజలు పురాణ ప్రవచనాలు ఉండేవిరా "కులాలు, వర్గాలు లేకుండా అనాదిగా ప్రతి ఇంట్లో చేసుకునే గొప్ప పండగరా ఇది" అంది భానుమతమ్మ ముఖంలో వెలుగులు నింపుకుంటూ...

"గొప్పపండగ, గొప్పపండగ అంటావు ఈ పండగకి ఉన్న గొప్పతనమేమిటమ్మా?"

"అదే చెప్తావినూ కిరణ్ నువ్వు అమెరికా వెళ్ళేవరకూ హైద్రాబాదులో ఉన్నంత కాలం పూజచేసేవాడివిరా అయితే నగరంలో పండగ పూజలు చేస్తే అదేదో మొక్కుబడి వ్యవహారంగా ఉండేది. కానీ పల్లెల్లో అదొక శాస్త్రీయమైన పండగ, శ్రామికుల పండగరా. నువ్వు వ్యవసాయ విద్యలో పరిశోధనలు చేసి సంకరవిత్తనాల తయారీకై తహతహపడుతున్నావు గానీ అంతకంటే పంటలు

పండడానికి ప్రాథమికమైన విషయాలు ఈ పండగపనులలో ఉన్నాయని నీకెలా అర్థం అవుతుందీ? విత్తనాలు నాటాలంటే భూమి ఆధారం కదా. దానికి నీళ్ళు జీవం. ఈ రెండు ఉంటేనే విత్తనాలకు పోషకాహారం అంది, పైరు పెరిగి పంట చేతికి వస్తుందిరా..." ఆమె మాటలకు అడ్డు వచ్చి కిరణ్ "అమ్మా నువ్వు చెప్పే విషయాలలో కొత్త ఏముందమ్మా' అన్నాడు. 'ఆ(.. అలా అనకు పూర్తిగా విను. సాగునీటికి తాగునీటికి కరువులేకుండా చేసే పండుగా ఈ వినాయకుడి పండుగరా. వినాయకుడి పూజలో ఒక శాస్త్రీయభావం ఉంటుందిరా! "ఏంటమ్మా ఈ కంప్యూటర్ యుగంలో కూడా గజాననుడి పూజ చేయటం అంతా ఒక ఫార్సులా ఉంటుంది".

"కిరణ్ నీకు మౌళిక విషయాలలో అవగాహన తక్కువరా. ఇలా అన్నానని కోపం తెచ్చుకోకు. ఇందాకే చెప్పాకదా! నువ్వు తయారు చేసే విత్తనాలు పండటానికి నీళ్ళు పుష్కలంగా ఉండాలి కదా! నీటిఎద్దడి ఎక్కువవుతుంటే, చెరువులలో పూడిక తీయాలని ప్రభుత్వాలు సంకల్పిస్తున్నాయికానీ వినాయక చవితి పండగలోని తత్వాన్ని గుర్తించడం లేదురా".....

భానుమతమ్మ మాటలకు "తత్వమా" అంటూ అర్థం కానట్టు ముఖం పెట్టాడు కిరణ్ తల్లీకొడుకుల మాటలను ఏదో కలలో వింటున్నాట్టుగా వింటున్నాడు సుబ్బన్న.

"కిరణ్, నీకు తెలుసుకదా ఈ పండగలో ప్రధాన విషయం ప్రతి ఇంట్లో మట్టితో చేసిన వినాయకుడ్ని పెట్టి పూజచేయడం, దాని కోసం గ్రామంలోని చెరువుల్లో జిగటగా పేరుకున్న బంకమట్టిని తీసి వినాయకుడి బొమ్మ చేస్తారు. ఎన్నో వంపులతో తయారు చెయ్యాలి కదా వినాయకుడి బొమ్మని, దానికి అనువుగా ఉండేది ఆ చెరువులోని జిగట మట్టియే కదా! వేసవి కాలంలో ఎండిన చెరువు శ్రావణమాస వర్షాలకు మెత్తపడుతుంది. పైన పేరిన ఆ జిగట మట్టితోనే వినాయకుడి బొమ్మలను తయారుచేస్తారు. చెరువులో నీళ్ళు నిల్వ ఉన్న మేర పైన జిగటగా ఏర్పడుతుంది. పేరుకున్న, ఆ జిగట మట్టి ఉంటే వర్షపు నీటిని భూమి కుంభించుకోదు. పేరుకున్న జిగటను పైకితీస్తేగానీ నీరు భూమిలోకి ఇంకదు. అందరూ తలో చెయ్యి వేసి దేవుడి పేరుతో ఆ జిగటను పైకి తీసే కార్యక్రమం ఈ పండగలో ఉంది. దేవుడి పూజ చేద్దాం అంటేనే అందరూ తలా ఒకచెయ్యి వేసి ఆ జిగటను పైకి తీయటంలో

భాగస్వామ్యులవుతారు. లేకపోతే ఎవరికివారే తమ కెందుకులే అని ఊరుకుంటారు. ఆరకంగా వర్షపు నీటిని బాగా పీల్చుకున్న చెరువుల్లో నీళ్ళు తాగటానికి వేసవి కాలం వరకు సరిపోతాయిరా! చెరువుగట్టు మీద ఉన్న పొలలకు సాగునీరు అందుతుంది ఆ రకంగా మన వాళ్ళు శాస్త్రీయంగా నీటి ఎద్దడిని తీర్చుకునే పద్ధతే ఈ వినాయకుడి పండగలో ఉందిరా కిరణ్" అంది భానుమతి నిండైన తృప్తిని అనుభవిస్తూ...

వింటున్న రవి "అమ్మగారు మీరు చెప్పింది అక్షరాలా నిజం. కానీ హైద్రాబాద్‌లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రంగురంగుల వినాయకుడి విగ్రహాలు తయారు చేసి హుసేన్ సాగర్‌లో నిమజ్జనంచేస్తుంటే కాలుష్యం పెరిగిపోతోందని నిపుణులు గోల పెడుతున్నారమ్మా! చదువుకున్న వాళ్ళయినాకూడా ఈ నగర ప్రజలకు మీరుచెప్పిన సూక్ష్మం తెలీక ఎత్తు, ఎత్తు విగ్రహాలు పెట్టడంలో పోటీ పడుతున్నారు". అన్నాడు. తన బుర్రకేదో జ్ఞానోదయం కలిగినట్టుగా...

తల్లి మాటల్లో శాస్త్రీయత పూర్తిగా బోధపడని కిరణ్ పత్రితో పూజ చేయటం వెనుక ఏమన్నా అర్థం ఉన్నదామ్మా?'

"అదేరా! వినాయకుడికి గరిక పూజ యిష్టం అని వినే వుంటవుగా చెరువులో అడ్డంగా పెరిగిన గడ్డీ, రేగి వంటి కలుపు మొక్కలను పీకటం వంటివి చేస్తారు." చెరువులోని నీటిని విషపూరితం చేసే బుడగతామర, జిల్లేడు వంటి మొక్కలను పీకేస్తేనే చెరువు నీళ్ళు శుభ్రపడి తాగడానికి వీలుగా ఉంటాయి. పూజకు వాడాలంటేనే ఆ ఊరి గ్రామస్థులు అంతకలసి చెరువుల్లో నుండి వాటిని పీక్కొచ్చి మరీ పూజ చేస్తారుగా! అంతే గాదురా ఆ ఆకులతో నట్టింట్లో తొమ్మింది రోజులు వినాయకుణ్ణి పూజ చేస్తే వానలకు యింట్లో ఏర్పడే క్రిములు కూడా నాశనం అవుతాయి." అంది భానుమతమ్మ ఎంతో నిండుగా.

"అయితే అమ్మా! ఆ మట్టి వినాయకుణ్ణి నవరాత్రిళ్ళ తర్వాత తిరిగి మళ్ళీ చెరువులోనే నిమజ్జనం చేస్తారెందుకు? అన్నాడు కిరణ్ ఇంకా ఏదో తనకు తెలియాల్సిన విషయం ఉన్నట్టు " ఆ మట్టి విగ్రహానికి తొమ్మిది రోజులు పూజచేస్తూ బయట పెట్టే సరికి ఆమట్టి ఎండి అందులోని జిగట పూర్తిగా పోతుంది. మళ్ళీ దాన్ని చెరువులో వేస్తే వర్షపు నీరును బాగా పీల్చుకుంటుంది. వానాకాలంలో చెరువులో మట్టి ఎంత బాగా నీళ్ళు పీల్చుకుంటే అంతగా వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉండదు. చెరువు గట్టున ఉన్న పొలాలు రెండో పంటకు

బాగా అందిస్తాయి.” అంటున్న భానుమతమ్మ మాటలను స్వయంగా దైవం చెబుతున్నట్టుగా మనసులో భావించాడు సుబ్బన్న.

“అవునమ్మగారూ! ఈ మధ్య భూగర్భ శాస్త్రవేత్తలు వచ్చి మన ఊరి చెరువులో పూడిక తీయటానికి ఒక యంత్రాన్ని తెచ్చారు.”

“ఆ(.. సాంకేతికత సౌకర్యాలను పెంచుతోంది. కాని ఆయంత్రాన్ని తయారుచేయటానికి ఒక ప్రక్కనుండి అనేకరకాలుగా కాలుష్యాన్ని పెంచుతున్నాం కదా” అన్నాడు రవి తనకు తెలిసిన కాస్త పరిజ్ఞానంతో.

“నువ్వు చెప్పింది నిజమే రవీ ‘అంటూ వత్తాసు పలికాడు కిరణ్.

“అందుకే కదా యంత్రాలను వాడటం అనేది భౌతిక సంస్కృతి. కానీ వినాయకుడి పేరుతో చెరువుల్లో పైన పేరుకున్న జిగటను పూడిక పేరుతో గాక పూజ పేరుతో చేస్తే ఆత్మిక సంస్కృతి అభివృద్ధి చెందుతుంది...” అంది భానుమతమ్మ.

“అవునమ్మా! అందుకే జాతీయోద్యమ సమయంలో గణేష్ జయంతి భారతీయులందరినీ ఒక్క తాటి పై నడిపించగలిగింది అన్నాడు” కిరణ్.

“బాగా చెప్పావురా!” అంది భానుమతమ్మ.

కిరణ్ తల్లివంక గర్వంగా చూస్తూ “అమ్మా! నీది పాతకాలంనాటి పెంపకం అనుకున్నాగానీ ఇంత శాస్త్రీయ పరిజ్ఞానం నీకు ఉందని యిప్పుడే తెలిసిందమ్మా. వినాయకచవితిపూజను భక్తిశ్రద్ధలతో చేస్తే బుద్ధి ప్రేరితమై సిద్ధి కలుగుతుందంటే యిదే అనుకుంటా” అంటూ మళ్ళీ బెరుకుగా “అమ్మా అంత బొజ్జ గణపతికి బుజ్జి ఎలుక వాహనం ఏంటమ్మా?” హాస్యంగా అనిపించదూ....”

“కాస్త ఆలోచిస్తే దానిలోనూ అంతరార్థం వుందిరా కిరణ్! చెరువుల్లో కప్పలుంటాయి కదా. ఆ కప్పలు చెరువు ఒడ్డునున్న పొలాల్లోని పురుగుల్ని తినటానికి వస్తాయి. ఆ కప్పలను తింటానికి ఎలుకలు వస్తాయిరా... ఇలా ఒకదానికొకటి ఆహారం అవుతూ ఉంటుంది. అలా పండిన పంటను చేతిలో ముద్దగా చేసుకు తినటంగా కనపడటమే వినాయకుడి బొమ్మలో ఉన్న పరమార్థంరా. ఆ ఎలుకలు ఎక్కువైతే పాములు రావటం సహజం. అందుకే గజాననుడి భుజం మీదే జందెంరూపంలో పాము వేళ్ళాడుతుంది. చేతులకు చెరుకుగడ పంటలకు సంకేతం అలా ఆ బొజ్జవినాయకుడి విగ్రహంలో పంటలు

పండే పరిణామక్రమం అంతా కనపడుతుంది. అందుకే మనది అన్నదాతల సంస్కృతిరా" అని ముగించింది. భానుమతి ఇంకేమీ చెప్పటానికి లేనట్టు.

"కరెక్ట్ గా చెప్పావమ్మా అందుకే వేదకాలానికిముందే చెరువుగట్లన ఉండే పొలాల్ని కాపాడేగణాలకు కాపుగాఉన్న ఒకడ్ని నాయకుడిగా చేసి "గణపతి" అంటూ ఆరాధించేవారట. ఈ పండగ ప్రకృతి వనరుల్ని పెంచటమే కాదు మానవ సంబంధాలను కూడా పెంచి ఆత్మీయతను పంచుకునే పండగ అనికూడా అర్థం అవుతోందమ్మా" అన్నాడు కిరణ్.

వాళ్ళ మాటలను వింటున్న సుబ్బన్నకు తనలో ఏదో కొత్త శక్తి పుంజుకుంటోందనిపించింది. వాన తగ్గి తుంపరలు పడుతున్నాయి.

రోడ్డు ప్రక్కన పచ్చని పొలాలను దాటి ఊళ్ళోకి చేరుకున్న విషయం గమనించలేదు ఆ ముగ్గురూ... ఊరి పొలిమేరల్లోనే "వినాయకుడు మట్టి వినయకుడు మట్టి...." అంటూ తట్టలతో బిలాబిలా పిల్లలు వచ్చి కారుకు అడ్డం వచ్చారు. రవి కారును స్లోచేసాడు. కిరణ్ మట్టి బొమ్మలను చూస్తూ ఎంతోమహిమగలవి ఈ మట్టి బొమ్మలు అని అనుకున్నాడు మనసులో. కారు ఊరిమధ్యలోకి చేరుకునేసరికి రంగురంగుల్లో ప్లాస్టర్ఆఫ్ పారిస్తో చేసిన పెద్ద వినాయకుడి విగ్రహం కనపడింది. కిరణ్ కి ఆ విగ్రహంలో ప్రపంచం అంతా పోటీ పడుతూ కాలుష్యానికి కారణమవుతున్న అగ్రనాయకుల దృశ్యం గోచరించింది. నగరీకరణ పల్లెల్లోకి ఎలా చొచ్చుకు వచ్చిందో స్పష్టమై మట్టివినాయకుడితో "దాన్ని ఎలాగైనా అడ్డుకోవాలి" అనుకున్నాడు మనుసులో. వినాయకుడిని మట్టితో చేసి పల్లకిలో ఊరేగించాలి అంటూ ఏదో అస్పష్టంగా తనలో తాను అనుకుంటూ తాతయ్య ఇంటిగుమ్మంముందు కాలుపెట్టాడు. అప్పుడే గడపబయటకు వచ్చిన మేనమామ కూతురు మేఘన మట్టివినాయకుడ్ని కొన్నది ఎదురుగా వున్న రోడ్లకూడలిలో అంతెత్తున పెట్టిన వినాయకుడు ముఖం వంచి జాలిగా భక్తజనాన్ని చూస్తుంటే మేఘన చేతిలోని మట్టివినాయకుడి మోములోని చిరుదరహాసం శాస్వితవిజయం నాదేఅన్నట్లు చూస్తోంది.

దిః24-08-2008.

నాటకాలు

ఈవూరికి ఆవూరితో...

(ముందుగదిలో చెప్పులు తొడుక్కుంటున్న వసంతకు లోపలనుండి వినిపిస్తూ వుంటుంది.)

తల్లి : వసంతా! ఓ వసంతా! ఇవ్వాళ ఆఫీసు నుంచి కాస్తంత తొందరగా వచేసావ్‌కదూ!

వసంత : ఆ, ఆ, వచ్చేస్తాను. ఏమిటమ్మా! ఏమన్నా పని వుందా ?

తల్లి : హూఁ. మర్చిపోయావన్న1మాట. మొన్ననే చెప్పాను కదే. ఈవేళ సాయంత్రం నరసాపురం నుంచి పెళ్లివారు వస్తున్నారని- ఏదో ఒకటి అన్నా ముడిపడితే, ఈ జన్మకి కష్టాలు గట్టెక్కినట్టే.

వసంత : అదేమిటమ్మా-అలాబాధపడతావ్. ఇప్పుడు పెళ్లికాకపోతే మాత్రం ఏమవుతుంది? ఎప్పుడో ఒకప్పుడు కాకపోదులే: కాదూ, నా కాళ్ల మీద నేను నిలబడ్డాకదా-నన్ను నేను పోషించకోగలను.

తల్లి : సరేలే "గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట". ఎంత ఉద్యోగం చేస్తున్నా ఆడపిల్ల ఆడపిల్లేకదా-పుస్తె కట్టించుకుని మొగుడి దగ్గర ఉంటేనే మంచీ, మర్యాదా.....

వసంత : మంచీ, మర్యాదా ఎవరు కాదన్నారమ్మా-(ధోరణి మారుస్తూ) ఊఁ, వచ్చే వాళ్లకు వీలయిందనేగదా నన్ను వీలు చూసుకుని రమ్మన్నావ్-కానీ, నా స్నేహితురాలు ఉష ఒక్కసారి రమ్మందీ. ఇవ్వాళ సాయంత్రం కలుస్తానని కబురుచేశా.....సరేలే, ఉష దగ్గరకు వెళ్లి, తొందరగా వచ్చేస్తాలే.

తల్లి : ఏంస్నేహితులో, ఏంముచ్చట్లో-"అయ్యగారొచ్చేదాకా అమావాస్య ఆగదు" నువ్వు తీరుబడిగా వస్తే వాళ్లుండొద్దూ - నిన్ను చూసుకున్నాక అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చని ఆ మగ పెళ్లి వారికి కబురంపాను.

వసంత : పెళ్లి..... పెళ్లివారు అంటూ పెళ్లికోసం ఆరాటందేనికిమ్మా-సరేలే - తొందరగా రావడానికి ప్రయత్నిస్తా. ఈలోగా నువ్వు వాళ్లతో మాట్లాడు.

తల్లి : వాళ్లొచ్చేసరికి నువ్వు లేకపోతే ఏమనుకుంటారు? ఈ సంబంధం కుదిరేనా అని...

వసంత : ఎందుకు కుదరదు? నేను లేకపోయినా కుదురుతుంది. వాళ్లకు కావలసిందీ, మనం యిచ్చేదీ–కట్నం. ఏభైవేలు కావాలన్నారని మధ్యవర్తి మన చెవిలో ఊదివెళ్లేడు. నువ్వూ, వాళ్లూ ఏంమాట్లాడుకుంటారో నాకు తెలియదు. నేనుమాత్రం గట్టిగా చెబుతున్నాను. కట్నం తీసుకునే అబ్బాయిని నేనుమాత్రం చేసుకోను.

తల్లి : ఆఁ వూరంతా ఒకదారి, ఉలిపికట్టెదొకదారనీ– మనం ఒకళ్లమే యిస్తున్నామా కట్నం. అందరూ కట్నాలు యిస్తున్నారు, పెళ్లిళ్లు చేసుకుని కాపురాలు చేసుకుంటున్నారు చక్కగా–

వసంత : ఆ! ఆ! ఎంత చక్కగానో చేస్తున్నారూ చూస్తున్నాం– సరేలే నాకు ఆఫీసుకు టైమవుతోంది, నే వెళ్లొస్తా. కట్నం తీసుకోని అబ్బాయి అయితేనే అతనితో మాట్లాడి, నాకు నచ్చితే పెళ్లి చేసుకుంటా.

తల్లి : ఇదెక్కడి చోద్యమే తల్లీ, ఎవరన్నా యీ మాటలు వింటే నవ్విపోతారు. ఇక నీకీజన్మకూ......

వసంత : "పెళ్లి కాదు" అంటావ్. అంతేనా, నే వెళ్లొస్తా, తలుపేసుకో–

వసంత : హలో ఉషా– ఏమిటీ, నాకోసమే ఎదురు చూస్తున్నావా ?

ఉష : అవునే, నీకోసమే చూస్తున్నా. మనసు విప్పి, ఆత్మీయంగా మాట్లాడుకోవటానికి నువ్వు తప్ప నాకెవరున్నారు?

వసంత : హాయిగా కబుర్లు చెప్పుకుందామంటే, అమ్మ తొందరగా వచ్చేయమని హుకుం జారీ చేసింది. తనకోసమేమీ కాదులే, నన్ను చూసుకోవడానికి వచ్చే వాళ్లకోసం.

ఉష : ఎవరమ్మా ఆ పెళ్లివారు. పెళ్లికొడుకు ఏం చేస్తున్నాడు? ఎలా వుంటాడూ, అతనితో మాట్లాడేవా, మీ అభిప్రాయాలు ఒకరివి ఒకరికి కలిశాయా ?

వసంత : తల్లీ– ఆకొశ్చనైర్ ఆపేయ్.మనం అంతముందున్నామా? మా అమ్మసంగతి నీకు తెలుసుగా– అవన్నీ సరేగానీ, ఏమిటో మాట్లాడాలని కబురు చేశావ్. ముఖ్యమైన విషయమా ?

ఉష : విషయంలో కొత్తదనమేమీ లేదు, ఎప్పుడూ ఉండే పురాణమే. మనసు బాగుండక కాసేపునీతో మాట్లాడాలనిపించింది. ఉండు, కాఫీ తెస్తాను.

వసంత : వద్దులే ఉషా ఇప్పుడే ఆఫీసులో తీసుకుని వస్తున్నా. అసలు సంగతేమిటోచెప్పు.

ఉష : హాఁ ఏంచెప్పను నీలాగ నేనుకూడా ఉద్యోగం చేసుకుంటే బాగుండేది. ఈ కష్టాలు ఉండేవి కావునాకు.

వసంత : ఇప్పుడొచ్చిన కష్టమేమిటో ?

ఉష : కట్న పిశాచి తన కబంధహస్తాన్ని విసురుతోంది. ఈ పిశాచి పెళ్లికావలసిన యువతులనూ, పెళ్లయిన వారినీ బలిగొంటూనే ఉంటుంది. నిన్నటికి నిన్న ఏంజరిగిందంటే.... ....

అత్తగారు : ఉషా... ఓ ఉషమ్మతల్లీ... ఎక్కడున్నావ్ మహారాణీ! ఒకసారి పిలిస్తే పలుకుతావా? పేద్ద దొరసానమ్మవు గదా-పుట్టింటి నుండి మూటలకు మూటలు కట్టుకొచ్చావు గదా... ముష్టి ముప్ఫైవేలు.. అదీ మూడు వాయిదాల్లో.. హవ్వ.. అత్తగారన్న తర్వాత ఒక అచ్చటా ముచ్చటా ఉందా... పండుగా పబ్బమా ఉన్నాయా? అన్నీ ఎండమావులు. అల్లుడికి ఒక స్కూటరైనా కొనిచ్చారూ... పాపం వెర్రినాగన్న, అర్భకుడు ... కష్టపడి ఆఫీసుకు నడిచివెళ్లొస్తున్నాడు.

ఉష : అత్తయ్యా ! పిలిచారూ, పనిఏమైనా వుందా ?

అత్త : ఆఁ పనికూడానా... తెస్తున్నాడుగా మావాడు సంపాదించి, హాయిగా తిని కూర్చోవటమే నీపని. ముష్టి బతుకులూ, ముదనష్టపు బతుకులూ; ఆడపిల్లకు పట్టెడన్న పెట్టలేక, పెళ్లి చేసేసి, యిక్కడకు నెట్టిపడేశారు.

ఉష : అత్తయ్యా - అన్ని మాటలెందుకు ? ఇప్పుడు నా పుట్టింటివారి సంగతులెందుకు ?

అత్త : అవునవును, కూతురు గురించి, కూతురి కాపురం గురించి పట్టించుకోరు. ఎన్ని మాటలన్నా దున్నపోతు మీద వర్షం కురిసినట్లే- చీమకుట్టినట్టైనా వుండదు. ఏం కావాలో చూడరు. ఇదుగో నిన్నే...

నేలచూపులు చూసస్తా, రాయిలా, మొద్దులా వుంటే సరిపోతుందనుకుంటున్నావేమో... ఈ సారి పండక్కైనా అల్లుడి మొహాన్న ఓ స్కూటరు పడేయమని మీ నాన్నకు రాసి పడేయ్... ఇదిగో కుదరదని బీద అరుపులు మొదలెడ్తాడేమోనాన్న, అలాగవుతే... ఇక నీకు నీ పుట్టిల్లే దిక్కు. వాడికి మళ్లీ పెళ్లి చేస్తా. ఈసారన్నా, కాస్త బుద్ధిగా మసలుకొని, కోరినవన్నీ పెళ్లికి ముందుగానే యిచ్చుకునే ఉద్యోగం వున్న పిల్లను చూసుకుంటాం. ఉద్యోగం వున్న పిల్లయితే బంగారు గుడ్డు పెట్టే బాతు. మా పిచ్చి సన్నాసి ఎప్పుడు సుఖపడతాడో..ఏమో... ఇదుగో... నాధోరణి నాదేనా ? కాస్త బుర్రకెక్కిచుకునేదేమన్నా వుందా...? ఓ ఇనప గజ్జెల తల్లీ... వినబడుతోందా....

ఉష : అపుడే (వర్తమానంలోకి వస్తున్న సంకేతంగా..) ఆ వూరికి యీ వూరెంతో ప్చ్........

ఉష : ఆయన అడకత్తెరలో పోకలాగ అవుతున్నారు. ఉత్తి మెతక మనిషి. ఆ మెతకతనమే మా అత్తగార్కి advantage. తల్లి మాటకు ఎదురాడరు. మా నాన్న మాత్రం ఎంతకాలమని వీళ్లకు చేయగలరు. నా పెళ్లికి అయిన అప్పు యింకా తీరలేదు. ఒక వైపు చెల్లెళ్ళు ఎదిగివస్తున్నారు పెళ్లికి.... ఈ బాధలు అనుభవించలేక చచ్చిపోదామనిపిస్తుంది ఒక్కోసారి.

వసంత : అంతమాట అనకు. చచ్చి సాధించేదేముంది. చేతులారా మన బ్రతుకుల్ని నాశనం చేసుకుంటామా? నువ్వు చదువుకున్నావ్‌గదా- ఏదో ఒక ఉద్యోగం చూసుకో... ధైర్యంగా నీకాళ్లమీద నువ్వు నిలబడు.

ఉష : ఇప్పుడు ఏం వస్తుందే ఉద్యోగం ?

వసంత : ఏదో ఒక ఉద్యోగం... నిన్ను నిన్నుగా బ్రతికించేదీ, నీలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేదీ ఏదో ఒక ఉద్యోగం- ఉద్యోగం చేసుకుంటున్నామన్నమాటేగానీ, కట్నం లేకుండా ఎవరూచేసుకోవటంలేదు. పెళ్లి అంటే మగపిల్లవాడి తరఫువారి దృష్టిలో 'కట్నం' అదే ముఖ్యం గానీ, మానవత్వపు విలువలు,

వ్యక్తిత్వాలు ఏమీ కావు. పెళ్లి తరువాత కూడా ప్రేమలు చోటుచేసుకోవటం లేదు. ఇంకా ఏదో కొరత కనిపిస్తూనే వుంటుంది. ఆడపిల్ల యింకా ఏదో ఋణపడివున్నదనే దృష్టితోనే వుంటారు. అయినా కట్నం తీసుకునే వారినే అనటమెందుకు ? ఇచ్చేవారిని కూడా అనాలి. 'మన అమ్మాయికి ఏమి తక్కువ? చదువుకున్నది, ఉద్యోగం చేస్తోందీ' అని కూడా అనుకోరు.

ఉష : మొగపిల్లవాడు ఆడపిల్లకంటే ఎక్కువ అనే కదా అందరూ అనుకునేది. అందుకే ఈ కట్నం పెద్ద సమస్య అయికూర్చుంది.

వసంత : ఆడపిల్లలకు తెలివి తేటలు లేవా, పని పాటల్లో చాకచక్యం తక్కువనా – ఇందులో మగవారి అభిజాత్యం.

ఉష : ఈ కట్నం సమస్య నేటిది కాదుగదా.

వసంత : అదే నేనూ అంటున్నాను. ఇలానే ఇస్తూ పోతూ వుంటే ఈ సమస్య ఈ యుగమంతా వుంటుంది. ఆడపిల్లతక్కువ, వంశోద్ధారకుడెక్కువ అంటూ భేదం పాటిస్తారు. ఆడపిల్లను ఎవరో ఒక అయ్య చేతిలో పెడితే, ఆ మహానుభావుడు "ఆలికి అన్నం పెట్టటం వూరికి ఉపకారం" అన్నట్టుగా పెద్ద ఫోజు వేస్తాడు. అందుకే నేనీ నిశ్చయానికి వచ్చాను. నాకూ చదువు వుంది, నాకూ వుద్యోగముంది. నేనెందుకు కట్నమివ్వాలి? కట్నం తీసుకునే వాడిని ససేమిరా పెళ్లిచేసుకోను. మనలో ఎక్కువ తక్కువ లేమిటి ? అందరమూ మనుషులమే. ఒక సంఘంలో మెలిగేవాళ్లము. వివాహ వ్యవస్థలో అంతా సమాన భాగస్వాములమే. కనీసమైన యీ దృష్టిలేకుండా, కట్నం కోసం పెళ్లి చేసుకునే అజ్ఞానుల్ని పెళ్లి చేసుకునేకంటే, పెళ్లి మానుకోవటం మంచిదనుకుంటున్నాను.

ఉష : నిజమేనా వసంతా! కట్నమిచ్చి పెళ్లిచేసుకుని, కష్టాలు కొనితెచ్చుకోవటంమౌతోంది. ఇది నిత్యం జరుగుతూఉన్నా, ఎప్పటికప్పుడు పరగడుపు అవుతోంది.

వసంత : ఆడా, మగా ఇద్దరూ సమానమే. ఈపూరికి ఆవూరెంత దూరమో, ఆవూరికి ఈవూరు అంత దూరమే కదా! ఈవిషయం అమ్మాయిలంతా గట్టిగా అనుకోవాలి. కట్నం తీసుకునే వాళ్లను

పెళ్లిచేసుకోమని ధైర్యంగా ప్రకటించాలి. భీష్మించుకుని కూర్చోవాలి. పెళ్లి కాకపోయినా ఉద్యోగం చేసుకుని బ్రతికే ధైర్యం రావాలి. అప్పుడే ఆవూరి గాలి ఈవూరికి తుఫాను కాకుండా వుంటుంది. ఇంకో గమ్మత్తు తెలుసా?

ఉషా : గమ్మత్తా! ఏమిటది ?

వసంత : 'కట్నం తీసుకునే పక్షంలో, నేను పెళ్లి చేసుకోబోను' అనే నా అభిప్రాయాన్ని, ఇవ్వాళ రాబోయే వాళ్లకు రాసిపడేశాను. వాళ్ళు రానేరారు. పాపం! వాళ్లు వస్తున్నారన్న ఆశతో ఎదురు చూస్తూ వుంటుంది.

ఉష : స్టాప్ స్టాప్ ప్లీజ్ పెళ్లి వారిదేవూరు ?

వసంత : నరసాపురం. అక్కడ స్కూల్లో మాస్టారు రామారావు గారి అబ్బాయట.

ఉష : (నవ్వుతుంటుంది)

వసంత : ఎందుకలా నవ్వుతావ్ ?

ఉష : నీవూమ తప్పు.

వసంత : అంటే !

ఉష : ఆ రామారావు గారు మా బాబాయి. అంటే పెళ్లికొడుకు నాకు తమ్ముడవుతాడు. నీ అభిప్రాయాలు వాడికి సెంట్ పర్సెంట్ నచ్చాయి. పెద్దవాళ్లను ఒప్పించి, ఇవేళ వస్తున్నట్లు ఉత్తరం రాశాడు. కట్నం లేకుండా నిన్ను చేసుకోబోతున్నాడు. నీలాగే వాడూ ఆలోచిస్తాంటాడు. ఈవూరికి ఆవూరెంతో, ఆవూరికి ఈవూరంతేకదా! ఇక, ఆనందంగా ఇంటికి బయల్దేరివెళ్లు- మరదలుపిల్లా......

(2002)

చీకటి కడుపున కాంతి

(అపుడే సైరన్ కూస్తుంది. చొక్కాకు బొత్తాలు పెట్టుకుంటూ హడావుడిపడుతూ అటూయిటూ తిరుగుతూ ఉన్నాడు)

కొమరయ్య : ఓరమ్మో అపుడే డూటీకి టయాం అయింది. జల్దీ డూటీ కెల్లాలా. ఓసే రాములమ్మో! టిఫెన్ కారియర్ కట్టినావా? గట్ల సైంక కూసిందిగూడా ఓ రాములమ్మో తొందరగా తేయే.

రాములమ్మ : (ప్రవేశిస్తూ) ఆ వత్తున్నా ఇదో అయిపోయిందయ్యా పప్పుసారు కాస్తంత కాగాలా అని జూస్తున్నా.

కొమరయ్య : ఇంకా ఎంతసేపేమి అయినా పొద్దుకాడ నుండి చూస్తున్నా ఆ పని ఈ పని యంటూ తెగ తిరుగుతావు ఇంకా వంట కాలేదూ.

రాములమ్మ : అయిపోతున్నది అయిపోతున్నాది. ఒక్కక్ష (చ)ణం చంటోడు నన్ను వదలట్లా బాగా ఎడిపిత్తున్నాడు. కొద్దిగా అలచ్చుమయింది. ఇంగో యిప్పుడే తెచ్చిస్తా (అంటూ లోపలికి పోతుంది).

కొమరయ్య : ఛత్ దీని సిగతరగయ్యా! పొద్దత్తమానం ఏం చేత్తుందో తెలీదు. ఇంటకాడ ఇంత ఉడకేసి తిని కూకోటమేగా దీనిపని. ఒసేయ్! నాకు మస్టరేసే టయం అయింది. నేనుబోయి బాయికాడ మస్టరేయించు కుంటూ ఉంటా. ఈలోగా పిల్లగాడికిచ్చి బాయికాడికి కారీరు పంపించు.

రాములమ్మ : (లోపల్నించివస్తు) అదేంది ఒక్క నిముసం ఆగమంటే ఆగవు. నాకేమన్నా పది చేతులున్నాయాయేమి! పెద్దాడు టూషనకి వెల్లినాడు గట్ల, కారీరు ఎట్లా పంపించాలా.

కొమరయ్య : ఏందే పొద్దునే గోల పెడ్తుండవు.

రాములమ్మ : ఊ నీకు గోలగానే ఉంటుందిలే. చంటాడికి నిన్న పొద్దుటాల నుండి ఒకటే జరం. మాపటేలకి ఎక్కువయింది. రేతిరంతా జాగరమే. వాడు పండడు; నన్ను పండనీయడలేదు. తెల్లారి

కాడనుండి వాడ్ని చంకలో వేసుకునే పని చేస్తున్నా. ఇపుడే కాస్త బిడ్డ పండుకున్నాడు. ఇదేం నీకు పట్టదయ్యా నువు హాయిగా నిద్దరోతివి. నేను ఒక చేత్తో వాడ్ని చూసుకోవాలా, ఇంకోచేత్తో బొగ్గు కొట్టాలా, మల్లి పొయ్యి రాజెయ్యాలా, ఇప్పటికీ అంటుకున్నాది. పంపుకాడ వెల్లి నీళ్లు మోసేసరికి ఆలస్యమయింది. ఇవేమో నీకు పట్టవు. ఊరికే అరుస్తావూ.

కొమరయ్య : అదేందది పిల్లగాడికి జరమొస్తే కంపెనీ హస్పటాల్‌కి తీసుకుపోలేదా? ఇదిగో నిన్ననంగా జొరమొస్తే ఏమి చేసినావే. వాడికి ఏమన్నా అయిందా నీ సంగతి చూస్తా. బిడ్డల్ని సరిగ్గా చూసుకోవటం రాదే. ఛీఛీ గొడ్డుమొతుదానా. ఏం తల్లియో ఏమో! పోయి తొందరగా కారీరు తీసుకురా.

రాములమ్మ : ఇదిగో తెత్తున్నాగానీ ఎందుకో పొద్దునే సారక్క మనింటికి వస్తోంది కాస్తంచూడు. (అంటూ లోపలికి వెడుతుంది.)

సారక్క : ఏందన్న అంతా క్షే (చే)మలేనా. పంపుకాడ కెళ్తుంటే పొదు పొద్దునే ఇంట్లో మాటలు గలాటాగా వినబడుతుంటే బిడ్డడేకేమందో అని చూసిపోదామని వచ్చా.

కొమరయ్య : సారక్కా సమయానికి వచ్చావు. చూడు నిన్నంగా పిల్లవాడికి జొరంవస్తే ఇంతవరకూ దవాఖానాకు తీసికొని పోలేదట. నాకేమో దూటీకి టయాం అయింఅది. నేవెడుతున్నా కాత్తా పిల్లగాడిని చూడు సారక్కా.

రావులమ్మ : (ఇంతలో టిఫిన్ కారీరు తెచ్చి కొమరయ్యకు యిస్తుంది.)

సారక్క: ఏంది రావులమ్మా పిల్లగాడికి జొరం ఎక్కువైందా? ఏమన్నా అజీర్ణం చేసిందేమో పప్పుదిన్నులు లన్నీ కల్తీయేగా. భయం పడమోకు పిల్లగాడ్ని దవాఖానాకి తీసికెడుదాంరా పిల్లగాడికి పాలుగాని యెవన్నా పట్టినావా. (అంటు దుప్పటి తీసి పిల్లగాడ్ని చూసివస్తుంది).

రావులమ్మా : లేదక్కా రేతిరినుండి పాలుకూడా తాగటం లేదు. ఒకటే విసిగిస్తున్నాడు. తెల్లవార్లు ఏడిపిస్తనే ఉన్నాడు. ఇందాకనే

కాస్తంత జరం తగ్గింది. ఇప్పుడే కాస్త పండుకున్నాడు. రేతిరి నిద్రలేక నాకు తూలుగుణొంది. వంట చేసేసరికి కాస్తంత ఆలస్యమయినందుకు ఇంటాయిన అరుస్తుండు నువ్వు వచ్చేసరికి విన్నావుగా.

సారక్క : అదేనా నేను ఒచ్చేసరికి అరుస్తుండడు ఏం ఆయన హాస్పటాల్‌కి తీసికెళ్లకూడాదా, వాళ్లకీ బాధ్యత లేనట్టు నీమీద కేకలేత్తుండు.

రాములమ్మ : ఆ నేనెదో ఉరికే తిని ఖాళీగా కూకుంటునట్లు అనుకుంటాడు అక్కా! పెద్దపిల్లగాడ్ని లేపి కాస్తంత టిపెన్ పెట్టి టూషనకాడికి పంపిచాలా. వాడన్నా మంచిగా సదవుకోవాలనుందక్కా. నా కెట్టూ మా అయ్య సదువు చెప్పించలే? వాళ్లయ్యకి బాధ్యత లేనట్టు ఉంటాడాయె. వాడన్నా పెద్ద చదువు సదివి కంపెనీలో ఆఫీచరు అవ్వాలని ఉంది. వంట గంట ఆలస్యమయిందని పెనిమిటి ఒకటే తిట్టుడాయె, టిఫిన్‌కట్టు అంటూ ఒకటే రంకెలేస్తుండు.

సారక్క : పోన్లే రావులమ్మా పట్టించుకోకు.

రావులమ్మ : నాకు మాత్రం ఎన్ని సేతులున్నాయట రోజూ పొద్దున లేచిన నాడనుండి మిచన్‌లాగా పనిచేస్తూ పోతుంటే ఈ మొగాళ్లకేమో తెలియకపోయె. పిల్లగాడికి జొరమోస్తేవానికేమో పట్టదాయె. నన్నేమో తిట్టి పోస్తుండు. ఇవన్ని పడలేక చచ్చిపోదామనిపిస్తు ఉంది.

సారక్క : ఛ అయేం మాటలు, అట్లగంటున్నావు. పిల్లగాళ్లనిద్దరినీ పెంచి పెద్ద చేయవద్దా? ఇంకా ఎంత కట్టపడాలి ఏంది. పిల్లగాండ్ల బతుకు నీ మీదనే ఆధారపడ్డదాయె. కన్నతల్లివి పోరిగాడి మంచి సెడ్డలు చూసి పెంచితేగంద వాడు పెద్దాడయ్యేది.

రాములమ్మ : ఆ ఏం కనటం, ఏం పెంచటం, ఎంత కట్టపడితే వాళ్లు పెద్దాళ్లవుతారో ఈ మొగాళ్లకి అర్థంకాదు.

సారక్క : సరేలేగానీ ఏంచేస్తాంమరి, అవునూ నిన్న జెండా పండుగనాడు నీ భర్తకి బనూమతి యిచ్చినారంటగా. అందరూ

సెప్పుకుంటున్నారు. మీ ఆయన నాగా పెట్టకుండా పనిజేసి అందరి కంటే ఎక్కువ టబ్బులు బొగ్గు తీసినాడంట. అందుకని ఆ బహుమతి యిచ్చినారంట. అధికార్లు నీ మొగుడ్ని బాగా పొగిడినారంట.

రాములమ్మ : ఆ సంతోషమే గానీ ఆయన బాయిలో డూటీ చేసాడంటే ఆ గొప్పతనం అయిన్దిగాదు. ఇంటి దగ్గర విషయాలు పట్టించుకోడుగా. అన్ని నేనే చూసుకోవాల కదా. ఇంటి బాధ్యత అంతా చూసుకుంటూ ఆయనికి వేళకి అన్నీ చేసిపెట్టి వండిపెట్టి టిఫిన్ కారీయ అందిస్తే డూటీ బాగా చేయటానికేముంది. పిల్లలు బాగోగులు చూసుకుంటూ అన్ని కట్టాలు నేను పడుతుంటే తనేమో గొప్పలు పోతుండు ఇంటిపని, పిల్లలని పెంచే పని నేను చేస్తుంటే నా కెవరూ బహుమతులు ఇస్తున్నారూ?

సారక్క : ఆ రావులమ్మా పిల్లల్ని కనటమంటే గుర్తుకు వచ్చినాది. పోచమ్మ పరుడు పోసుకున్నది కదా. మూడు నెల్ల బిడ్డతో పుట్టింట నుండి వచ్చిందటా. దవాఖానా కెళ్ళి నీ కొడుక్కి సూదిమందిప్పిచ్చి వస్తూ వస్తూ దారిలో చూసివదామా. బాగానీరసించి వున్నదట పోచమ్మ. ఆడోళ్లకి పురుడంటే పతిసారీ మరో జనమమాయె. (అంటూ ఇద్దరూ బయటకు వెడతారు.) (పోచమ్మ ఇల్లు) ...... (సైదులు సారా ప్యాకెట్లతో తూలుతూ వస్తాడు. లే... లేచింది మయిళా లోకం దద్దరిలింది పురుష పపంచం ... దద్దరిల్లిందా ! ఛ ఛ నన్నేంచెత్తారు. ఆడోళ్లు.)

సైదులు : ఇయాల జీతాల పండగ వారోత్సవాలు చేసుకోవాలె. పాల సంద్రంలో ఆమురతం పుట్టిందా. కాదే! యాహ్ కాదేకాదు. సారా ప్యాకెట్లలో ఆమురుతం దాగుందే సారా ఉద్యమాలోళ్లకీ ఈ సంగతి తెలవదు. సారా కంపు సారా కంపు అని ఎవరే నిన్ను అనేది? అంతా గుమగుమలే కదా. ఆ ఆడోళ్లు క్యాన్లల్లో ఉన్న నిన్ను బజార్లలో గుమ్మరిస్తుంటే నా కెంతో బాధగా ఉంది. చూడు నేను మాత్రం నిన్ను సివుడిలా కంఠంలో

దాచుకుంటా నీకోసం డూటీ కూడా మానేస్తానాయె. ఓసే! పోచమ్మ ..... ఏం చేత్తున్నాయే... ఓసే... ఒచే ...

పోచమ్మ : పెద్దగా అరవబోక పిల్లగాడు నిదరోతున్నాడు. మళ్లీ తాగొచ్చినావా ......

సైదులు : ఛత్ నాయాల్ది పుట్టింటి నుండి వచ్చిన కాడ నుండీ మళ్లి గోడవపెడ్తావుందీ. నా చిట్టి సారా... కొడుకు పుట్టలేదని యిన్నాళ్లనుంచీ తాగి తాగి బాధ తగ్గించుకున్నా. ఇపుడేమో కొడుకు పుట్టినాక సంతోసంతో తాగుతున్నా. ఈ సంగతి నా పెళ్లాం అర్దం చేసుకోదు కదా! ఓసే! పోచమ్మా.

పోచమ్మ : ఏందయ్యా మళ్లీ డూటీ ఎగ్గొట్టి వచ్చినావా. ఇలా డూటీ మానేస్తే వచ్చే నెల జీతం కోత పడ్తది కదా. ఇంట్లో సరకులు తేవాలా ఈ నెల్లో జీతం తక్కువ వచ్చింది కదా. కొడుకో కొడుకో అని మరి పలవరించినావు గందా. మరి ఇప్పుడు ఆ కొడుక్కి పాల డబ్బాకొనాలన్న టానిక్కు కొనాలన్నా డబ్బేడ నుండి వత్తది.

సైదులు : నన్ను చూస్తేసాలు గోల పెడ్తవు.. ఛత్ నోరుముయ్యి ... నేను పోయి పండుంటా.

పోచమ్మ : ఏం శెప్పినా ఆ తాగుడు మానడు కదా ... జీతం చూస్తే కోత. ఇంటి సరుకులకే సరిపోదు. నేనేదన్నా పని చేసుకుందామా అంటే కానుపు కానుపుకు నీరసించి పోతినాయా... ఇక ఈ సంసారం నేను సేయలేను. గుండెలో నొప్పిగా మంటగా ఉంది. అంటూ కుప్పలా కూర్చుంటుంది ఇంతలో సారక్క రాములమ్మ అక్కడికివస్తారు. పోచమ్మ .... రండి సారక్క మంచినీళ్లు తాగుతారా.

రాములమ్మ : వద్దులే పుట్టింటికాడ నుండి ఎప్పుడు వచ్చినావు.

సారక్క : ఏం పోచమ్మా ఎపుడు వాచ్చావు. పయానం బాగా జరిగిందా.. ఈ సారి మొగబిడ్డ పుట్టినాడుగా అంటూ (పిల్లగాడ్ని చూసి) వచ్చి ముఖం చందబింబంలా ఉంది సారక్క నీ కొడుకు మొహం.

రాములమ్మ : (ఈ లోపు తన పిల్లగాడిని ప్రక్కనే పడుకోబెట్టి దుప్పటి సర్ది వస్తుంది పోచమ్మ. తను కూడా దోమతెర తొలగించి పిల్లాడిని చూసివస్తుంది.)

పిల్లవాడు అచ్చం తల్లిపోలికే. పోచమ్మ నలుగురు ఆడపిల్లల తరువాత మగబిడ్డ పుట్టినాడుగా ఇక నట్టిల్లంతా బంగారమే...

పోచమ్మ : ఆ ఏం నట్టిల్లో .. నల్ల బంగారం .. అంతా నరకమే. ఆడక్టెరమ్మ ఈసారి మల్లి నీకు గర్భం వస్తే చచ్చిపోతావు బతకవని చెప్పింది. అయినా పెనిమిటి వంచాంకురం అని కొడుకు పుట్టాలనీ ఒకటే పట్టుబట్టినాడు. ఈ సారి కొడుకు పుట్టాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే నన్ను వదిలేసి వేరేదాన్ని చేసుకుంటానని ఒకటే గొడవ. సరేలే నా చావు ఎవరికి పట్టింది. కొడుకైతే నాకు కొరివిపెట్టడానికుంటాడట.

రాములమ్మ : అలా అనకు పోచమ్మ మగ పిల్లగాడైతే బొగ్గుబాయిలో పనికి పెట్టోచ్చని కాస్తంత ఇంటికి సాయిం చేస్తాడని సైదులు ఆశలే.

పోచమ్మ : ఆ... ఆ ఆడొళ్లకి మాత్రం బొగ్గుబాయిలో పనియిస్తే ఇంతే కొడుకు పుట్టాలంటూ గోల ఉండదుగా అసలు ఆడోళ్లకి బొగ్గుబాయిలో పని ఎందుకియ్యరు.

రాములమ్మ : ఇయ్యచ్చుగానీ ... ఆ ఆడోళ్ల ఏండూటీ చేస్తరు. కానుపు కానుపుకు అంత బలహీనం అవుతుంటే బొగ్గు ఎట్లా తీస్తారు....

సారక్క : ....? ....?

పోచమ్మ : అవును సారక్క. మొగుడు తాగొచ్చి డూటీకి నాగాపెడ్తుంటే జీతం సరిపోవట్లా. అసలు పిల్లన్ని కంటూ మన బలం అంతాధారపోయటం కంటే మనము డూటీ చేయడం నయం. ఇంత దరిద్రం అన్నా తీరుతుంది.

సారక్క : ఏంది పోచమ్మ నీ మొగుడు తాగి డూటీ మనేసినాడా. జీతాల రోజులు వచ్చాయంటే మొగాళ్ల కిదేం రోగమో. ఒకటే తాగుడు డూటీ మానేస్తారు. నేను ఈ మధ్య మా యింటాయానతో తెగేసి సెప్పినా. నువ్వు తాగొచ్చి డూటీ మానేస్తే నేను చావన్నన్నా

చస్తా. లేదా పిల్లల్ని నీ దగ్గరే వదిలి పెట్టి పోయి ఏదో గింత పని చేసుకు బతుకుతా అని చెప్పినా. కాస్తంత తాగుడు తగ్గించాడు. ఈ మధ్య సక్రమంగా డూటీకి వెడుతుండు.

రాములమ్మ : నిజంగా మనం ఏదైనా పని జేస్తే ఈ మొగాళ్ళ అరుపులు సిందులు భరించకుండా ఉండొచ్చు. ఇంట్లో పనిచేస్తుంటీ వీళ్ళకు లెక్కలేదు.

సారక్క : అట్లాగంటావేంటి రాములమ్మ. అసలు ఆడోళ్ళ డ్యూటీ చేయకపోయినా డూటీ చేసినట్లే అదెట్ల గంటవా. ఇంట్లో కట్టపడి వండి టయాంకి టిఫెన్ కారీరు అందిస్తే గంద ఈ మొగాళు ళ్ళ పనిచేసేది. మనం ఇంటిపని చేస్తాం. బజారుకెళ్ళి సరుకులు తేస్తాం. కూరానారా కొనుక్కొస్తాం మనం ఇంట్లో అన్నీ చూసుకుంటుంటేనే గంద మొగాళ్ళు నాగా పెట్టకుండా డూటీ చేస్తున్నారు. డూటీ నుండి వచ్చిం తరువాత వళ్ళు నొప్పులని రెస్టు తీసుకుంటూ పడుకుంటే ఈ పన్లు అన్నీ మనవే గంద చూసేది.

రాములమ్మ : సారక్క నువ్వు కరెట్టుగా చెప్పినావు. నిజమే వాళ్ళు డూటీ నాగా లేకుండా చేస్తున్నారంటే ఎనకాల భార్య ఇంట్లో పనిని చేసి పెట్టడం, పిల్లల్ని పెంచడం వంటి బాధ్యతలన్నీ పట్టించుకుంటూ ఇంట్లో పనంతా చూసుకుంటూ టయాంకి టిఫెన్ కట్టియిస్తుంటేనే గందా మొగొళ్ళు డూటీ చేసుకోగలుగుతారు. వాళ్ళు సరిగా డూటీ చేస్తేనె గంద బొగ్గు వచ్చేది. ఆ బొగ్గును అమ్మితేనే గంద డబ్బు వచ్చేది. ఆ డబ్బులే గంద వీళ్ళకు జీతాల కింద ఇస్తున్నది. అసలు ఆ జీతాలలో వెనకాల ఉన్న మన కట్టాన్ని కూడా అంచనా వేయాలి కదా.

సారక్క : అవును అసలు ఆ మొగాళ్ళు డూటీ చెయ్యాలంటే కూడా వెనకాల అదే మనం నెట్టి నెట్టి పంపుతుంటే వెడుతున్నారు లేకపోతే నెల్లో సొగం రోజులు తాగి యింటనే పండుకొంటారాయె.

పోచమ్మ : సారక్క! నువ్వు చెప్పింది అచ్చురాల నిజం. రేపటాల నుండి నేను కూడా నా పెనిమిటిని తరిమి డూటీ కెళ్ళేటట్లు చేయాలి.

తాగి తాగి ఎండుకుపోతున్నారు. డూటీ అంటే భయపడుతున్నారు. డ్యూటీ చేయాలంటే బలం కావాలి కదా.

రాములమ్మ : మొగుడు డూటీ చేయాలంటే బలంగా ఉండాలా. మరి ఆడిని గట్ల బలంగా పెంచి పెద్ద చేసిన ఆ కన్న తల్లి కట్టాన్ని కూడా కొలవాలి. కన్నతల్లి కట్టం కోట్ల కంటే విలువైనది. కంపెనీకి వచ్చే కోట్ల డబ్బుకట్టలో వాళ్ళ కట్టం కన్పడతాది. ఈ రోజు ఈ కంపెనీ ఇలా గుందంటే దీనికీ చరిత్ర ఉంది కాదా. ఈ బొగ్గు బాయి చరిత్రలో కార్మికుల్ని కన్న తల్లుల కట్టమే నిప్పులాగా దాగుంది. ఆ తల్లులు ఎంత ప్రసవ బాధ పడితే ఈ వీళ్ళు పుట్టారు. ఆ తల్లి తన రకతాన్ని పాలుగా మర్చి పెంచితేనే పెరిగి పెద్దవాడైతేనే గంద బాయిలో బొగ్గును ఉత్పత్తి చేస్తుండు.

సారక్క : నిజమక్కా నువ్వింత చెబుతుంటే గానీ ఆడోళ్ళ శక్తి అంటే ఏమిటో తెలుస్తోంది. ఆ బొగ్గు మండుతుంటే పత్రగా కన్పడేది. ఎర్రటి పసికందును కనే ఆ కన్నతల్లి కట్టమే కన్పడుతుందీ. అంత కట్టపడుతోందంటే ఆమె ఎంత శక్తి మంతురాలో కాదా. ఎంత శక్తి లేకపోతే పిల్లన్ని కని పెంచగలుగుతోంది.

రాములమ్మ : ఆ మనశక్తి మనం గుర్తించటమే గాని మొగాళ్ళు గుర్తించరుగా. గుర్తిస్తే, కాస్తంత వంట అలచ్చుమవగానే అంతగా అరవరు గందా. అదేమిటి అసలు ఆ పాటి ఇంటి పని మే చేయలమా – పిల్లల్ని మేం పెంచలేమా అంటారు...

సారక్క : ఈ మొగాళ్ళకి పిల్లల్ని పెంచి పెద్దచేయటం అంటే చీట్లపేక ఆడినంత సులభం అనుకుంటారు. అసలు పిల్లల్ని పెంచటమే కాదు కనమంటే తెలుస్తుంది. అప్పుడుగాని తెలీదు ఆడోళ్ళ కట్టాలు. మొగాళ్ళకాశక్తి లేదు కదా.

పోచమ్మ : అవును అది వాళ్ళ వల్ల అయ్యే పని కాదు కదా ఎందుకులే అనుకోవటం.

రాములమ్మ : అది కాదక్కా మనం మొగాళ్ళని కనమని అనడం కాదు. మన

బాధలు కాస్తంత అర్థం చేసుకుంటే కుటుంబాలలో గొడవలు తగ్గుతాయి కదా. కాస్తంత పిల్లల బాధ్యత పట్టించుకోవాలి గంద. డూటీకెళ్ళి డబ్బులు తెత్తున్నాం కదా అని అంత జబర్దస్తీగా మాట్లాడితే ఎలా? ఇవతలి వాళ్ళు మనుషులు కాదా ఏంది?

పోచమ్మ : రాములమ్మ అది మీ ఒక్క యింట్లోనే కాదుకదా అందరిళ్ళల్లో మొగాళ్ళు ఇలాగే ఉంటున్నారు గందా.

రాములమ్మ : నిజంగా సారక్క చెప్పినట్లు అసలు స్త్రీలు ఇలాంటి మొగాళ్ళను కనకుండా ఉంటే సరి. పీడాపోద్ది. (ఇంతలో టీచర్ ప్రవేశిస్తుంది)

పోచమ్మ : రండమ్మా టీచరమ్మా మిమ్మల్ని చూసి చానాళ్ళయింది. సారక్క రాములమ్మ అంటూ స్నేహితులను చూపించింది.

టీచర్ : ఏం బాగున్నావా పోచమ్మా. బాబు పుట్టాడని తెలిసింది. పుట్టింటి నుండి వచ్చి ఎన్నాళ్ళయింది. ఆడపిల్లలు బాగున్నారా. వాళ్లు అమ్మమ్మ యింటి దగ్గర ఉన్నారా. స్కూలుకెడుతున్నారా. ఇక్కడుంటే వాళ్ళ చదువు మధ్యలో ఆగిపోతుంది. (అంటూ చంటిపిల్లాడ్ని చూసి వస్తుంది) ఊ .... బాబు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అవును గానీ పోచమ్మ ఇంతకీ బాబుకేం పేరు పెట్టారు.

పోచమ్మ : గనుల ప్రాంతాలలో పుట్టాడు. గనిరాజు అని పేరు పెట్టమని పంతులోరు అన్నారట. కాని వాళ్ల నాన్నకి సినిమా వాళ్ల పేరు పెట్టాలని ఉంది వెంకటేష్ అని పిలుచుకుంటున్నారు.

టీచర్ : ఏం పేరు పెట్టినా ఆ తల్లి కడుపున పుట్టిన వాడే కదా. ఏంటీ నేనొచ్చే సరికి ఆడోళ్లు కనకుండా ఉంటే సరి. అని అంటున్నారు. ఏమిటి బాగా చర్చించుకుంటున్నట్లున్నారే.

పోచమ్మ : ఈ మొగాళ్లు ఇంట్లో బాధ్యతలేనట్లున్నారనీ అసలు మొగాళ్లనే కనకూడదని.

టీచర్ : అలాగంటే ఎలాగా చూడు ఆ బాబు ఎంత ప్రశాంతగా ఉ న్నాడో.

రాములమ్మ : ఆ ఉయ్యాలలో ఉన్నప్పుడు మగ పిల్లలు ప్రశాంతంగానే ఉంటారు. కాస్తంత పెరగగానే ఎంత అల్లరి చేస్తారో. ఆడ పిల్లలు ఇంత అల్లరి చేయరు. అదేంటోమరి చిన్నప్పటి నుండి మగ పిల్లలమని జబర్దస్తీగా తయారవుతారు.

టీచర్ : రాములమ్మ నువ్వన్నదాంట్లో సత్యముంది. అయితే మగపిల్లలు అలా తయారవుతున్నారంటే తల్లి తండ్రులు పుట్టినప్పటినుంచి ఆడపిల్ల తక్కువ మగపిల్లాడు ఎక్కువ అని భావించటమే. పుట్టుకతో పిల్లలందరు సమానమే. కాని ఆడ శిశువును ఆడపిల్లగా తయారు చేస్తారు. మగపిల్లాడ్ని గొప్పవాడిగా పెంచుతారు. తల్లితండ్రులంటే ఎవరో కాదు కదా. సమాజంలో మనుషులే కదా. అదే సమాజ సంస్కృతి అయి ఇంటిటా పాదుకు పోయింది. కొడుకు కావాలనుకోవటం, వాడే ఇంటి వారసుడని అనుకోవటం చేతనే సమాజంలో మొగాళ్లు తాము అధికులమని భావిస్తారు. తల్లితండ్రులు ఇద్దర్నీ సమంగా పెంచితేనే ఇళ్లలో బాధ్యతలను కూడా సమంగా పంచుకుంటారు.

సారక్క : అది కాదు టీచరమ్మా! వాళ్లు ఇంటి బాధ్యతలు అసలు పట్టించుకోరు. మేముమాత్రం ఇంట్లో తక్కువ పని చేస్తున్నామా. వంటింట్లో మరమనిషిగా అన్నీ టయాంకి చేసి పెడితే డూటీ చేసుకొస్తున్నామన్న గ్నానం వాల్లకి లేదు. మొగాల్లని గని పెంచి పెద్దచేసేది ఆడోల్లని గుర్తించరు కదా. అందునే పిల్లల్ని కనకుండా ఉంటే సరి. ఆడోల్ల శక్తి అంటే ఏంటో తెలుత్తది.

టీచర్ : సారక్క అలా అంటే ఎలా? సరేలే రోజు బాధలు పడీపడీ పడుతుంటే ఇలాంటి మాటలే వస్తాయిలే. మొగాళ్లు ఇంటి పనిలో పాలుపంచుకుంటే ఇలా అనిపించదు. అయినా స్త్రీల సంతానోత్పత్తి శక్తియే కదా అన్ని ఉత్పత్తి శక్తులకు మూలం. ఆ ఉత్పత్తి శక్తులే కదా పరిశ్రమలలో మూల స్థంభాలు. ఈ బొగ్గు పరిశ్రమనే తీసుకుందాం. స్త్రీలు కనిపెంచి పెద్దచేస్తేనే కదా వాళ్లు పెద్దవాళ్లు అయిన తరువాతే కదా పరిశ్రమలలో పనిచేసేది. అప్పుడే కదా బొగ్గు బయటకి వస్తుంది. ఆ బొగ్గులోనే

కదా కరెంటు కూడా తయారయ్యేది. ఆ కరెంటే కదా అన్ని వస్తువులను తయారుచేయడానికి ఉపయోగపడేది. అసలు ఈ కరెంటు పరిశ్రమలే కదా మన అందరి జీవితాలకు కూడా వెలుగునిచ్చేది. మనకే కాదు ప్రపంచానికి వెలుగు కూడా.

సారక్క : ఆ! ఇప్పుడర్థమయింది మొత్తం మీద ఈ కరెంటు వెలుగులో మన శక్తి వెలుగుతున్నట్టే ఉంది. ఈ పరిశ్రమ తయారీకి మూలం బొగ్గు. ఆ బొగ్గును తీసేది కార్మికులు. ఆ కార్మికులను కన్నది స్త్రీయే కాబట్టి స్త్రీ శక్తి ఎంత గొప్పదో ఇప్పుడు అందరికి అర్థమయింది.

టీచర్ : అందుకే బొగ్గును తీయటంగాని, ఆ బొగ్గును ఉపయోగించి కరెంట్‌ను పుట్టించటానికి పరిశ్రమలలో వస్తువులను తయారు చేయటానికి మూలం స్త్రీల సంతనోత్పత్తి అని తెలిసింది కదా. అందుకే అందరూ గౌరవించాలి. స్త్రీని కేవలం సంతానాన్ని కనే యంత్రంలా చూడకూడదు. ఆమెని ఆది శక్తిగా భావించాలి. ప్రకృతిలో ఎక్కడ శక్తి ఉంటే అక్కడ స్త్రీ శక్తి ఉంటుంది. అందుకే శక్తిని స్త్రీగాను స్త్రీని శక్తిగా భావించటం. స్త్రీల శక్తి ప్రకృతిలోనున్న ప్రతి భౌతిక శక్తిలో ఉంటుందనే కదా బొగ్గు గనుల దగ్గర, కరెంటు తయారీ సంస్థల దగ్గర స్త్రీ మాతను, ఆదిశక్తిని, ఆ దుర్గా మాతని పూజించటానికి గుడి ఉంటుంది. ఆమె అమ్మలగన్న అమ్మ అమ్మకు ప్రతి రూపం.

'ఆడదంటే అబలా
కడుపుచించుకుపోతున్న చలించక
కనబోయే పాపకోసం ఓరిమితో చిరునవ్వు నవ్వే
కోమలిని అబల అంటే సబబుగా ఉంటుందా
సరిగ్గా ఆలోచించి గౌరవించండి.

(అంతలో ఆమె కవిత్వం విప్పెను)

రాములమ్మ : నిజం నిజం. అన్నింటికి ఆజగన్మాత మూలం. (అని చెయ్యెత్తి నమస్కరించింది).

టీచర్ : సరే అలా ఆదిశక్తిని పూజించటం అంటే గుళ్లో దేవతనే

పూజించటం కాదు. మనలో ఉన్న కొత్త శక్తిని గుర్తించి పూజించటమే.

సారక్క : అంటే ఏం చేయాలి టీచరమ్మా.

టీచర్ : ముందుగా మనం తీరిక సమయాలలో మనశక్తినంతా ఉపయోగించి కొంత ఆదాయం వచ్చే పనులు చేసుకోవాలి.

రాములమ్మ : ఏం తీరికమ్మా అన్ని పనులు చేసుకోవటానికి పొద్దస్తమానం సరిపోతుంటే. రోజూ చేసిన పనే చేయటం. ఒకే రకం, విసుగొస్తుంది. ఇయాల మీ అందరితో మాటడుతుంటే కాస్తంత హాయిగా ఉంది. ఇయాలంటే పిల్లాడిని దవాఖానలో చూపించి వస్తూ వస్తూ కాసేపు కూర్చున్నా గానీ రోజు నాకు టయం ఉండదు.

టీచర్ : అలా ఇంటి పనితో విసిగివేసారుతుంటేనే మీ మెదళ్లు మొద్దుబారి ఉన్నాయి. వాటికి కాస్తంత పదును పెట్టాలి. ఇంటి చాకిరీకి మాత్రమే శక్తిని ఉపయోగిస్తే ఎవరూ మిమ్మల్ని గుర్తించరు. ఇంటి చాకిరీని మొగాళ్లు కూడా పంచుకోవాలంటే మనం కూడా వాళ్లకి లాగా ఆదాయం వచ్చే పనులు చేయటం నేర్చుకోవాలి. అప్పడాలు, వడియాలు, పచ్చళ్లు మన యింటి వరకు పెట్టుకొంటే మనకు కొంత ఖర్చు కలిసొస్తుంది, ఇంకాస్త ఎక్కువ చేసి అమ్మగలిగితే ఆదాయం వస్తుంది. మీకో ఉదాహరణ చెబుతాను. ఇంట్లో బట్టలు ఉతకటం చేసినా, వంటచేసినా రాని డబ్బు ఇంకొక చోట బట్టలుతికితేను, వంటచేస్తేనో డబ్బు వస్తోంది కదా. అంటే మనంచేసే పనులు వృత్తి పనులుగా చేసుకోగలిగితేనే ఆదాయం వస్తుంది. ఆదాయం వస్తేనే మన శక్తికి గుర్తింపు ఉంటుంది. మన శక్తిని గుర్తిస్తేనే ఈ మొగాళు ఇలాంటి పనిలో కూడా బాధ్యత వహిస్తారు.

పోచమ్మ : అయితే టీచరమ్మ మేం ఏవేమి పనులు చేయగలం అలా ఆదాయం వచ్చే పనులు కాస్త చెప్పు.

టీచర్ : ఇంట్లోనే ఏదైనా చిన్న పరిశ్రమ పెట్టుకోవచ్చు. అంటే గేదెల

పెంపకం, నర్సరీ, టైలరింగ్, బ్యాగుల తయారీ, పచ్చళ్ల తయారీ, మసాల దినుసులు ఇలాంటివి తయారుచేసి ప్యాకెట్లలో పెట్టి ఇంటింటికి అమ్మవచ్చు.

సారక్క : ఆ... చిన్న చిన్న వ్యాపారాలు చేయాలన్నా పెట్టుబడికి డబ్బు కావద్దా.

టీచర్ : అందుకే మహిళలందరూ కలిసి ముందుగా స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి పొదుపు లక్ష్మీ పథకంలో చేరాలి. మనం కొంత సొమ్ము కూడబెటితే ప్రభుత్వం మరికాస్త ఇస్తుంది. అంటే బ్యాంకుల ద్వారా రుణం యిస్తుంది. మనం కొంత సొమ్ము పెట్టాలి గనుక రోజు ఒక రూపాయిని నెలరోజులకు 30 రు.లు కూడబెట్టాలి. అలా ఒక ఏడాది పాటు చేయాలి. అదే విధంగా మరో 15 మందిని కూడా చేయగలిగితే ఈ 15 మందికి కలిపి ప్రభుత్వం రుణం యిస్తుంది. 15 మంది కలిసి ఒక కుటీర పరిశ్రమ పెట్టుకోవచ్చు దీన్నే గ్రామాల్లో డ్వాక్రా పథకం అంటారు. అలాగా ఒక కుటీర పరిశ్రమపెట్టుకొని వచ్చిన ఉత్పత్తులను అమ్మితే వచ్చే డబ్బులో కొంత రుణం తీర్చి మరికొంత ఆదాయంగా పొందవచ్చు. మళ్లీ ఆ డబ్బును పెట్టుబడిగా పెట్టి వ్యాపారాన్ని అభివృద్ధి చేయవచ్చు. అంతర్జాతీయ గుర్తింపును తెచ్చుకున్న లిజ్జత్ అప్పడాల కంపెనీతో పోటీ కూడా పడొచ్చు. అవును మనమే పదిమంది ఆడవాళ్లకు ఉద్యోగం ఇవ్వొచ్చు. అపుడు ఆర్థిక బాధలు తగ్గడమే కాక భర్త కూడా గౌరవించటం నేర్చుకుంటాడు.

రాములమ్మ : ఆ... అప్పుడు కూడా మొగాళ్లు ఇంటిపనికి సాయం చేస్తారని నమ్మకం లేదు ఇటు ఇంటిపనితోను ఇంకా పనులు ఎక్కువవుతాయి.

టీచర్ : అలా అనకు రాములమ్మ. నువ్వు నీ శక్తిని కొంత ఉపయోగిస్తే మొగాళ్ల మీద ఆర్థిక ఒత్తిడి తగ్గుతుంది. అసలు బజారులో ధరలు పెరుగుతున్నట్టుగా జీతాలు పెరగవు గనుక జీతాలు పెంచాలంటూ చీటికిమాటికి సమ్మెలు తగ్గుతాయి. అట్లా కూడా

నాగాలు తగ్గితే మనకే కాదు కంపెనీ పరిశ్రమకే కాదు, దేశం మొత్తానికి కూడా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్తాయి.

సారక్క : నువ్వు చెప్పింది బాగుంది కానీ టీచరమ్మ మాకొక సందేహం ఉంది. ఈ వ్యాపారంలో లావాదేవీలు చూసుకోవాలంటే కాస్త నాల్గు అచ్చరం ముక్కలు రావాలాయే లేకపోతే ఎక్కడు పడితే అక్కడ వేలి ముద్రలు వేస్తే మోసపోతాము.

టీచర్ : అదే సారక్క అక్షరాలు నేర్చుకోవాలని చెప్పాలనుకుంటున్నా. (ఇంతలో కమల ప్రవేశిస్తుంది) రండి కమలగారు నాకోసమేనా వచ్చింది.

కమల : అవునండీ మా అమ్మాయి ఎలా చదువుత్తుందో తెలుసుకుందామని మీ యింటికి వస్తే మీ ఇంట్లోవాళ్లు పక్కింటికి వెళ్లిందని చెపితే ఇక్కడికి వచ్చా. అవును నేనొచ్చేసరికి ఏమిటి అక్షరాలు నేర్చుకోవాలని అంటున్నారు.

టీచర్ : అవునండి వీళ్ళు సారక్క, రాములమ్మ, పోచమ్మ అని నాకు మిత్రులు. వీళ్ల ఆదాయపు మార్గాలు వెతుక్కోవాలని దానికోసం అక్షరాస్యత ఉండాలని తెలుసుకున్నారు.

కమల : మంచి తెలివిగల వాళ్లు. వాళ్లు అక్షరాలు నేర్చుకుంటామంటే నేను వీళ్లందరిని ఒక యింటి దగ్గర చేర్చి నేర్పుతాను. (నా స్నేహితులు డాక్టర్లుగా, లాయర్లుగా ఎన్నాళ్లనుంచో సమాజాభివృద్ధికి ఉపయోగపడుతున్నారు) ఇన్నాళ్లనుండి డబ్బుంది కదా అని కార్లలో షికార్లకు వెళ్లటంలో గడిపాం కాని అందులో తృప్తి కలగలేదు.

టీచర్ : సెభాష్ కమల గారు మీ నిర్ణయం నాకు చాలా నచ్చింది. మీలో ఉన్న అక్షర జ్ఞానమనే శక్తిని ఇలా సమాజానికి వినియోగించండి. దేశం బాగుపడుతుంది. అక్షరాస్యత అనేది దేశాభివృద్ధికి మొదటి మెట్టు. వీరు డ్వాక్రా గ్రూపులలో చదువు నేర్పితే డ్వాక్రా మహిళలు వాళ్ల శక్తియుక్తులను సక్రమంగా సద్వినియోగం చేసుకోగలుగుతారు.

పోచమ్మ : చాలా బాగుంది మొన్న మా పుట్టింటి ఊర్లో కూడా ఇలానే అనుకుంటున్నారు. అదేదో మహిళా సంఘాలంట.

సారక్క : మన వీధిలో మధ్యతరగతి స్త్రీలంతా కలిసి మహిళా సంఘం పెట్టుకున్నారట. రోజు బొమ్మలు తయారుచేసి అమ్ముతారట (ఇంతలో విమల ప్రవేశించింది.)

టీచర్ : రండి విమల గారు ఏమిటీ చేతిలో బొమ్మలతో సహా వచ్చారు.

విమల : ఆ... అవునండీ మన విధీలో వాల్లు పోచమ్మ బిడ్డను తెచ్చిందని చెప్పుకుంటుంటే విని పిల్లాడిని చూడొచ్చనుకుంటూ వచ్చాను బాబును ఆడించటానికి మేము తయారుచేసిన బొమ్మను తీసుకొచ్చా.

కమల : ఇంకా మీ మహిళా మడలి ఏయే పనులు చేస్తుందండి.

విమల : మా మహిళా మండలి సభ్యలు ఎంబ్రాయిడరీ, అల్లికలు, మొక్కల్ని నర్సరీ వంటి పనులు చేపట్టారండీ. ఇలాంటివి తయారుచేసుకోగా స్వయం ఉపాధిని పోందాలని అనుకుంటున్నామండి. మధ్యతరగతి స్త్రీలు తినటం, పిల్లల్ని కనటం తప్ప మరేది పట్టించుకోకుండా మరచక్రాలుగా ఉంటున్నారని మా మహిళా మండలి వాళ్లు గుర్తించారండి. వేన్నీళ్లకు చన్నీళ్లను తోడు చేయెచ్చని భావించారు. అదేకాదు అప్పుడే ఇంట్లో అత్తల సాధింపు, ఆడబడుచుల ఆరళ్లు తగ్గుతాయనిపించింది.

కమల : అదేమిటండీ ఎలా తగ్గుతాయి.

విమల : ఏముందండి ఇంట్లో సంపాదించేది భర్త, పోషింపబడేది భార్య అనే భావాల వల్లనే అత్తలు అలా ఆరళ్లు పెడతారు. తాను కన్న కొడుకే కదా అని అత్త కొడుకు తల్లిగా ఆమె మీద తానుకూడా అధికారం చెలాయిచొచ్చు అనుకుంటుంది. అత్త తన అధికారాన్ని చెలాయిసుత&ంటే కోడలు బాధపడుతుంది. అందుకే అత్తా కోడల్లు అలా శత్రువులుగా వుండకుండా ఉండాలంటే కుటుంబంలో భర్తతో పాటు భార్య కూడా

ఆదాయాన్ని తెచ్చేదయితే భర్త తనతో పాటు సమానంగా చూడగలుగుతాడు. అపుడు అత్తా ఆడబడుచులు కూడా కోడలిని గౌరవించే రోజులు వస్తాయి. ముందుగా పితృస్వామ్యం పోవాలంటే స్త్రీలు కుటుంబంలో సమానహోదాలో ఉండి నిర్ణయాధికారాలు చేయగలగాలి. అపుడే దేశాభివృద్ధికి స్త్రీల తెలివితేటలు ఉపయోగపడతాయి.

కమల : చాలాచాలా బాగుంది. ఇక భవిష్యత్తులో స్త్రీల శక్తి యుక్తులే రాజ్యవేమేలి.

టీచర్ : నిజం మిత్రులారా అందుకే స్త్రీలు రాజకీయాల్లోనికి రాగలగాలి. (అంటుంటే సమ్మక్క వస్తుంది).

సమ్మక్క : కమలమ్మగారు ఇక్కడున్నారంటే తెలిసి వచ్చాను. కారు దిగని దొరసాని యిలా కాలినడకన పోచమ్మ ఇంటికి వచ్చిందంటే చాలా ఆచ్చర్యంగా ఉంది.

కమల : చాల్లే సమ్మక్క ఊరుకో. ఏంటీ నిన్న పనికే రాలేదు.

సమ్మక్క : ఏం చెప్పమంటారమ్మ. మా ఆయన తాగొచ్చి రాతిరంతా ఒకటే గోల ఇంకా డబ్బులిమ్మంటాడు. లేవంటే ఒకటే కొట్టుడు. ఛీఛీ వెదవ జన్మ. పిల్లలికి గంజి నీళ్లుకూడా పోయడానికి డబ్బు లేకుండా చేయాలనుకుంటున్నాడు. నేను పిల్లలూ ఎందులోనన్నా పడిచస్తే వాడికి బాధ్యత తెలిసేటట్లుంది.

టీచర్ : అయ్యో అలా అనకు సమ్మక్క. వంటింటికి అతుక్కుపోతూ ప్రపంచ జ్ఞానం లేకుండా చేస్తున్నాయి. నిజంగా మనం ఈ కష్టాలన్ని తీరాలంటే మనం అంటే ఏమిటో మనం తెలిసికోవాలి మన శక్తిని ఉపయోగించి ముందుగా ఆదాయ మార్గాలు వెతుక్కోవాలి. మనశక్తిని అందరూ గుర్తించేటట్లు దేశాభివృద్ధిలో భాగస్వాములవవుదాం.

పోచమ్మ : అవును గానీ టీచరమ్మ నేను నీరసంగా ఉన్నాను. ఇక మళ్లీ గర్భం వస్తే కట్టం అంటే కూడా వినకుండా నాకిగో మగపిల్లలు కావాలంటు మా ఆయన గొడవ చేస్తే కన్నాను. గనిలో మగాళ్లకే

ఉద్యోగాలుంటాయట కదా.

టీచర్ : అలా అనకు పోచమ్మ మన మహిళలు ఉద్యమాలు చేస్తూ అన్ని రంగాల్లో స్త్రీలు ముందుకు వస్తున్నారు. ఆఫ్రికాలో స్త్రీలు గనిలోకి వెళ్లి పన్లు చేస్తారట. అందకే ఆఫ్రికాల స్త్రీలు సౌందర్యం అంటూ సన్నగా నాజుకుగా ఉండటానికి ఇష్టపడరు. చక్కగా బలంగా ఉంటారు. అందుకే గనిలో పని చేయగలుగుతున్నారు. ఇపుడిపుడే మన దేశంలో కాస్తంత బలంగా ఉన్న స్త్రీలు ఉ ద్యోగాలు చేస్తున్నారు. సైన్యంలో చేరుతున్నారు.

రాములమ్మ : ఆ ... అవును ఆడవాళ్లు సన్నగా నాజుగ్గా కాకుండా బాగా తిండితిని బలంగా ఉండాలి. అపుడు ఆడవాళ్లకు కూడా గనిలో ఉద్యోగాలు వస్తాయి.

పోచమ్మ : ఆ ... ఒక పక్క అబ్బాయి పుట్టలేదంటూ మొగుళ్ళు అంటూ ఆరు కాన్పుల వరకు ఒకటే వేధింపులు చేస్తుంటే స్త్రీకి బలము ఎలా ఉంటుంది.

సారక్క : అందుకే ఆడవాళ్లు పనికిరారంటు ఉద్యోగాలు చేస్తున్నా తక్కువ జీతాలు ఇస్తారు ఎంత కష్టపడ్డా ఇంతేగా.

టీచర్ : అసలు మహిళలు ఇద్దరు బిడ్డలు చాలని ఒక నిర్ణయానికి రావాలి. ముందుగా మన ఆరోగ్యం బాగా చూసుకోవాలి. ఆ తర్వాత బంలగా ఉండేటట్లు చూసుకుంటే గనిలోనూ స్త్రీలు పనిచేయగలరని నిరూపించుకోగలరు. సారక్క, రాములమ్మ, పోచమ్మ కలిసి ఒక గొప్ప మహిళా శక్తిగా, విజృంభిస్తే అన్నీ ఆలోచించగలరు. మహిళగా శక్తి యుక్తిల్ని అంతటా ఉ పయోగించుకోగలరు. ఆకాశంలో సగం ఆక్రమించి అంత ఎత్తుకు ఎదగగలగాలి.

రాములమ్మ : అపుడికి ఈ మొగాళ్లతో సమంగా ఉంటే వీళ్లు పెట్టే బాధలు పడక్కరలేదు. గనుల్లో ఉద్యోగాలే కాదు భూగర్భం నుంచి ఆకాశానికి నిజంగా నిచ్చెనలు వేయవచ్చు.

పోచమ్మ : అంతే కాదు నిజంగా ఆ నల్లటి బొగ్గు మండుతుంటే ఎర్రగా

కనపడే ఆ శక్తి మహిళా శక్తియే అని అనిపించకమానదు.

కమల : అంతే కాలు స్త్రీల జీవితంలో చీకట్లు మాయమయి తన శక్తిని గుర్తించ గలిగే ఎర్రని చైతన్యం వచ్చి తెల్లటి వెలుగు పుడుతోంది ఆ వెలుగే అందరి జీవితాల్లో చల్లటి వెలుగుగా ప్రసరింపచేస్తుంది.

సైదులు : ఇందాకటి నుండి లోపలికి వినపడుతున్నాయి మీ మాటలు నా మత్తు వదిలిపోయింది. నేనిక డ్యూటికి పోతాను త్రాగుడుమానేస్తాను. ఈ రోజు నుండి మా మగాళ్లనందరినీ కూడబెట్టుకుని మేము మీకు సహకరిస్తాం. మీ శక్తిని మా కోసం కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడటమే మాకు సంతోషం. (కొమరయ్య, రామయ్య ప్రవేశిస్తారు). రామయ్య గారు, కొమరయ్య రండి రండి అలా వరండాలో నుంచుని ఉండిపోయారేంటి?

టీచర్ : ఏంటి అలా నిలబడిపోయారెందుకు? నాకోసం వచ్చారా? ఇక్కడ మాట్లాడుతుంట ఆలస్యమయింది. ఇదిగో వచ్చేస్తున్నాను ఇంటికి.

రామయ్య : తొందరేం లేదమ్మా! నా కూతురేనా ఇలా మాట్లాడుతోందని ఆనందపడుతూ వింటున్నారమ్మా ఎంత ఎదిగి పోయావమ్మా, నువ్వు చదువు కున్నావు కాబట్టే యింతబాగా అర్ధం చేసుకోగలిగారమ్మా కంపెనీ సింగరేణి మహిళా కళాశాల పెట్టి ఎంత మంచి పని చేసిందమ్మా. అందరూ చదువుకోబట్టే కదా నువ్వింత జ్ఞానాన్ని పొందావు. చుట్టూరా వాళ్లకి చెబుతున్నావు. సమాజంలో విద్యార్థులు అందరు ఎలా నిలదొక్కుకోవాలి చెప్పి. మహిళలు సమాజసేవలో పాల్గొని మానవాభివృద్ధికి సహాయపడే విషయాలను తెలియజేస్తే ప్రజలందరూ చైతన్యాన్ని తెచ్చుకొని కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారు. అప్పుడు అందరూ హాయిగా బ్రతకుతాం.

(1999 డిసెంబరు 5 వ తారీఖున సింగరేణి మహిళా కళాశాల ఆడిటోరియంలో ఈ నాటకం విద్యార్థినుల చేత ప్రదర్శించ బడింది.)

వసతివనే వనితా కేళి

(హాస్టల్ గదిలో నిద్రిస్తున్న వసంతను సరోజ నిద్రలేపుతూ)

సరోజ : అయ్ ! వసంతా లేవవే .. అప్పుడే ఆరయింది. కిటికీలోంచి ఎండ ఎలా పడుతోందో చూడు .. లేఁ లేఁ నీ బద్ధకం పాడుగానూ మహారాణీగారు లేవాలి ... లేవాలి.

వసంత : అబ్బా ! ఆపవే నీగోల. ఇంత ప్రొద్దునే నిన్నెవడు లేపమన్నాడే మన తెలుగు మేడమ్ చెప్పిన పాఠం గుర్తుకు వచ్చిందా ఏమిటి?

సరోజ : ఆహాఁ రాణి గారికి తెలుగు మేడమ్ గుర్తుకు వచ్చినందుకు సంతోషం ఆ రోజుల్లో రాజు గారిని లేపటానికి సౌఖశాయనికులనే రాజభటులుంటేవారట.

వసంత : రాణి గారిని గుర్తుకు తెచ్చి నా నిద్ర కాస్త పాడుచేసావుగా ! అమ్మో రాణి మేడమ్ చెప్పిన లెక్కలు చెయ్యాలి.

సరోజ : అమ్మయ్య మనం ఎక్కడున్నామో గుర్తొచ్చినందుకు సంతోషం. ఇది కాలేజీ అనీ, హాస్టల్‌లో ఉంటున్నామనీ గుర్తుంటే ఇంత ఆలస్యంగా లేస్తావా పద వెంటనే స్నానం చెయ్యకపోతే ఆ బాత్‌రూమ్ దగ్గర క్యూ కట్టాలి.. ఉ .. ఉఁ త్వరగా...

వసంత : ఆఁ ... లేకపోతే రాణి గారికి టబ్బున్న బాత్ రూమ్ చెలికత్తెలు వన విహారాలు వగైరాలు ఉంటాయా?

సరోజ : అలా పరిహసిస్తావెందుకూ... మన హాస్టల్ అంటే నాకు చాల ఇష్టం. ఇక్కడ చెట్లను చూస్తు ఉంటే బృందావనం గుర్తుకువస్తుంది. ఇక్కడ అందరం కలిసిమెలిసి ఉండగా ఎంతో హాయిగా ఉంటుంది. బృందావనం .... బృందావనం ....

వసంత : ఆ ఁ రాణి గారికి కవిత్వం వచ్చేటట్లుంది. బృందావనమందరిదీ ... గోవిందుడు ... గోవిందుడు అందరివాడేలే ... అందరివాడేలే ... లే... కొంపదీసి గోవిందుడెవరన్నా ఉన్నాడా ....

సరోజ : ఛ.. ఛ... వసంతా ! ఏమిటే అలా మాట్లాడుతావు ... గోవిందుడు ... గోపాలుడు .... భూపాలుడు ... అంటు వాళ్ళనెవరు తలస్తారే. కృష్ణుడి పేరు పెట్టుకొని అందరూ వెర్రివేషాలెయ్యటానికే ఆవర్ణనలు ... ఆ కథలు పుట్టాయని మన తెలుగు మేడం చెప్పలేదు...

వసంత : మేడం చెబుతుంటే నిజమేనని పిస్తోంది. మగవాళ్ళ మాయాజాలంలో పడి మహిళలు పడతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు... శెలవల్లో మా ఊరికి వెళ్ళానుచూడు అక్కడి నుండి వచ్చే ముందు రోజు మా యింటి ప్రక్కన పెద్ద గొడవ జరిగింది. రైలు ఎక్కే ముందు మూడ్ అప్ సెట అయిందనుకో...

సరోజ : ఏమిటో అంతమూడ్ ఆఫ్ అయ్యే విషయం

వసంత : మన మేడం సాహిత్యం చెబుతూ సమాజంలోని మానవ మనసత్వాలు విశ్లేషిస్తుంటే ఏమిటో అనుకున్నాను. మగవాళ్ళతో పాటు మహిళలు సమానంగా లేరని చెబుతుంటే ఆలోచించాలనుకున్నాను. కాని మొన్న యింటి దగ్గర జరిగిన సంఘన తెలుగు పాఠం అద్దంలో కనబడినట్లు కనబడింది.

సరోజ : తల్లీ వసంతా ! నాకు తెలుసు నీకుండే రచనా స్పృహ నువ్వొక కథకురాలివిగానీ అసలు విషయం ఏమిటో చెప్పు ఉత్కంఠ భరించలేకుండా ఉన్నాను.

వసంత : ఏం లేదు ... మా ప్రక్కింటి ఆమె చాలా మంచిదే. ఆమె భర్త మాత్రం తాగుబోతు. తాగొద్దని భార్య చెబితే ఆమె మీద చెయ్యి చేసుకుంటాడుగానీ ప్రయోజనం లేదు.

సరోజ : ఎందుకి ఈ మొగాళ్ళకీ పాడు అలవాటు పాడు బుద్ధులు. ఇలా పెళ్ళాల్ని కొట్టే హక్కు వీళ్ళకెవరిచ్చారో ...?

వసంత : ఎవరిచ్చారే మనమే యిచ్చాం .. అందుకే వాళ్ళకి అజులుమ్... ప్రక్క రూమ్‌మేట్ సుమిత్ర ... ఆడుతు పాడుతూ పని చేస్తుంటే .... సలుపే లేదులే.. పాటను హోమ్ చేస్తు ప్రవేశిస్తుంది.

సుమిత్ర : హాయ్ ! హాయ్ ! రోజా .. వసంత .. ఏమిటీ? యిద్దరూ ఏదో వాదించుకుంటున్నారు. ప్రక్కరూంలోకి వినబడుతోంది. ఎప్పుడు

చూసినా మీ కిద్దరికీ ఒక్క క్షణం పడదు. మళ్ళీ ఏమో తిక్ తిక్ ఫ్రైండ్స్ అసలు మనలో మనం యిలా కొట్టుకుంటామని తెలిసే మగాళ్ళు ఆడవాళ్ళను చులకన చేసి మాట్లాడుతారు. ఆడదానికి ఆడదే శత్రువనీ ..

వసంత : ఆపుతల్లీ ఆపు ... అసలు కారణం .. మన మేడం చెప్పారు కదా ఎక్కడ అధికార వ్యవస్థ ఉంటే అక్కడల్లా ఎక్కువ తక్కువలుంటాయి. సమానత్వం రాజ్యంగంలో వ్రాయబడినది కాని అచరణ మాత్రం అంతా విరుద్ధమే. నువ్వు వచ్చే సరికి ఆ... మొగాళ్ళ ఆధిపత్యమే మాట్లాడుకుంటున్నాం.

సుమిత్ర : ఒహో... అదా అంత తీవ్రంగా మాట్లాడుకుంటున్నారు. నిజమేనే ... చాలా గట్టిగా తీక్షణంగా ఆలోచించాల్సిన విషయమేఅది. ఇంటా బయటా కాలేజీలో అన్ని చోట్ల వాళ్ళ ఆధిపత్యమే.

సరోజ : అట్లానే వుంటుంది మరి మనం నోరుమూసుకొని ఉరుకుంటూ కూర్చుంటే

వసంత : ఊరుకోకపోతే ఉరేసుకోమంటారు. ... ఆడవాళ్ళు మరి అనుభవించాల్సిందే. మగాళ్ళు జీతం తెచ్చి పెట్టి పోషిస్తున్నారుగా.

సరోజ : ఆఁ మగాళ్ళు ఉద్యోగం చేస్తున్నారని అలా ఉన్నారు అంటున్నావు కాబట్టి మనం కూడా దానికి విరుగుడుగా ఉద్యోగాలు చెయ్యాలి. మన తిండి మనం తింటే వాళ్ళ జులుం ఉండదుగా..

సుమిత్ర : ఆఁ .. ఆఁ... ఒక్క ఉద్యోగం చేస్తే హాయిగా ఉంటామనీ, ఆడవాళ్ళ మీద మగవాళ్ళ అధికారం తగ్గుతుందనీ అనుకోకు. మా ఊళ్ళో ఉద్యోగం చేసే ఒకామె ఉంది. చాలా పతివ్రత అతడు మాత్రం సతుల వ్రతం చేస్తాడు. వాడికే ఉద్యోగం సద్యోగం లేదు. ఈమె జీతం రాళ్ళతోనే యింట్లో ఖర్చు గడుస్తుంది. ఇంటిపని అంతా ఆమె చేసుకోవాలి. వాడికి ఉద్యోగం లేకపోయినా ఇక్కడపుల్ల తీసి అక్కడ పెట్టిన పాపానపోడు. ఇంట్లో పని కాస్త చేసి భార్యకు సహాయకంగా ఉండాలనే జ్ఞానం కూడా వాడికి లేదు.

సరోజ : ఆ ఇంటి చాకిరీ అంతా..... ఆడవాళ్ళపని అని వాళ్ళ నమ్మకం.

మగాళ్లు ఉద్యోగం చేసి తెచ్చి పెడుతుంటే ఇది వరకు ఆడవాళ్ళ ఇంటి పని చేసేవారు. ఆ లెక్కన ఇప్పుడు ఆడవాళ్ళు ఉద్యోగం చేసి ఇల్లు గడుపుతుంటే మరి మగాళ్ళు అంట్లు తోమాల్సిందే.

వసంత : ఇద్దరూ చాలా బాగా మాట్లాతున్నారు గానీ అంట్లు ఎవరు తోమాలి అని వంతులు పోయికాని నువ్వంటే నువ్వని కాదే వాదాచుకోవాల్సింది. ఇంట్లో పని అయినా బయట పని అయినా ఇద్దరూ చేసుకోవాల్సిందే. ఇంటి పనిని భార్యాభర్తలిద్దరూ కలిసి పనిని పంచుకొని చేసుకోవాలిగానీ ఎంచుకొని చేయగూడదే. ఇది మగాడిపని ఇది ఆడవాళ్ళు చేసే పని అని ఉండకూడదు.

సుమిత్ర : బాగా చెప్పావు వసంతా. అలా చేసుకుంటేనే సమానత్వం వచ్చేది. అలా ఉంటే ఎవరి మీద ఎవరికీ ఆధిపత్యం, అధికారం ఉండదు. హాయిగా ఉంటాయి కుటుంబాలు.

సరోజ : ఎవరి గురించో కాదు ఆలోచించాల్సింది. మన గురించి మనం ఆలోచించాలి ముందుగా మనం బాగా చదువుకొని ఉద్యోగం చేసుకుంటే అప్పుడు ఈ విషయాలన్నీ ఆచరణలో పెడదాం. ..

వసంత : సరోజ చాలా చక్కటి విషయాన్ని చెప్పింది అలా జరిగినప్పుడే సమాజం బృందావనంలా ఉంటుంది.

సుమిత్ర : బృందావనం ఏమిటీ ఇంటిని నందనవమే చేసుకోవచ్చు.

సరోజ : ఆనందవనంలో నేనొక సరోజాన్ని ...

వనిత : బృందావనమది అందరీది అంటూ వచ్చి తన మంచం దగ్గరున్న చిన్న స్టూలు పై పెట్టిన దేవుళ్ళ ఫోటోలల్లోని కృష్ణుడి ఫోటో వేపు చూస్తు ... నేను రాధనేయ్.... నేనే రాధనోయీ గోపాలా...

సుమిత్ర : ఏమిటి ఈ పిచ్చి మాలోకం ... మగాళ్ళకు ఇద్దరూ భార్యలుండడం కరెక్ట్ అనుకుంటూ ఆ పాట అదీను .. మగ ప్రపంచం ఎంత మందినైనా పెళ్ళి చేసుకోవచ్చుని అందరికీ చెప్పకుండానే అర్థం అవటానికీ, మనస్సులో ముద్ర పడటానికీ దేవుళ్ళకు రెండవ పెళ్ళిల్లు చేయటం. కృష్ణుడికి 8 మందితో పెళ్ళిళ్ళు అయినట్లు వ్రాయటం... ఇవన్నీ మగవాళ్ళ వాళ్ళకు ఇష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా

ఉండోచ్చనీ వాళ్ళ అధికారాల్ని తెలపటానికీ ఇలాంటి పాటల్ని మగకవులు బాగా వ్రాస్తున్నారు. ఆడవాళ్ళమే ఆ పాటల్లోని కుట్రని అర్థం చేసుకోలేక ఆ పాటలను పాడుకుటూ తన్మయులౌతున్నాం. ఇదిగో ఈ వనితను చూడు ... దీనిల్లాంటి వారే ...

వనిత : ... వెంకటేశ్వరస్వామి క్యాలెండరు దగ్గరకు వెళ్ళి దణ్ణం పెడుతూ... శ్రీదేవి వంకకూ చిలిపిగా చూడకు .. అలివేలు మంగకూ అలుక రానీయకు...

సరోజ : వనిత లాంటివాళ్ళు అలాంటి భావాల్నే వంటపట్టించుకుంటూ దానిలోని కుట్రని ఆలోచించకపోవటానికి వీల్లేకుండా దేవుళ్ళకు రెండు పెళ్ళిళ్ళు చేయించి ఇద్దర భార్యలతో ఉన్న దేవుడి ఫోటోలను ప్రతి ఇంట్లో క్యాలెండర్లుగా తగిలించుకునే పద్ధతిలో ప్రచారం చేస్తున్నారు. తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి అనీ వనతను చూస్తే అర్థం అవుతుంది.

(దూరంగా మైకులో నుండి నారీ... నారీ .. నడుమ మూరారి ... పాట వినబడుతుంది ... వనిత ఆ పాటను అందుకుంటుంది.)

సుమిత్ర : కవులు ఇలాంటి పాటలే వ్రాస్తుంటే ఆడపిల్లలకి ఇక ఎప్పటికి అర్థం అవుతుంది. దానిలోని కుట్ర ఇల్లంటే బృందావనమనీ, మొగుడ్ని కృష్ణుడిలాగా ఊహించుకుంటూ మధురోహలో తేలిపోతుంటే వీళ్ళకి తెలివి ఎలావస్తుంది ఇక.

సరోజ : బృందావనం .. నందనవనం... వద్దు కాని అవన్నీ కలల్లోనూ, స్వర్గంలోనే ఉంటాయి. తీవ్రంగా చర్చించే సరికి ఓపిక పోయింది. కాసేపు తోటలోకి వెళ్ళోద్దామే .. ఆనందంగా ఉంటుంది.

వసంత : అయితే సరోజా... నువ్వు మీ ఇంటి ముందు వన్నాన్ని పెంచితే ఇంటి చుట్టూరా బాగా చెట్లు, పూలు, చక్కటి ఇల్లు మంచిమొగుడు, భార్యా భర్తలు ఉద్యోగాలు చేసుకోవడం ... ఒకరినొకరు .. ఆ .. ఆ కవి చెప్పినట్లుగా, కొసరి ఏమోయీ.. అని పరస్పరం పిలుచుకోవటం..... వారెవ్వా ఆడుతూ పాడుతూ ఇద్దరూ పనిచేసుకోవటం నిజంగా ఇల్లు స్వర్గతుల్యం ఇంట్లోనే ఆ నందనవనం.

సుమిత్ర : వసంత కవిత్వం చెప్పేస్తోందే. ఊహల్లోకి వెళ్ళిపోయి కలలు కనేస్తోంది. నేను మాత్రం వసతివనే ..వనమాలీ. అని పాడుకోవాల్సిందే

వసంత : ఊహలు అపోహలతో కొట్టిపడెయ్యకు ఈ నాటి ఈ ఉహలే "ంపటి బృందావనం"లో మధరుగానాలు అవుతాయి.

సరోజ : అవును .. ఈనాడు వసతివనే .. వనకేళి అంటు వసంతగానం ఆలపిస్తేనే మహిళా జీవితంలో మధురగానం వినిపిస్తుంది.

వనిత : తందనానా... భళీ .. తందనానా...

సుమిత్ర : అప్పుడే మనందరం కలిసి తందనానా .. అని పలకాల్సిందే భౌతిక వాతావరణానికి చెట్లు నాటటం ఎంత ముఖ్యమే మానసికంగా మనుష్యులు ప్రేమగా ఉండటానికి ఈ నాటి మన వనకేళి ఎంతో అవసరమే. 'వనం' అంటే చెట్లు అనే అర్థమే కాకుండా రక్షణ అనికూడా అర్థం మనలో ఈనాడు కలిగిన ఈ చైతన్యమే మహిళలకు రేపటి రక్షణ అవుతుంది ఈ వనకేళి ఈ వసతివనం ... వనితాకేళి ఆ... ఏమి చైతన్యం .. ఏమి చైతన్యం ... మహిళలంతా ప్రగతి సాధించాలి... మహిళ్ళారా వర్ధిల్లండి .. వర్ధిల్లండి

వనతి : వసతివనే వనకేళీ ... మనకేళీ .. వనితా కేళీ .. వసంత కేళీ.